Estd. 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

సంపుటి: 60 • సంచిక: 230 • గురువారం 24 ఆగస్టు 2017 • విజయవాడ ✻ పేజీలు: 22 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి: శుద్ధ తదియ రా. 9.30 వరకు, అనంతరం చవితి; నక్షత్రం: ఉత్తర సా. 4.01 వరకు, అనంతరం హస్త; అమృతకాలం: ఉ. 8.45 నుండి 10.20 వరకు; వర్జ్యం: రా. 12.38 నుండి రా. 2.16 వరకు; దుర్ముహూర్తం: ఉ. 9.59 నుండి 10.50 వరకు, తదుపరి మ. 3.05 నుండి 3.57 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు

ఓటెత్తిన చైతన్యం



నంద్యాల @ 79%

ఓటింగ్ యంత్రాల్లో తీర్పు నిక్షిప్తం



నంద్యాల, ఆంధ్రప్రభ: నంద్యాల ఉప ఎన్నిక బుధవారం స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. గతంలోకన్నా అత్యధికంగా 79.20 శాతం ఓటింగ్ నమోదైంది. వీరిలో మహిళలు 88,503 మంది కాగా, పురుషులు 84,831 మంది వున్నారు. పోలైన మొత్తం ఓట్లు 1,73,335. సాయంత్రం 6 గంటల వరకూ క్యూలో వున్నవారికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. మొత్తం 255 పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ జరగగా, నంద్యాల రూరల్‌లో 57పోలింగ్ స్టేషన్లు, టౌన్‌లో 159, గోస్పాడులో 39 వున్నాయి. నియోజకవర్గంలో అత్యధికంగా గోస్పాడు మండలంలో 90.81 శాతం నమోదైంది. అదే విధంగా రూరల్ పరిధిలో 87.61 శాతం, టౌన్‌లో 74.06 శాతం పోలింగ్ నమోదైంది. నంద్యాల టౌన్ మొత్తం ఓట్లు 1,05,629 వుండగా, వారిలో పురుషులు 51,419 మంది, మహిళలు 54,218 మంది వున్నారు. గోస్పాడు మండలంలో పురుషులు 12,867 మంది, మహిళలు 13,325 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నంద్యాల రూరల్‌లో పురుషులు 29,554 మంది, మహిళలు 20,960 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ నెల 28 వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగనుంది. రెండు దశాబ్దాలలోనే అత్యధిక పోలింగ్ శాతం నమోదైన నంద్యాలలో పోటీ నువ్వా, నేనా అన్న విధంగా సాగింది. పోలింగ్ ప్రారంభం అయినప్పటినుంచి రూరల్‌ప్రాంతాల్లో కొన్ని చోట్ల తొలి మూడు గంటల్లోనే 50 శాతం పోలింగ్ నమోదైంది. అదే విధంగా మధ్యాహ్నం 3 గంటలకు 71.91 శాతం పోలింగ్‌నమోదుకాగా, ఆరు గంటల సమయానికి 79.20 శాతం

➪ 8వ పేజీలో...

పోలింగ్ ప్రశాంతం

• 28న ఓట్ల లెక్కింపు • భన్వర్‌లాల్



2 లో



2 లో

సైలెంట్ ఓటింగ్!

• మహిళా ఓటర్లే కీలకం



• రైలు ప్రమాదాలకు బాధ్యత నాదే • ప్రధానిని కలిసిన సురేష్ ప్రభు • మంత్రి పదవికి రాజీనామా చేస్తానని ప్రకటన • తొందరపడొద్దని సూచించిన మోడీ • రైల్వే మంత్రి నిబద్ధతను ప్రశంసించిన అరుణ్ జైట్లీ

తప్పుకుంటా... అనుమతివ్వండి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : భారతీయ జీవనాడిగా చెప్పుకునే రైల్వేలో సమూల సంస్కరణలకు తెరలేపిన రైల్వే మంత్రి సురేశ్ ప్రభుకు వరుస ప్రమాదాల సెగ తగిలింది. ఇప్పటికే ప్రతిపక్షాలతో పాటు సామాజిక మాధ్యమాల్లో ప్రజల నుంచి కూడా నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలంటూ వస్తున్న డిమాండ్లు ఆయనపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. కేవలం వారం వ్యవధిలో వరుసగా రెండు రైలు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో తాను తీవ్ర మనస్తాపానికి గురయ్యానని రైల్వే మంత్రి సురేశ్ ప్రభు తన ట్విట్టర్ ఖాతాలో వెల్లడించారు. దశాబ్దాలుగా వేళ్లూనుకున్న నిర్లక్ష్యాన్ని సమూలంగా రూపు మాపడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, ఈ మధ్య వరుసగా చోటుచేసుకున్న ప్రమాదాలు తనను తీవ్రంగా కలచివేశాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిసి ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానని చెప్పారు. అయితే కొంత కాలం పాటు వేచి ఉండాల్సిందిగా మోడీ సూచించారని సురేశ్ ప్రభు వెల్లడించారు.

ఈ నెల 19న సాయంత్రం గం. 5.30 ని. ల సమయంలో ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ సమీపంలో కళింగ ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు

➪ 8వ పేజీలో...

రైల్వే బోర్డు కొత్త ఛైర్మన్‌గా అశ్వని లొహాని

5 లో



• ఆంధ్రా తొలి సీఎంగా అద్భుత కృషి
• పట్టిసీమ లేకుంటే కృష్ణా డెల్టా ఎడారే
• ప్రపంచ రాజధానిగా అమరావతి
• పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు
• ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రకాశం పంతులు మనకు ఆదర్శం

అమరావతి, ఆంధ్రప్రభ : దేశ స్వాతంత్ర్యానికి , ఆంధ్ర రాష్ట్ర సాధనకు సర్వం త్యాగం చేసిన మహనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులని, ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం సమీపంలోని ప్రకాశం పంతులు విగ్రహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఎంతో మంది త్యాగధనుల పోరాట ఫలంగా స్వాతంత్ర్యం సిద్ధించిందని, ఈ పోరాటంలో ప్రకాశం పంతులుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కొంత మంది మహానుభావులు చరిత్రలో నిలిచిపోతారని, అలాంటి వ్యక్తుల్లో

➪ 8వ పేజీలో...

ఓబీసీల వర్గీకరణకు కేంద్రం పచ్చజెండా

• క్రీమీలేయర్ రూ.8 లక్షలకు పెంపు • కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం • 12 వారాల్లోగా నివేదిక • అందరికీ సమానంగా రిజర్వేషన్ ఫలాలు • కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : దేశంలో వెనుకబడిన తరగతుల ప్రజలకు మేలు చేసే కీలక నిర్ణయం కేంద్ర మంత్రివర్గం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ ఓబీసీల వర్గీకరణకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఓబీసీలను వర్గీకరించేందుకు ఒక కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో అమలవుతున్న వర్గీకరణను జాతీయ స్థాయిలో అమలు చేసేందుకు కేంద్రం సంకల్పించింది. దీంతో వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు అనేక ఇతర రిజర్వేషన్ ఫలాలను సమానంగా అందుకునే వెసులుబాటు ఏర్పడనుంది. అలాగే ప్రస్తుతం ఏడాది ఉన్న రూ.6 లక్షల క్రిమీ లేయర్‌ను

➪ 8వ పేజీలో...

బ్యాంకుల విలీనాలు వేగవంతం

• కేంద్ర కేబినెట్ ఆమోదం
• మంత్రుల ప్యానెల్ ఏర్పాటు

6 లో

ఇన్ఫీ ఛైర్మన్‌గా నీలేకని!

• ప్రమోటర్లు, ఇన్వెస్టర్లదీ అదేమాట
• ఆయన రాకతో కంపెనీ గాడిన పడేనా?



6 లో

రెండు లక్షల రైల్వే జాబ్స్

• భర్తీపై దృష్టి పెట్టిన మంత్రిత్వ శాఖ
• భద్రత, నిర్వహణ విభాగాల్లో ఖాళీలు




5 లో



తంబిల కుర్చీలాట

• పళనిని దించేందుకు చిన్నమ్మ ఎత్తులు
• జైల్లో నుంచే చక్రం తిప్పుతున్న శశికళ
• బల పరీక్షకు ప్రతిపక్షాల డిమాండ్
• గవర్నర్ విద్యాసాగర్‌కు ఫిర్యాదులు
• దమ్ముంటే కూల్చండంటూ పన్నీర్ సవాల్

5 లో







ఉద్యానవనంకు జీఎస్టీ సెగ



• రాష్ట్రంలో మందగించిన సాగు • లక్ష్యాలను చేరని ఉద్యానవన శాఖ

అమరావతి, ఆంధ్రప్రభ : ఒకే దేశం.. ఒకే ప్రజ.. ఒకే పన్ను అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం విప్లవాత్మకంగా ప్రవేశపెట్టిన జీఎస్టీ వ్యాపార రంగానికే కాకుండా వ్యవసాయ రంగానికి కూడా సెగ తగిలింది. ప్రధానంగా జీఎస్టీదెబ్బతో ఉద్యానవన రైతుకు అదనపు భారం ఏర్పడింది. దీంతో ఈ ఏడాది ఉద్యానవన సాగు మందగించింది. జీఎస్టీ తాకిడితో సంబంధిత శాఖాధికారులు లక్ష్యాలను చేరుకోడానికి ఇబ్బందులకు గురౌతున్నారు. రాష్ట్రంలో ఏడాదికేడాది రైతులు ఉద్యానవన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఋతు పవనాల మంద గమనం, జలాశయాలు నిండక పోవడంతో సాధారణ రైతులు ఉద్యానవన పంటలపై మక్కువ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి యేటా ఉద్యానవన పంటల విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. వీరికి బాసటగా ప్రభుత్వం అనేక రాయితీలు కల్పించింది. ప్రధానంగా మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించి సబ్సిడీలను అధికమొత్తంలో ఇవ్వడంతో రైతులు సూక్ష్మసేద్యం వైపు ఆసక్తి

➪ 8వ పేజీలో...

మంత్రి గంటాకు నాన్ బెయిలబుల్ వారెంట్

3



మాజీ మంత్రి శత్రుచర్లకు రూ.2.25 లక్షల జరిమానా

3

ప్రపంచం మెచ్చేలా అమరావతి

● సకల సౌకర్యాలకు నెలవుగా పరిపాలన నగరం ● సెప్టెంబర్ 13కు తుది ఆకృతులు ● నార్మన్‌పోస్టర్స్, సీఆర్డీఏ సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రపంచమంతా మెచ్చేలా అమరావతి నగర నిర్మాణం జరగాలని, పరిపాలన నగరం సకల సౌకర్యాలకు నెలవుగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఉద్యోగులు, అధికారుల్లో అలసట, ఒత్తిడి కనిపించని విధంగా ఒక మంచి వాతావరణం ఉండేలా చూడాలని సిఆర్డీఏ, లండన్ నార్మన్ పోస్టర్స్ బృందానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. గూగుల్, ఇన్ఫోసిస్ తరహాలో సచివాలయం , శాఖాధిపతుల కార్యాలయాలు ఉండాలన్నారు. కొత్తగా నిర్మించబోయే ఈ కార్యాలయాలు కార్పొరేట్‌కు దీటుగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలంటే ఏళ్ళ తరబడి పేరుకుపోయిన, దుమ్ముకొట్టుకుపోయిన ఫైల్స్, చెక్క బీరువాలు, బల్లలు, వైర్ కుర్చీలు గుర్తుకు వస్తాయని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అలా కాకుండా పరిపాలన నగరం అత్యాధునిక పరిజ్ఞానంతో ప్రస్తుత జీవన శైలికి అద్దంపట్టాలన్నారు. కొత్త సచివాలయంలో ఎక్కడా భౌతికంగా ఒక్క ఫైల్‌కూడా కనిపించకూడదని, ప్రతీ ఫైల్ ఆన్‌లైన్‌లోనే ఉండాలని స్పష్టం చేశారు. అప్పుడు అధికారులు అవసరాన్ని, సందర్భాన్ని బట్టి తమ ఇళ్ళ నుంచే ఫైళ్ళ క్లియరెన్స్ చేసే అవకాశం ఉంటుందన్నారు. కొత్తగా నిర్మించనున్న పరిపాలన నగరాన్ని చూసిన వారంతా అబ్బురపడేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కోరారు. బుధవారం ముఖ్యమంత్రి ఉండవల్లిలోని తన నివాసంలో సిఆర్డీఏ, నార్మన్ పోస్టర్స్ బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, అధికార యంత్రాంగంలో సృజనాత్మకతను వెలుగులోకి తెచ్చేలా కట్టడాలు ఉండాలని స్పష్టం చేశారు. గత సాంప్రదాయాలకు భిన్నంగా ఉండడంతో పాటు ఉద్యోగులు, సిబ్బందితో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు కూడా ఉత్సాహం , ఉత్తేజం కలిగేలా భవనాలు ఉండాలని అన్నారు. దీనికి తగ్గట్టుగా వినోద, అహ్లాద, క్రీడా సదుపాయాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖల కార్యదర్శులు, శాఖాధిపతుల కార్యాలయాలు వేర్వేరుగా కాకుండా ఒకే ప్రదేశంలో ఉండాలని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన సూచనలకు అనుగుణంగా నార్మన్ పోస్టర్స్ బృందం రూపొందించిన కొత్త డిజైన్‌లను ఈ సమావేశంలో సీఎం చంద్రబాబుకు సమర్పించింది. గవర్నమెంట్ వర్క్‌ప్లేసెస్ ఆఫ్ ది ఫ్యూచర్ అనే థీమ్‌తో నివేదికను అందించింది. నాణ్యత, ఛాయిస్, మన్నిక తదితర అంశాలను ఈ నివేదికలో నార్మన్ పోస్టర్స్ రూపొందించింది. లండన్ రాజప్రసాదంలోని ఖజానా పునర్‌నిర్మాణం అంశంపై నార్మన్ పోస్టర్స్ చేసిన అధ్యయనం రిపోర్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించారు.

ఈ నివేదికలు అన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీటిపై త్వరలో కార్యదర్శులు, మంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేసి అభిప్రాయ సేకరణ చేయాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, సీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. మంత్రులు, అధికారులు ఇచ్చే సూచనలకు అనుగుణంగా తుది ఆకృతులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. పరిపాలన నగరమంతా పచ్చదనంతో, జలఆకర్షణతో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 13వ తేదీ నాటికి తుది డిజైన్‌లను అందజేస్తామని నార్మన్ పోస్టర్స్ బృందం ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తెలిపింది. ఈ సమావేశంలో సీఆర్డీఏ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, కమిషనర్ సిహెచ్ శ్రీధర్, అదనపు కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు, లండన్ నార్మన్ పోస్టర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో నార్మన్‌పోస్టర్స్ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

గోదావరి జిల్లాల్లో క్రికెట్ బెట్టింగ్ మూలాలు

● పోలీసుల అదుపులో 17 మంది

కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి : క్రికెట్ బెట్టింగ్ మూలాలు గోదావరి జిల్లాల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నెల్లూరులో మొదలైన విచారణ ఇప్పుడు తూర్పుగోదావరికి పాకింది.

నెల్లూరు జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల్తో పాటు ఇప్పటికేవిచారణ ఎదుర్కొంటున్న ఒక ఫంటర్ నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్‌లోని నెంబర్ల ఆధారంగా దీని మూలాలు తూర్పుగోదావరిలో ఉన్నట్లు గుర్తించారు. ఈ సమాచారాన్ని జిల్లో పోలీసులకు చేరవేయడంతో ఇక్కడ రహస్యంగా విచారణ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 17మందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. వీరంతా ఒకే రాజకీయ పార్టీకి చెందినవారు. పైగా అదే పార్టీ నాయకుడు, ఓ మాజీ ఎమ్మెల్యే కూడా ఈ వ్యవహారంలో ఉన్నట్లు పోలీసులు సందేహిస్తున్నారు. అలాగే కాకినాడ కేంద్రంగా పనిచేస్తున్న పలు షిప్పింగ్ ఏజెన్సీల నిర్వాహకులు కూడా ఈ వ్యవహారంలో భాగస్తులైనట్లు తాజా విచారణలో తేలింది. బుధవారం రాత్రి నాలుగు షిప్పింగ్ ఏజెన్సీలపై పోలీసులు దాడులు జరిపారు. వార్నుంచి కొన్ని పత్రాల్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ దీర్ఘకాలంగా జరుగుతోంది. ఇప్పటికే అనేక మంది బెట్టింగ్‌లో సర్వం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కొంతమంది రాత్రికి రాత్రే ఇందులో కోటీశ్వర లయ్యారు. మరికొంతమంది ఈ సొమ్ముతో రాజకీయాల్ని కూడా శాసించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఈ దశలో నెల్లూరులో కదిలిన డొంకతో కాకినాడలో బెట్టింగ్ వ్యవహారం బైటకొచ్చేస్తోంది. ఇదొక్క కాకినాడకే పరిమితంకాలేదు. అమలాపురం, రాజమండ్రి, భీమవరం, ఆచంట, పెను గొండ, కొవ్వూరు, అనపర్తి, పెదపూడి, రావులపాలెం తదితర ప్రాంతాల్లో కూడా జోరుగానే ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో విచారణను వేగవంతం చేశారు.

అప్పన్న సన్నిధిలో బాలకృష్ణ సతీమణి



సింహాచలం(విశాఖపట్నం), కెఎన్ఎన్ బ్యూరో: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని బుధవారం ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దర్శించుకున్నారు. పలువురు కుటుంబ సభ్యులతో కలిసి సింహాచలం విచ్చేసిన వారికి ఆలయ వర్గాలు సాదరస్వాగతం పలికాయి. కప్పస్థంభం ఆలింగనం చేసుకొని బేడా చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల సన్నిధిలో వసుంధర పేరిట ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు వేద మంత్రోశ్చరణలు వల్లిస్తుండగా మృదుమధుర మంగళ వాయిద్యాల మధ్య అర్చక స్వాములు ఆశీర్వాదంతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వసుంధరతో పాటు పలువురు కుటుంబ సభ్యులు ఉన్నారు.

విలువలతోనే విజయాలు

● హెచ్ఎంఎ అవార్డు ప్రదానోత్సవంలో గవర్నర్ నరసింహన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నాయకుడి ప్రవర్తన, నైతికత, అనుసరించే విధానాలు సమాజంలో ప్రభావం చూపుతాయని, ఆయననే స్ఫూర్తిగా తీసుకుంటారని రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ అన్నారు. నాయకుడు సన్మార్గంలో నడుస్తూ భావితరాలకు మార్గం చూపుతారని, అది సమాజ శ్రేయస్సుకు దోహదపడేలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. క్రమశిక్షణ, అంకితభావం, నైతిక విలువలతో ఏ వృత్తిలోనైనా ఇమిడిపోతే విజయాలు వరిస్తాయని ఆయన అన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారికి హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఎ) ప్రకటించిన అవార్డులను ఆయన బుధవారం ప్రదానం చేశారు. అవార్డుగ్రహీతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లను నరసింహన్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎ అధ్యక్షుడు కె.అర్జున ప్రసాద్, మాజీ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, మన దేశంలో అందుబాటులో ఉన్న మానవ వనరులను సద్వినియోగం చేసేందుకు వారికి అవసరమైన నైపుణ్యం కల్పించాలన్నారు. యాజమాన్యం అనేది హృదయాంతరాల నుంచి వచ్చే ఒక కళ అని, చిత్తశుద్ధి, అంకితభావం, సానుకూల ఆలోచనా దృక్పదం, వాస్తవికతతో ఆచరణతోనే ఉత్తమ యాజమాన్య నిపుణుడిగా నిలుస్తాడని ఆయన అన్నారు. దేశంలో లభించే వనరులను దృష్టిలో ఉంచుకుని వాటికి తగ్గట్టుగా వ్యూహాత్మకంగా వ్యవహరించి ఫలితాలు సాధించాలని నరసింహన్ చెప్పారు. వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని, వృత్తిపరమైన విలువలు పాటించడం చాలా ముఖ్యమని గవర్నర్ అన్నారు. భారత్‌లో అపారమైన మానవ వనరులు ఉన్నాయని, వాటి వినియోగం ద్వారా సంపద, ఉపాధి సృష్టించాలని ఆయన చెప్పారు. యాజమాన్యంగానీ, నిర్వాహకుడికిగానీ ఆర్థిక విషయాల్లో నైతికత ఎంతో అవసరమని ఆయన చెప్పారు. వ్యక్తిగత విలువలపైనే వృత్తిపరమైన విజయాలు ఆవిష్కృతమవుతాయని గవర్నర్ చెప్పారు. వ్యక్తిత్వం, అంకితభావం, శ్రమతోనే ఉన్నతస్థాయికి చేరుకుంటారని, వివిధ వృత్తుల్లో ఉన్నవారు లక్ష్యాలను అధిగమించేందుకు ఉన్నత ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందని నరసింహన్ అన్నారు.

2016 సంవత్సరానికిగానూ ఏడు విభాగాల్లో హెచ్ఎంఎ అవార్డులను ప్రకటించింది. ఇందులో లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డుకు ప్రముఖ శాస్త్రవేత్త పద్మభూషణ్ డాక్టర్ వీకే సారస్వత్‌ను ఎంపిక చేసింది. అలాగే మేనేజ్‌మెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును డిఆర్‌డిఎల్ అసోసియేట్ డైరెక్టర్ జి.చంద్రమౌళి, ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఉమా గుర్ఖా, ఉత్తమ స్మాల్‌స్కేల్ టి.బాలకృష్ణకు, హెచ్‌ఆర్ మేనేజర్ అవార్డు కెవిఎస్ఎస్ నారాయణరావుకు, సిఎస్ఆర్ అవార్డుకు ఫోనిక్స్ ఫౌండేషన్‌ను, హెచ్ఎంఎ మెంబర్ ఆఫ్ ఇయర్ ప్రొఫెసర్ కెవి అచలపతికి అవార్డులు ప్రదానం చేశారు.

పోలింగ్ అధికారి మృతి పట్ల సీఎం విచారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నంద్యాల మండలం పోలూరులో పోలింగ్ కేంద్ర అధికారి శ్రీనివాస్‌రెడ్డి మృతికి తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌రెడ్డి మృతి దురదృష్టకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నంద్యాల 3వ టౌన్ ఠాణాలో జగన్‌పై కేసు



నంద్యాల, ఆంధ్రప్రభ: వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు, ఏపి అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై బుధవారం నంద్యాలలో కేసు నమోదైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి పై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలపై నేపథ్యంలో టిడిపి చేసిన ఫిర్యాదు మేరకు ఈ కేసును నమోదు చేయడం జరిగింది. చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపినా తప్పులేదని, ఉరితీసినా తపప లేదంటూ చేసిన వ్యాఖ్యలను తెలుగుదేశం శ్రేణులు తీవ్రంగా పరిగణించాయి. తగిన చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. ఫిర్యాదును పరిశీలించిన ఇ.సి జగన్ వ్యాఖ్యలు ఖచ్చితంగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడం కిందకు వస్తుందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలోనే కేసు నమోదు చేయాలంటూ కర్నూలు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ పరిస్థితులలో నంద్యాల ఉప ఎన్నికకు రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో బుధవారం సాయంత్రం కేసు నమోదు చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఒకవైపు ఉప ఎన్నికల పోలింగ్ ముగియగా, జగన్‌ను అరెస్టు చేయాలనే విషయమై నంద్యాల పోలీసులు తర్జనభర్జనలు పడుతున్నారు. ఉన్నతాధికారులతో సంప్రదిస్తున్నారు.

నా జీవితాంతం బీజేపీలోనే



అమరావతి, ఆంధ్రప్రభ : తాను బిజెపిని విడిచి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నానంటూ ఇటీవల జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి కామినేని శ్రీనివాస స్పష్టం చేశారు. బిజెపిలో పోటీ చేసి గెలుపొందిన నాకు తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ల మద్దతు తోనే విజయం వరించిందని కామినేని స్పష్టం చేశారు. ఐదేళ్లపాటు తమ ప్రాంతానికి ప్రతినిధిగా ప్రజలు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో అందరితో సఖ్యతతో ఉంటూ వారిని గౌరవించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. పూర్తిస్థాయిలో అసాంఘీక శక్తులైతే తప్ప వారికి దూరంగా ఉంటానని లేని పక్షంలో మిత్రుడిగానే ఉంటానని ఆయన వ్యాఖ్యానించారు. నాకు రాజకీయ జీవితాన్ని ఇచ్చింది ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కాగా, ఆయన పార్టీని వదలి రాజ్యాంగ బద్ధమైన పదవిలోనికి వెళ్లారని కామినేని అన్నారు. భారతీయ జనతా పార్టీలో ప్రధాని మోడీ, జాతీయ స్థాయిలో ఆదేశాలుఇచ్చినా.. సూచన సేసినా కిందిస్థాయి కార్యకర్తగా చేరి వాటిని శిరస్సావహించే పరిస్తితి బిజెపిలో కొనసాగుతుందని తానూ అలాగే అధినేత ఆదేశాలు పాటిస్తూ ప్రాణం ఉన్నంత వరకూ బిజెపిలోనే ఉంటానని మంత్రి కామినేని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

కాకినాడ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిపై రెబల్ అభ్యర్థిగా టిడిపి పోటీలో ఉన్న విషయాన్ని మంత్రి పైడిపాల మాణిక్యాలరావు, తమపార్టీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లారని తెలిపారు. బిజెపి -టిడిపిలు కలిసే ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని, కేవలం ఒక్కస్థానంలోనే బిజెపితోపాటు టిడిపి అభ్యర్థికూడా నామినేషన్ వేశారన్నారు. మరికొన్ని చోట్ల టిడిపి అభ్యర్థిపై ఆపార్టీకి చెందిన వారే రెబల్స్‌గా మున్సిపల్ ఎన్నికల బరిలో ఉన్నారని కామినేని చెప్పారు. అయితే ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని సంబంధిత జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు సష్టం చేశారన్నారు. ఎక్కడైతే పార్టీ అధిష్టానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోటీలో ఉన్నారో వారిని టిడిపి బహిష్కరించాలని నిర్ణయించిందని మంత్రి కామినేని వెల్లడించారు.

పోలింగ్ ప్రశాంతం

● రికార్డు స్థాయిలో 79.20 శాతం ● కౌంటింగ్‌కు చురుగ్గా ఏర్పాట్లు



నంద్యాల, ఆంధ్రప్రభ: నంద్యాల ఉప ఎన్నికల ఓటింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల సంఘం ప్రధానాధికారి భన్వర్‌లాల్ ప్రకటించారు. బుధవారం నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉప ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం ఈసీఈ భన్వలాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత రెండు దశబ్దాల నంద్యాల పోలింగ్ రికార్డులను బుధవారం నాటి పోలింగ్ అధిగమించిందన్నారు. పోలింగ్ కేంద్రం పరిధిలోని క్యూలైన్లలో ఉన్న వారికి అర్ధరాత్రి వరకూ ఓటు వేసుకునే అవకాశం కల్పించామన్నారు. రాత్రి 8గంగలకు పోలింగ్ ముగిసే సరికి మొత్తం 79.20శాతం పోలింగ్ జరిగినట్టు వివరించారు. చెదురు మదురు సంఘటనలు మినహా ఎక్కడా ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. బుధవారం నాటి పోలింగ్ సందర్భంగా 8ఈవీఎంలు మొరాయించటంతో వాటిస్థానంలో కొత్త వాటిని పెట్టామన్నారు. 22కంట్రోల్ , 14వివిప్యాడ్‌లను రీప్లేస్ చేసినట్టు తెలిపారు. ఈవీఎంలలో గుర్తులు సరిగా కనిపంచటం లేదని ఫిర్యాదులేవి రాలేదన్నారు. ఎన్నికల బందోబస్తులో ఉన్న గుంటూరు జిల్లాకు చెందిన ఎఆర్ కానిస్టేబుల్ ఉమా మహేశ్వరరావు మృతి చెందారని ఎక్స్‌గ్రేషియా కింద ఆయన కుటుంబానికి పదిరెట్ల జీతం లేదా పదిలక్షల రూపాయలు ఆందచేస్తామని ప్రకటించారు.

28న ఫలితాలు

నంద్యాల ఉప ఎన్నికల బ్యాలెట్ పెట్టెలను నంద్యాల పాలిటెక్నిక్ కళాశాలలో భద్రపరిచినట్టు తెలిపారు. ఈ నెల 28న ఓట్ల లెక్కింపును చేపడతామన్నారు. ఉదయం 8 గంటలకు లెక్కింపును ప్రారంభించి మధ్యాహ్నంకు ఫలితాలు ప్రకటిస్తామని ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్ వెల్లడించారు.

జగన్‌పై కేసు నమోదుకు ఆదేశం

నంద్యాల ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఉద్దేశించి వైఎస్‌ఆర్‌కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖలపై వచ్చిన ఫిర్యాదులను ఎన్నికల సంఘం విచారణకు తీసుకున్నట్టు సీఈఓ భన్వర్‌లాల్ తెలిపారు.

చివరి హెచ్చరిక చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆర్ఓకు డైరెక్షన్ ఇచ్చామన్నారు. ఎన్నికల సందర్భంగా మీడియాపై ఏవిధమైన ఫిర్యాదులు లేవన్నారు. నంద్యాల ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు మీడియా కూడా బాగా సహకారం అందించిందన్నారు.

ఉపఎన్నికలో తెదేపాదే విజయం
లగడపాటి జోస్యం



కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం జరిగిన ఉపఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి విజయం ఖాయమని సర్వేలలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్న విజయవాడ మాజీ ఎంపి లగడపాటి రాజగోపాల్ చెప్పారు. ఈ ఉప ఎన్నికలో భారీ పోలింగ్ నమోదు చేసుకోవడంతో గెలుపోటములు మారుతాయన్న ప్రచారం సరికాదని, మంచి మెజారిటీతో తెదేపా గెలుస్తుందని ఆయన ఓ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

సమస్యాత్మక బూత్‌లలో నాగమౌనిక సందర్శన



నంద్యాల, ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నికలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగనప్పటికీ, అభ్యర్థుల కుటుంబ సభ్యులు సమస్యాత్మక బూత్‌లను సందర్శించారు. బూత్‌లలో రిగ్గింగ్, ఘర్షణలు జరుగు తాయని అభ్యర్థుల కుటుంబీకులు ప్రత్యేకంగా అను మతి తీసుకని మరీ పరిశీలించారు. ముఖ్యంగా స్వర్గీయ భూమా నాగిరెడ్డి చిన్న కుమార్తె భూమా నాగమౌనిక తండ్రి లేని లోటును తీర్చారు. ఇప్పుడు ఆయన రెండో కుమార్తె నాగమౌనిక స్వయంగా తిరిగి పరిశీలిం చారు. కాగా డమ్మీ అభ్యర్థిగా భూమా నామినేషన్ వేయగా, పత్రాలు సరిగా లేవనే కారణంగా వాటిని తిరస్కరించారు. మరోవైపు ప్రత్యర్థులు గొడవలు సృష్టించే అవకాశాలున్నాయంటూ వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి పోలింగ్ మధ్యలో ఆరోపించారు.

మాజీ ఎమ్మెల్యేలకు సౌకర్యాలు కొనసాగించాలి

అమరావతి, ఆంధ్రప్రభ : ఉమ్మడి ఏపీ మాజీ ఎమ్మెల్యేలకు పింఛన్లు, వైద్య సదుపాయాలు, ప్రయాణ సౌకర్యాలను గతంలోవలే యధాతథంగా కొనసాగించాలని ఏపీ ఫార్మర్ లెజిస్లేటర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కె.సుబ్బరాజు ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విభజన చట్టాన్ని అనుసరించి హైదరాబాదుపై 10 సంవత్సరాల పాటు ఏపీకి హక్కులు కలిగి ఉన్నాయని, కానీ తెలంగాణా బస్సుల్లో ప్రయాణానికి అనుమతించకపోగా నెలవారీ మందుల సరఫరాను కూడా నిలిపివేయడం జరిగిందన్నారు. ఏపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలకు విజయవాడలో నెలసరి మందులను సరఫరా చేయాలని, ఆర్టీసీ బస్సుల్లో కూడా ప్రయాణ సౌకర్యాన్ని కూడా కల్పించాలన్నారు. అలాగే అమరావతిలో సేకరించిన స్థలంలో మాజీ శాసన సభ్యులకు శాశ్వత ఇంటి స్థలాలను కేటాయించాలని తెలిపారు. న్యూఢిల్లీలోని ఏపీ, తెలంగాణా భవన్‌లలో నాలుగవ కేటగిరీ క్రింద గాకుండా రెండు, మూడు కేటగిరీల క్రింద వసతి సౌకర్యాలను కల్పించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యేల్లో చాలా మంది వృద్ధాప్యంతో బాధపడుతున్నారని, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాజీ ఎమ్మెల్యేల సమస్యలపై చర్చలు జరిపి కర్నాటక తరహా సౌకర్యాలను కొనసాగించేందుకు తగిన చర్యలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ వ్యాఖ్యలు అభ్యంతరకరం



విలేకరులతో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రొద్దుటూరు, కె.ఎన్.ఎన్: నంద్యాల ఉప ఎన్నికల సందర్భంగా వైసిపి అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు అభ్యంతరకరంగా వున్నాయని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రొద్దుటూరు రాయల్‌కౌంటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికలలో జగన్ మాట్లాడిన మాటలు అభ్యంతరకరంగా వున్నాయన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆధేశాలు జారీ చేసిందని, 307 సెక్షన్ క్రింద నేరపూరిత వ్యాఖ్యలు, జగన్‌పై చర్య తీసుకోకపోతే సమాజం పతనం అవుతుందని విమర్శించారు. జగన్ మాటలు ఉన్మాది మాటల్లా వున్నాయన్నారు. ఆర్థిక నేరాలకు భారీ ఎత్తున పాల్పడి 16 నెలలు జైలు జీవితం గడిపారని, ఇటువంటి వ్యక్తిని 6 సంవత్సరాల పాటూ రాజకీయ అనర్హుడిగా ప్రకటించాలని పేర్కొన్నారు. అనంతరం మంత్రి కాల్వ శ్రీనివాసులు నంద్యాల ఉప ఎన్నిక దురదృష్టకరమని, జగన్ మీడియాను దుర్వినియోగం చేశారని, 250 మంది జగన్ సొంత మీడియా విలేకర్లను నంద్యాలకు పంపి వైకాపా కార్యకర్తలుగా పనిచేయించారని, జగన్ పత్రికలో ప్రచురితమైన వార్తలు అవాస్తవమని పేర్కొన్నారు.

అనంతరం మంత్రి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేసే అభివృద్ధి చూడకుండా కళ్లకు గంతలు కట్టుకొన్న గాంధారిలా జగన్ మాటలు వున్నాయని విమర్శించారు. మంత్రి అమరనాథరెడ్డి మాట్లాడుతూ నంద్యాల ఎన్నికలలో 25,000 నుండి 30,000 మెజార్టీతో తెలుగుదేశం పార్టీ గెలుపొందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మేడా మల్లిఖార్జునరెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ మల్లెల లింగారెడ్డి తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సైలెంట్ ఓటింగ్

● మహిళా ఓటర్లే కీలకం



కర్నూలు, కెఎన్ఎన్ బ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో టెన్సన్‌గా మారిన నంద్యాల ఎన్నికలు మొత్తానికి ప్రశాంతంగా ముగిశాయి. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న నంద్యాల ఓటర్లు అంతే ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పండు ముసలి నుంచి యువత వరకు తమ ఓటు హక్కును ఉత్సాహంగా వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారులు మొట్టమొదటి సారిగా వివిప్యాడ్‌లను ఉపయోగించడంతో ఓటర్లు తమ ఓటు పడిందా లేదా అన్నది చూసుకునే వీలు కల్గింది. ఈ ఎన్నికల సైలెంట్‌గా జరగడంతో ఎగ్జిట్స్ పోల్స్ అంచనాలు కూడా ఊహకందడం లేదు. సైలెంట్ ఓటు ఎవరికి నష్టం కల్గిస్తుందో, ఎవరికి లాభం చేకూర్చుతుందో చూడాల్సి ఉంది. ఎన్నికలకు ముందు అటు టిడిపి, వైసిపిలు జోరుగా ప్రచారం సాగించిన విషయం తెలిసిందే. పెద్ద ఎత్తున డబ్బులు, మద్యం పంపిణీ చేశారు. ఒక పార్టీల ఓటుకు రూ. 1000 ఇస్తే, మరో పార్టీ రూ. 2 వేలు పంపిణీ చేసింది. పెద్ద ఎత్తున ఓటర్లను ఆయా పార్టీల నేతలు ప్రలోభాలకు గురి చేశారు. పోలింగ్ రోజున కూడా ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా కొంతమంది పార్టీల నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద డబ్బులు పంపిణీ చేశారు, మరి కొందరు నేతలు నిబంధనలు యదేచ్ఛగా ఉల్లంఘించి ఇతర ప్రాంతాలకు చెందిన నేతలు నంద్యాలలోనే ఉంటూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారు. అయినప్పటికీ నంద్యాల ఓటర్లు మాత్రం ఎక్కడా ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంతంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. సైలెన్స్ ఓటింగ్ నమోదు కావడంతో ఏ పార్టీకి ఓట్లు అధికంగా పడ్డాయన్నది అంతుపట్టడం లేదు. ఈసారి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం చూస్తుంటే ఆయా పార్టీల అంచనాలు కూడా తారుమారు అయ్యే అవకాశాలు లేక పోలేదు. ఓటింగ్ శాతం పెరగడంతో ఇది అధికార పక్షానికి ఇబ్బందిగా ఉంటుందని కొందరు వాదిస్తుండగా, పోలింగ్ శాతం పెరగడంతో వైఎస్ఆర్‌సిపికే నష్టం జరుగుతుందని మరి కొందరు వాదిస్తున్నారు. టిడిపి, వైఎస్ఆర్‌సిపిల ప్రచార కార్యక్రమాలకు పెద్ద ఎత్తున జనాలు హాజరయ్యారు. ఎవరు సమావేశం పెట్టినా వెళ్లారు. ఏ పార్టీ డబ్బులు పంపిణీ చేసినా కొందరు తీసుకున్నారు. కాని పోలింగ్ సమయానికి ఎవరికి ఓటు వేశారన్నది మాత్రం అంచనా వేయలేక పోతున్నారు. ముఖ్యంగా మహిళల ఓట్లు అధిక శాతం నమోదు కావడంతో వీరి ఓట్లు ఎవరికి నష్టం కల్గిస్తాయన్నది చూడాల్సి ఉంది.

వీవీఐపీ ట్రాఫిక్ ఇబ్బందులకు తెర

● సచివాలయంలో మూడు హెలీపాడ్లకు ఓకే ● భవిష్యత్‌లోనూ శాశ్వతంగా ఉపయోగించే అవకాశం

అమరావతి, ఆంధ్రప్రభ : రాజధాని అమరావతికి అంతర్జాతీయ సంస్థలు తరలివస్తున్న నేపథ్యంలో వీవీఐపీల తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. దీంతో పాటు రాజధానిలో స్టార్టప్ ప్రాంత అభివృద్ధి కోసం సింగపూర్ ప్రతినిధులు తరచూ సచివాలయానికి వస్తున్నారు. విదేశాల నుంచి నేరుగా గన్నవరం చేరుకుంటున్న ప్రతినిధులు అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా సచివాలయానికి చేరుకోవాలంటే కొంత ఇబ్బందికర పరిస్థితులున్నాయి. వీవీఐపీలు వెళ్లే రోడ్డు మార్గంలో ట్రాఫిక్ నిలిపివేయటంతో సామన్య ప్రజలు తీవ్రఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇటువంటి పరిస్థితులను గుర్తించిన ప్రభుత్వం శాశ్వతంగా వీవీఐపిల కోసం ప్రత్యేకంగా హెలీపాడ్‌లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తుంది. దీని కోసం వేగంగా పనులు చేయిస్తున్నారు. ఇప్పటికే సచివాలయంలో సీఎం కోసం ఒక హెలీపాడ్ని ఏర్పాటు చేయగా తాజాగా ఉపరాష్ట్రపతి కోసం మరో రెండు అదనంగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రొటోకాల్ లో భాగంగా వీటిని ఏర్పాటు చేస్తున్నప్పటికీ వీటిని శాశ్వతంగా వినియోగించుకోనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. రాజధాని అమరావతికి ఉపరాష్ట్రపతి రానున్న నేపథ్యంలో ప్రొటోకాల్ ప్రకారం సచివాలయం ఆవరణలో మూడు హెలీపాడ్లను ఇప్పటికే సిద్ధం చేస్తున్నట్లు తెలపారు. ప్రొటోకాల్ ప్రకారం మిలటరీ తరహాలో 30.6 మీటర్ల వైశాల్యంలో హెలీపాడ్లను ఏర్పాట్లు చేస్తున్నట్లు రోడ్డు భవనాల శాఖ అధికారులు తెలిపారు. మూడింటిల్లో ఒకదానిని ఇదివరకే సీఆర్‌డీఏ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉపరాష్ట్రపతి సచివాలయంలో కార్యక్రమం ముగిసిన తర్వాత హెలికాప్టర్లో తెనాలి బయలుదేరి వెళ్లనున్నారు. ఈ హెలీపాడ్లు ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు వీఐపీలకు ఉపయోగపడనున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి గన్నవరం విమానాశ్రయం చేరుకొని అక్కడ నుంచి నేరుగా హెలికాప్టర్ ద్వారా సచివాలయానికి చేరుకోవచ్చు. దీంతో భద్రతతోపాటు సమయం కలిసిరానుంది.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

• ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి మన్మోహన్ సింగ్



అమరావతి,ఆంధ్రప్రభ: విపత్తులను ఎదుర్కొవడానికి నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ల్యాండ్, ఎండోమెంట్, విపత్తులశాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి మన్మోహన్‌సింగ్ అన్నారు. బుధవారం రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ కార్యాలయంలో జాతీయ తుఫాను విపత్తు తగ్గింపు పథకం(ఎన్‌సిఆర్ఎమ్‌పి), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ(ఏపిఎస్‌డిఎమ్ఏ)లలోని వివిధ పథకాలను సమీక్షించి అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ కమిషనర్ ఎం.వి. శేషగిరిబాబు మాట్లాడుతూ విపత్తులు ఎదుర్కోడానికి రాష్ట్ర విపత్తులశాఖ సన్నద్ధంగా ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంలో విపత్తులశాఖ ముందుందన్నారు. విపత్తుల నిర్వహణలోని ప్రతి పథకాన్ని సద్వినియోగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విపత్తులశాఖ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కోట్ల శివశంకరరావు, నాన్‌రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంత్రి గంటాకు నాన్ బెయిలబుల్ వారెంట్



విశాఖపట్నం(అనకాపల్లి), కెఎన్ఎన్ బ్యూరో: రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖామంత్రి గంటా శ్రీనివాసరావుకు బుధవారం నాన్‌బెయిల్‌బుల్ అరెస్టు వారెంట్ జారీ అయింది. మంత్రి గంటా ప్రజారాజ్యం పార్టీ తరుపున అనకాపల్లి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు 3-4-2009న కొందరు ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేశారు. మంత్రి గంటా ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతున్నారన్నది వారి ఫిర్యాదు సారాంశం. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గంటా కార్యాలయంలో ఒక ఎస్సై, నలుగురు కానిస్టేబుళ్లు సోదాలు నిర్వహించారు. ఆ సోదాల్లో క్రికెట్ కిట్లు, టోపీలు దొరికాయి. దీంతో క్రైం నెంబర్ 113/2009 సెక్షన్ 120ఈ కింద అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా మంత్రి గంటా శ్రీనివాసరావును తమ ముందు హాజరు కావాలని న్యాయస్థానం పలుమార్లు ఆదేశించింది. అయినప్పటికి గంటా కోర్టుకు హాజరు కాలేదు. న్యాయస్థానానికి హాజరు కాకపోవడంతో చివరకు అరెస్టు చేయాలంటూ బుధవారం వారెంట్ జారీ చేసింది. అనకాపల్లి రెండవ అదనపు జడ్జి జెవివి సత్యనారాయణమూర్తి ఈ నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేశారు. కేసును సెప్టెంబర్ 11వ తేదీకి విచారణ నిమిత్తం వాయిదా వేశారు.

మాజీ మంత్రి శత్రుచర్లకు రూ. 2.25 లక్షల జరిమానా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజుకు ఉమ్మడి హైకోర్టు రూ.2.25 లక్షల జరిమానా విధించింది. ఆ సొమ్మును నాలుగు వారాల్లో హైకోర్టు రిజిస్ట్రార్ (జుడీషియల్) పేరుమీద జమ చేయాలని హైకోర్టు ఆదేశించింది. శాసనసభ్యునిగా 1999 నుంచి 2004 వరకు పనిచేసిన కాలానికి, సమావేశాలకు హాజరైన ఒక్కో సిటింగ్ కు రూ.500 చొప్పున జరిమానా చెల్లించాలని శత్రుచర్లను ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జీ వెలువరించిన తీర్పుపై స్టే విధించేందుకు డివిజన్ బెంచ్ నిరాకరించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 1999 నుంచి 2004 వరకు నాగూరు ఎస్టీ శాసనసభ స్థానానికి శత్రుచర్ల విజయరామరాజు పోటీ చేసి గెలవడాన్ని సవాలు చేస్తూ మాజీ శాసనసభ్యుడు నిమ్మక జయరాజు 1999లో హైకోర్టులో ఎన్నికల వ్యాజ్యం దాఖలు చేశానని, 2006లో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు శత్రుచర్ల కొండదొర కాదని, క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన వారని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో శత్రుచర్ల శాసనసభ్యునిగా కొనసాగిన కాలానికి చెల్లించిన జీతభత్యాలను తిరిగి రాబట్టేలా ఆదేశించాలని, ప్రాసిక్యూటర్ చేయాలని అభ్యర్థిస్తూ ..జయరావు హైకోర్టును ఆశ్రయించారు.

ముఖ్యమంత్రి నియామకాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ కొట్టివేత

• గత మూడేళ్ల నుంచి ఏంచేస్తున్నారు? • నిలదీసిన హైకోర్టు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 (1) ప్రకారమే రాష్ట్ర గవర్నర్ రెండు తెలుగు రాష్ట్రాల శాసనసభ్యులచేత ప్రమాణం చేయించి వారి నాయకులను ముఖ్యమంత్రులుగా నియమించారని ఉమ్మడి హైకోర్టు తేల్చి చెప్పింది. పిటిషనర్ మరీ ఆలస్యంగా కోర్టుకు రావడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 19(3) ప్రకారం రెండు రాష్ట్రాల్లో శాసనసభలు అపాయింటెడ్ డేనాటి నుంచే ఏర్పాటు అయినట్లుగా భావించాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనల మేరకు ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఇతర ఎన్నికైన సభ్యులు శాసనసభ్యులుగా ప్రమాణం చేయలేదని, ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబుని గవర్నర్ ప్రమాణం చేయించడం రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన న్యాయవాది, ఏపీ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.సూరిబాబు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి మూడు సంవత్సరాల రెండు నెలలు గడిచిందని హైకోర్టు గుర్తు చేసి ంది. ఇంత వరకు పిటిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. ఇప్పుడు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చెల్లదంటూ పిటిషన్ వేయడం న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనిలతో డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు తీర్పును వెలువరించింది.

టంగుటూరి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

• మంత్రి శిద్దా రాఘవరావు • ప్రకాశం పంతులు, సీఎం చంద్రబాబుకు సారూప్యం • ప్రభుత్వ సలహాదారుడు పరకాల ప్రభాకర్



అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖా మంత్రి శిద్ధారాఘవరావు అన్నారు. బుధవారం ప్రకాశం పంతులు 146వ జయంతిని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా నాగులపాడు మండలం వినొదరాయునిపాలెంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రకాశం పంతులు కాంశ్యవిగ్రహాన్ని మంత్రి శిద్ధారాఘవరావు, రాష్ట్ర ప్రభుత్వం సలహాదారుడు పరకాల ప్రభాకర్‌లు ఆవిష్కరించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్రాన్ని సమర్ధవంతంగా పరిపాలించిన ముఖ్యమంత్రి అని, పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. ఆంధ్రకేసరి జయంతిని ప్రభుత్వం రాష్ట్ర వేడుకగా ప్రకటించడం ఆయన మీద ఉన్న గౌరవానికి నిదర్శనమన్నారు. నిరుపేద కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి ఆయన అని, మహాత్మగాంధీతో కలిసి బ్రిటీష్ వారితో పోరాడిన ధైర్యశాలని శ్లాఘించారు. వినోదరాయుని పాలెంలో జెన్‌కో సంస్థకు కేటాయించిన భూములను రద్దు చేశామని, అయితే అవి అమ్ముకునే వీలు లేక రైతులు ఇబ్బంది పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ప్రభుత్వం రైతులకు అనుకూలంగా ఉత్తర్వులు ఇస్తుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం సలహాదారుడు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు పుట్టిన గడ్డ శౌర్యానికి, త్యాగానికి ప్రతీక అన్నారు. వినోదరాయుని పాలాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, టంగుటూరి ప్రకాశం పంతులకు సారూప్యత ఉందనే అభిప్రాయాన్ని పరకాల ప్రభాకర్ వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా ప్రజలకు త్రాగు, సాగునీటి అవసరాలను తీర్చేందుకు అహర్నిశలు శ్రమించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 28 ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రకాశం పంతులు విగ్రహాన్ని చూస్తూ విద్యార్థులు నిత్యం స్ఫూర్తిని నింపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిచైర్ పర్సన్ ఈ. హరిబాబు, ఎమ్మెల్సీ కరణం బలరాం, సంతనూతలపాడు ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యే విజయ్‌కుమార్, కలెక్టర్ వినయ్‌చంద్ పాల్గొన్నారు.

ఒంగోలు కలెక్టరేట్‌లో..

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి సందర్భంగా ఒంగోలు లోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఆయన కాంశ్య విగ్రహానికి మంత్రి శిద్ధారాఘవరావు, ప్రభుత్వ సలహాదారుడు పరకాల ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

26న అమరావతిలో వెంకయ్యకు పౌరసన్మానం

• ఉపరాష్ట్రపతి హోదాలో తొలిసారి రాక • మంత్రి కామినేని శ్రీనివాస్ వెల్లడి

అమరావతి, ఆంధ్రప్రభ : భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి ఈనెల 26వ తేదీన ప్రజా రాజధాని అమరావతిలో ఘనంగా పౌర సన్మానం నిర్వహిస్తున్నట్లు రాష్ట్రవైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ వెల్లడించారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మంత్రి నక్కా ఆనందబాబుతో కలిసి ఆయన మాట్లాడుతూ ఆంధ్రుడైన వెంకయ్య ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టి అత్యున్నతమైన దేశ ఉపరాష్ట్రపతి పదవిని అలంకరించడం తెలుగుజాతికే గర్వకారణమన్నారు. ఉపరాష్ట్రపతి హోదాలో తొలిసారి రాష్ట్రానికి వస్తున్న ఆయన సచివాలయం వద్ద ఇళ్ల పథకం పైలాన్‌ను ఆవిష్కరించడంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. శనివారం ఢిల్లీ నుంచి ఉదయం 9.10 గంటలకు విజయవాడలోని గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకునే వెంకయ్యకు గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబులు ఘన స్వాగతం పలుకుతారని, ఓపన్‌టాప్ జీపులో ఊరేగింపుగా ఆయన సచివాలయంకు 10.40 గంటలకు చేరుకుంటారన్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పీఎంఏవై పథకం క్రింద రాష్ట్రానికి 2.25 లక్షల ఇళ్లను మంజూరు చేస్తూ చివరి సంతకం పెట్టిన వెంకయ్యను పైలాన్ ఆవిష్కరించిన తరువాత 11 గంటలకు రాష్ట్రప్రభుత్వం ఘన పౌర సన్మానం నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు భారీగా పాల్గొంటారని, అనంతరం ఆయన తెనాలికి బయలుదేరి ఆలపాటి వెంకట్రామయ్య శతజయంతి ఉత్సవాల్లో పాల్గొంటారని



చెప్పారు. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్టులో హైదరాబాదు నుంచి, మణిపాల్ ఆసుపత్రి నుంచి వచ్చిన నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించి, రాత్రి 7.30 గంటలకు ఢిల్లీకి బయలుదేరి వెళతారన్నారు.

ఫాతిమా కాలేజీ విద్యార్థులకు న్యాయం చేస్తాం..

కడప ఫాతిమా మెడికల్ కాలేజీ విద్యార్థులకు తప్పకుండా న్యాయం చేస్తామని కామినేని స్పష్టం చేశారు. ప్రభుత్వం తరపున కోర్టులో గౌరవ బెనర్జీ వాదనలు వినిపిస్తున్నారని, విద్యార్థులను ప్రభుత్వ కళాశాల్లో సర్దుబాటు చేయమని ఆదేశిస్తే తప్పకుండా చేస్తామని చెప్పారు. 108 సేవలకు సంబంధించి కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిందని, త్వరలోనే మళ్లీ టెండర్లు పిలుస్తామన్నారు. 108 వాహనంలో రోగిని ఆసుపత్రికి చేర్చేలోగా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా నూతన యాప్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు. తట్టు, రుబెల్లా వ్యాధులను రూపుమాపే ఎంఆర్ టీకాను 9 రోజుల్లో 90 లక్షల మంది చిన్నారులకు వేసినట్లు వివరించారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు చట్టపరమైన హక్కులను కల్పిస్తూ జీఓను జారీ చేయడం జరిగిందని, మంగళగిరి వద్ద నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్న నేపథ్యంలో ఎయిమ్స్ తరగతులు వచ్చే ఏడాది నుంచి ప్రారంభిస్తామని చేశారు.

ప్రతిభావంతులకు అవార్డులు

• ఏబీసీడీ అవార్డులు అందజేసిన డీజీపీ

అమరావతి, ఆంధ్రప్రభ : విధుల నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి బుధవారం మంగళగిరి డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డీజీపీ నండూరి సాంబశివరావు అవార్డులు, నగదు రివార్డులు అందజేశారు. పోలీసు ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేసిన తర్వాత తొలిసారిగా డీజీపీ ఉన్నతాధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం వివిధ జిల్లాల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఏబీసీడీ అవార్డులతో సత్కరించారు. గుంటూరు జిల్లా భట్టిప్రోలులో అపహరణకు గురైన మైనరు బాలికను రక్షించడంలో ప్రతిభ చూపిన అధికారులకు, సిబ్బందికి మొదటి బహుమతిని అందేశారు. గత ఏప్రిల్ 22న ఆటోడ్రైవర్ శ్రీరామ నాగేశ్వరరావు మైనరు బాలికను మభ్యపెట్టి కిడ్నాపు చేశాడు. రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డీజీపీ నండూరి సాంబశివరావు కేసుపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో గుంటూరు రూరల్ ఎస్పీ నారాయణ నాయక్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో బాపట్ల డీఎస్పీ పి.మహేష్, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, నలుగు ఎస్ఐలు, సిబ్బంది 46 రోజుల పాటు ఢిల్లీలోనే మకాం చేసి అవసరమైన చోట సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని జమ్ములోని సాంబ సెక్టార్‌లో ఆటోడ్రైవర్ నాగేశ్వరరావును అదుపులోకి తీసుకొని బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ చూపినందుకు 2017 ఏడాది రెండో త్రైమాసికానికి డీఎస్పీ మహేష్, ఇతని బృందానికి మొదటి బహుమతి అందజేశారు. విశాఖపట్టణం సిటీ, రూరల్ ప్రాంతాల్లో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని విద్యుత్ లైన్‌మెన్‌గా చెప్పుకుంటూ నగలు కాజేసిన కేసులో పాత నేరస్తుడైన యళ్లపల్లి కిషోర్‌ను అరెస్టు చేశారు. గత ఏప్రిల్ 3న వచ్చిన సమాచారం మేరకు పరవాడ పోలీసులు దిబ్బలపాలెంలో జరిగిన నేరస్థలం పరిశీలించే సమయంలో అక్కడున్న హెల్మెట్ ఆధారంగా పరవాడ సిఐ పైడపు నాయుడు, ఎస్ఐలు ఎస్.కె.షరీఫ్, పి.రవికుమార్‌లు చాకచక్యంగా నిందితుణ్ణి పట్టుకున్నారు. అరెస్టు చేసిన నిందితునిపై గతంలో 16 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మూడో బహుమతిని కన్నూరుపాలెం మహిళ హత్య కేసును ఛేదించిన కశింకోట పోలీసులకు అందజేశారు. కశింకోట మండలం కన్నూరులో ఇందిర అనే యువతి



గత నెలలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు అనకాపల్లి రూరల్ సిఐ రామచంద్రరావు, కశింకోట ఎస్ఐ మధుసూదనరావు, సిబ్బంది కేసులో నిందితుణ్ణి అరెస్టు చేశారు. ఒడిశాకు చెందిన ఇందిర పాయకారావుపేటలో ఉంటూ తునిలోని ప్రైవేటు కళాశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేసేది. ఈ క్రమంలో డ్రైవర్ నరేష్ కుమార్‌తో పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. ఆమె పెళ్లికి ఒత్తిడి చేయడంతో చంపి పెట్రోల్ పోసి తగులబెట్టినట్లు పోలీసు విచారణలో వెలుగు చూసింది. మరో మూడో బహుమతి విజయవాడ నగర పోలీసులకు అందజేశారు. గత ఫిబ్రవరి 28న కంకిపాడు పోలీసు స్టేషన్ పరిధికి చెందిన కర్రి శ్రీదేవిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి రూ.4లక్షలు చోరీ చేశారు. కేసులో నేరస్తుల పాదముద్రలు, సీసీ టీవీ పుటేజ్‌ల ఆధారంగా పోలీసులు ఆధారాలు సేకరించి ప్రధాన నిందితుడు నల్లమిల్లి సూర్రెడ్డి, మరో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. కేసులో ప్రతిభ చూపిన ఏసీపీ(క్రైమ్) పోతురాజు, ఎస్ఐలు టి.వి.వి.రామారావు, చిట్టిబాబు బృందానికి అవార్డు దక్కింది. ఈ సమీక్షా సమావేశంలో శాంతి భద్రతల విభాగం అదనపు డీజీపీ హరీష్ గుప్తా, సిఐడి అదనపు డీజీ సిహెచ్ ద్వారకా తిరుమలరావు, ఆక్టోపస్ అదనపు డీజీ ఎస్వీ సురేంద్రబాబు, పి అండ్ ఎల్ ఐజీ మధుసూదన రెడ్డి, టెక్నికల్ ఐజీ ఇ.దామోదర్, ఐజీలు, రేంజ్ డీఐజీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రుల ఉనికిని చాటిన ధీశాలి
ఆంధ్రకేసరి టంగుటూరి

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రుల ఉనికిని తొలిసారి చాటిన ధీశాలి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. బుధవారం ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా కమిషనర్ శ్రీధర్, ప్రత్యేక కమిషనర్ వి రామ్మోహన రావు టంగుటూరి ప్రకాశం పంతులు పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ, ఉమ్మడి మద్రాసుకు, ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయిన టంగుటూరి ఆదర్శప్రాయమైన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రకాశం జిల్లాలోని వినోదరాయని పాలెంలో పేద కుటుంబంలో జన్మించిన ఆయన లండన్ వెళ్ళి బారిస్టర్ పూర్తిచేసి మద్రాసు హైకోర్డులో ప్రముఖ లాయర్‌గా ప్రాక్టీస్ చేసి తాను సంపాదించిన సొమ్మంతా దేశ ప్రజలకోసం త్యాగం చేసిన మహనీయుడన్నారు. బిపిన్ చంద్రపాల్ స్ఫూర్తితో స్వాతంత్ర్య సమరంలోకి దిగిన టంగుటూరి మద్రాసులో సైమన్ కమిషన్ గో బ్యాక్ ఉద్యమంలో బ్రిటీష్ తుపాకులకు ఎదురునిలచి కాల్చమన్న ధీశాలిగా ఆంధ్రకేసరి బిరుదును పొందారన్నారు. ఉన్నత విలువలతో కూడిన ఆయన రాజకీయ జీవితం నేటి తరానికి స్ఫూర్తి దాయకమన్నారు. ప్రత్యేక కమిషనర్ రామ్మోహనరావు మాట్లాడుతూ, ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించి 72 ఏళ్ళ తరువాత రాష్ట్రపండుగా జరుపుకోవడం ఆనంద దాయకమని చెప్పారు. ఆయన పేరుమీద ప్రకాశం జిల్లా ఏర్పాటు చేయడం ఆయనకిచ్చే తొలి నివాళి అన్నారు. ప్రముఖ లాయరుగా సంపాదించిన రూ.13 లక్షలను దేశం కోసం సమర్పించుకోవడం ఆయన నిస్వార్థ జీవితానికి, దేశ భక్తికి నిదర్శనమన్నారు. సీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించిన ఈ వేడుకల్లో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ధైర్య సాహసాలే కేసరి బిరుదునిచ్చాయి

• ప్రకాశం జయంతి వేడుకల్లో రఘువీరారెడ్డి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: ధైర్యానికి మారుపేరు టంగుటూరి ప్రకాశం అని, స్వాతంత్ర్యోద్యమంలో ఆయన చూపిన తెగువ వల్లే ఆయనకు ఆంధ్రకేసరి అనే బిరుదు ఇచ్చారని ఏపీసీసీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ రఘువీరారెడ్డి చెప్పారు. ప్రకాశం 146 వ జయంతి వేడుకలు బుధవారం ఇందిరాభవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ ఉపాధ్యక్షులు ఎం సూర్యానాయక్, ప్రధాన కార్యదర్శులు గిడుగు రుద్రరాజు, జంగాగౌతమ్, కె రవిచంద్రారెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ సుందర రామశర్మ, పార్టీ నేత అంబటి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రఘువీరారెడ్డి మాట్లాడుతూ, న్యాయవాద వృత్తిద్వారా లక్షల రూపాయలు ఆర్జించే అవకాశం ఉన్నప్పటికీ, దేశం కోసం స్వాతంత్ర్యం పోరాటం లో పాల్గొన్నారని చెప్పారు. 1928 లో మద్రాసులో సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని బ్రిటీష్ సైనికుల తుపాకులకు ఎదురొడ్డి కాల్చమని సవాల్ విసిరినే ధైర్యశాలి అని కొనియాడారు. 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు మూడేళ్లు జైలులో పెట్టారని చెప్పారు. 1952లో పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకై ఆమరణ నిరాహార దీక్షచేస్తూ మరణించిన తర్వాత ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారని చెప్పారు.ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే విజయవాడ వద్ద ప్రకాశం బ్యారేజి నిర్మాణం జరిగిందన్నారు.తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహావ్యక్తియని కొనియాడారు.

శిక్షణ పొందకుంటే సర్వీసు నుంచి తొలగింపు

• పాఠశాల విద్యాకమిషనర్ కె. సంధ్యారాణి

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న వారందరూ ఉపాధ్యాయ శిక్షణ(డిఇఎల్ఇడి) పొందకుంటే ఏప్రిల్ 2019 నుంచి సర్వీసు నుంచి తొలగిస్తామని పాఠశాల విద్యాకమిషనర్ కె. సంధ్యారాణి తెలిపారు. పార్లమెంట్ విద్యాహక్కుచట్టం-2009 ప్రకారం ఈ నిబంధన వర్తిస్తుందన్నారు. ఈ నిబంధన ప్రకారం డిఎల్ఇడిని జాతీయ సార్వత్రిక విద్యాపీఠం, సార్వత్రిఇక దూర విద్య కార్యక్రమం ద్వారా పొందాల్సి ఉంటుందన్నారు. ఇదే చివరి అవకాశంగా ఉపాధ్యాయులు భావించాలని ఆమె హెచ్చరించారు. శిక్షణ పొందని ఉపాధ్యాయుల వివరాలు సార్వత్రిక విద్యాపీటం వెబ్‌సైట్‌లో అక్టోబర్ 15వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు వారివారి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను తప్పనిసరిగా డిఎల్ఇడి కోర్సును జాతీయ సార్వత్రిక విద్యాపీఠం, సార్వత్రిక దూవిద్య కార్యక్రమం ద్వారా పూర్తిచేయునట్లు చూడాలని ఆదేశించారు. శిక్షణ పొందని ఉపాధ్యాయుల వివరాలను పాఠశాల విద్య కమిషనర్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దీంతోపాటు శిక్షణ పొందని ఉపాధ్యాయుల ఇన్‌సర్వీస్ సర్టిఫికేట్, ఇంటర్మీడియట్ విద్యార్హత సర్టిఫికేట్, ఇంటర్ హాల్‌టికెట్ నెంబర్‌లను కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి జాతీయ సార్వత్రిక విద్యాపీఠం పోర్టల్‌లో మొదట విడత మెటీరియల్ అప్‌లోడ్ చేయబడుతుందన్నారు. మొదటి విడత కోర్సు అక్టోబర్ 3న ప్రారంభమవుతుందన్నారు. జూన్ 18వ తేదీ 2018 నాటికి పూర్తి అవుతుందన్నారు. ఆ తరువాత రెండవ విడత కోర్సు అదే సంవత్సరం జూన్ 25 నుంచి 2019 మార్చి 31నాటికి పూర్తిచేయబడుతుందన్నారు. మానవవనరులశాఖ కల్పిస్తున్న ఈ అఖరి అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

నిరాడంబరతకు మారుపేరు
ప్రకాశం కలెక్టర్ వినయ్‌చంద్

• ఒంగోలు రిమ్స్‌లో కుటుంబ సభ్యులకు వైద్యం



ఒంగోలు , కెఎన్ఎన్ బ్యూరో : కలెక్టర్ అంటే జిల్లాకు రాజు.. ఆయన అనుకుంటే పెద్ద పెద్ద ప్రైవేటు వైద్యులు ఇంటికి వచ్చి వైద్యం చేసి వెళతారు. కాని ప్రకాశం జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ కుటుంబ సభ్యులు కలెక్టరు హోదా దర్పాన్ని ఎన్నడూ ప్రదర్శించరు. కలెక్టర్ కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం వస్తే నేరుగా ప్రభుత్వ రిమ్స్ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం కలెక్టర్ వినయ్‌చంద్ సోదరుడు, తల్లి, ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి వచ్చారు. కలెక్టర్ సోదరుని చూసిన సిబ్బంది కలెక్టర్ తనిఖీకి వచ్చారంటూ ఒక్కసారిగా హడావిడి మొదలు పెట్టారు. ఎక్కడి వారు అక్కడ ఆసుపత్రిలో కలెక్టర్ ఉన్నారంటూ అలర్ట్ అయ్యారు. కలెక్టర్ సోదరుడు ఆయన పోలికలతో ఉండటంతో తికమక పడ్డారు. తీరా కలెక్టర్ సోదరుడు, తల్లి, రిమ్స్ క్యాజువాలిటీలోకి వెళ్లి వైద్యం చేయించుకుని ఓ గంట తరువాత వెళ్లిపోయారు. అయితే ప్రకాశం జిల్లా కలెక్టరు కుటుంబ సభ్యుల నిరాండబరత్వాన్ని ప్రదర్శించడం ఇది కొత్తేమీ కాదు. ఇటీవల కాలంలో కలెక్టర్ సతీమణి ఇదే ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నారు. అందరితో పాటు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్యం చేయించుకుని ఆదర్శంగా నిలిచారు.

ఉపాధి హామీ నిధులు పక్కదారి పడితే...
ఉద్యోగులపై కఠిన చర్యలు

• కూలీల చెల్లింపులకు రూ. 253 కోట్లు • 10వ తేదీలోగా ఇంటర్నల్ ఆడిట్ నివేదిక సమర్పించండి • సెప్టెంబరు 15లోగా ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయండి • ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా విడుదలైన నజదులను అడ్వాన్సులుగా లేదా ఇతర అవసరాలకు వినియోగించినట్లయితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మధ్యాహ్నం సచివాలయంలోని సిఎస్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. రియల్‌టైమ్ గవర్నెన్స్, పంచాయితీరాజ్-గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, పట్టణాభివృద్ధి, గృహనిర్మాణం, అటవీ పర్యావరణం, రవాణా, అర్‌అండ్‌బి, మైన్స్ అండ్ జియాలజీ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, వైద్య ఆరోగ్యం, ప్రణాళిక శాఖలపై సిఎస్ జిల్లా కలెక్టరలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం అమలుకు లేబర్ కాంపోనెంట్‌కు రూ.253 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద మరో రూ. 150 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. ఉపాధి హామీ నిధులు పలుచోట్ల అడ్వాన్స్ రూపంలోనూ, అలాగే పలు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలను ఖర్చు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సిఎస్ దినేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర అవసరాలకు ఉపాధిహామీ నిధులు ఖర్చు చేయరాదని తేల్చి చెప్పారు. గ్రామాల వారీగా చేపట్న పనులపై ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించి సెప్టెంబరు 10వ తేదీ లోగా నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం.. అవకతవకలు.. నిధుల దుర్వినియోగంపై సోషల్ ఆడిట్ నివేదికల్లో అక్రమాలు జరిగినట్లు రుజువైతే కేసుల్లో బాధ్యతలపై తక్షణ చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లా కలెక్టర్లను సిఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు.

ఇసుక మాఫియా.. బెల్టు షాపులపై కఠినంగా వ్యవహరించండి ..

రాష్ట్రంలో ఇసుక మాఫియా.. బెల్టు షాపులను పూర్తి స్థాయిలో నిర్మూలించేదిశగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సిఎస్ స్పష్టం చేశారు. ప్రభుత్వం గుర్తించిన ప్రతీ ఇసుక రిచ్‌కు ఇక నిర్ధేశిత అధికారికి నియమించి ఇసుక అక్రమంగా తరలిపోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఇసుక మాఫియాకు సంబంధించిన వచ్చే ఫిర్యాదులపై సకాలంలో చర్యలు తీసుకోవాలని దినేష్‌కుమార్ సూచించారు. ఇసుక రవాణా చేసే వాహనాలన్నింటినీ జిపిఎస్ విధానం అమర్చి అక్రమ రవాణాను పూర్తిగా అదుపు చేయవచ్చున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) అంశంపై సిఎస్ దినేష్‌కుమార్ ప్రస్తావిస్తూ.. ప్రజలే ముందు కార్యక్రమంలో భాగంగా బెల్టు షాపుల నిర్మూలన, ఇసుక మాఫియా వంటి ఇతర అంశాలపై 1100 కాల్‌సెంటర్, కనెక్టు టు ఎపి సిఎం, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. ఇందు కోసం ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించామని, అన్ని జిల్లాల ఉన్నతాధికారులూ ఈ యాప్‌ను అనుసరిస్తూ సకాలంలో సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు.

'వనం-మనం' కార్యక్రమంలో 19 కోట్ల మొక్కలు నాటాలి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'వనం-మనం' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి దినేష్‌కుమార్ అన్నారు. గత ఏడాది 24 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ.. కేవలం 6 కోట్ల మొక్కలుమాత్రమే నాటామని, మిగతా 19 కోట్ల మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షాకాలం పూర్తయ్యేలోగా లక్ష్యాన్ని సాధించాలని సిఎస్ జిల్లా కలెక్టర్లు, సంబంధితశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా అవి సక్రమంగా పెరిగే విధంగా వాటిని సంరక్షించే ప్రణాళికలను జిల్లాల్లో ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు. నాటిన మొక్కల్లో కనీసం 80 నుండి 90 శాతం బతికే విధంగా అవసరమైన సంరక్షణ చరయలు చేపట్టాలని అన్నారు. మలేరియా, డెంగ్యూ, ఇతర అంటువ్యాధులు ప్రభల కుండా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అలాగే ఆయా వ్యాధుల నివారణకు చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. నెలాఖరులోగా మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.

సెప్టెంబరు 15 లోగా ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలి..

రాష్ట్రంలో ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ లబ్ధిదారుల జాబితాను వచ్చేనెల 15వ తేదీ లోగా సిద్ధం చేయాలని సిఎస్ కలెక్టర్లను ఆదేశించారు. ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకాల కింద మంజూరు చేసిన ఇళ్లను త్వరితగతిన ప్రారంభించి, పూర్తి చేసేలా కృషి చేయాలని చెప్పారు. ఐఎవై ఇళ్లను అక్టోబరు నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెలాఖరులోగా ప్రజా సాధికార సర్వే పూర్తి చేసి వాలిడేషన్ నివేదికను సమర్పించాలన్నారు. ఎన్టీఆర్ జలసరి-2 కింద 17వేల బోర్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. వాటికి విద్యుత్ కనెక్షన్లను ఇచ్చేందుక అవసరమైన నిధులు కూడా మంజూరు చేశామని సిఎస్ స్పష్టం చేశారు. ఉద్యానవన తోటలు, ఎవెన్యూ ప్లాంటేషన్లపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిఎస్ సూచించారు.

వర్షాభావ పరిస్థితుల వల్ల తాగునీటికి ఇబ్బంది ఏర్పడిన చిత్తూరు, ప్రకాశం, కడప జిల్లాల్లోని 2,180 ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని అందుకు సంబంధించి నిధుల వినియో గంపై యుసిలను వెంటనే సమర్పించాలని ఆయన ఆదేశించా రు. భారత్ కార్యక్రమంపై మాట్లాడుతూ 3,700 గ్రామాలను ఈఏడాది ఓడిఎఫ్ గ్రామాలుగా ప్రకటించడం జరుగుతోంద ని సిఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. ఐటిడిఏ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలకు సం బంధించి 700 పనులు మంజూరు చేశామని అవన్నీ త్వరి తగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు డాక్టర్ డి.సాంబశివరావు, ముఖ్యకార్యదర్శులు సుమిత్రా దావ్రా, డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, గనులశాఖ కార్యదర్శి బి.శ్రీధర్, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఎక్సైజ్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్లు రామాంజనేయులు, లక్ష్మీ నర్సింహా, సుజాతా శర్మ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
గురువారం 24 ఆగస్టు 2017


పాలకులు మారగానే కేసులు వెలవెల..

తొమ్మిదేళ్ళ క్రితం మహారాష్ట్రలోని నాసిక్ సమీపంలో మాలేగావ్‌లో సంభవించిన పేలుళ్ళ ఘటనలో నిందితులు ఒక్కొక్కరూ బెయిల్‌పై బయటికి రావడంతో ఈ కేసు నీరుగారినట్టేనన్న విశ్లేషకుల అభిప్రాయం నిరాధారం కాదు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ప్రసాద్ శ్రీకాంత్ పురోహిత్ తొమ్మిదేళ్ళ జైలు జీవితం గడిపి బెయిల్‌పై విడుదల అయ్యారు. ఈ కేసులో మరో నిందితురాలైన సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ గత నెలలో ఇదే మాదిరిగా విడుదల అయ్యారు. ఈకేసులో నిందితులంతా సంఘ్ పరివార్ సంస్థలతో సంబంధాలున్నవారు కావడం వల్లనే పూర్వపు యూపీఏ ప్రభుత్వం వీరిపై అక్రమంగా కేసులు బనాయించిందని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న బిజేపీ ఆరోపించింది. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు తమ సానుభూతి పరులనూ, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు లౌకిక వాద శక్తులను ఇలాంటి కేసుల నుంచి విముక్తం చేయడం పరిపాటి అయింది. కేసుల్లో నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, రాజకీయంగా తమకున్న అధికారాన్నీ, పలుకుబడిని వినియోగించి కేసుల ను నీరుగార్చడానికి కూడా ఈ రెండు పార్టీలు అలవాటు పడ్డాయి. 2008లో సంభవించిన మాలేగావ్ పేలుళ్ళలో ఎనిమిది మంది మరణించారు. ఈ కేసులో యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఎటిఎస్) అధికారులు మొదట ఏడుగురు ముస్లింలపై కేసులు నమోదు చేశారు. అయితే, వారిపై మోపిన అభియోగాలు కల్పితాలని కింది కోర్టునిర్ధారించి వారిని విడుదల చేసింది. దాంతో ఇది హిందూ ఉగ్రవాదుల పనేనంటూ కొత్తగా చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ క్రమంలోనే సాధ్వీ ప్రజ్ఞాసింగ్, పురోహిత్‌లు అరెస్టు అయి జైలుకి వెళ్ళారు. ఎటిఎస్ అధిపతి హేమంత్ కర్కరే నేతృత్వంలో ఈ కేసును ఉగ్రవాద వ్యతిరేక దళం దర్యాప్తు చేసింది. హేమంత్ కర్కరే ముంబాయి దాడుల కేసులో లష్కర్ ఎ తోయిబా ఉగ్రవాదులతో హోరాహోరీగా పోరాడుతూ మరణించిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రలో పేలుళ్ళు, దాడుల కేసుల్లో నిందితులంతా పాక్ కేంద్రంగా పని చేస్తున్న లష్కర్ ఎ తోయిబా సంస్థకు చెందిన వారేనని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఇంతలో సాధ్వీ, పురోహిత్‌లను ఈ కేసులో నిందితులుగా చార్జిషీట్‌లు దాఖలు చేయడం వంటి ప్రక్రియ అంతా పై నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం జరుగుతోందని అప్పట్లోనే బీజేపీ ఆరోపించింది. అలాగే, గుజరాత్ అల్లర్లలో భాగంగా జరిగిన విధ్వంస కాండ, మారణహోమాల సంఘటనలపై దర్యాప్తులన్నీ ప్రభుత్వాలు మారగానే నీరుగారి పోయాయి. గుజరాత్‌లో గానీ, మహరాష్ట్రలో గాని పేలుళ్ళు, అల్లర్ల సంఘటనల్లో మరణించిన వారంతా ఏ పార్టీకీ చెందని అమాయకులే. అటువంటి వారి ఉసురు తీసిన వారు ఏ మతం వారైనా, ఏ పార్టీకి చెందిన వారైనా శిక్షార్హులే. అలాగే, మృతుల కుటుంబాలకు పరిహారం అందిస్తామన్న పాలకుల వాగ్దానాలు ఏళ్ళూపూళ్ళూ గడిచినా నెరవేరడం లేదు.ప్రభుత్వాలు మారితే నిందితులు మారిపోవడం, చార్జిషీట్లు మారిపోవడం, అసలు జరిగిన సంఘటన పూర్వాపరాలే మారిపోవడం ఆధునిక రాజకీయ వైచిత్రి. ఇలాంటి పరిణామాల వల్ల చట్టాలపైనా, దర్యాప్తు సంస్థలపైనా ప్రజల నమ్మకం సడలుతోంది. కేసుల దర్యాప్తు, చార్జిషీట్‌ల దాఖలు వంటి ప్రక్రియ అంతా ఓ ప్రహసనంగా సాగుతోందన్న రామ్ జత్మలానీ వ్యాఖ్య నిరాధారం కాదు. అయితే, ఆయన కూడా అందుకు అతీతుడు కాడు.ఒక్కొక్కసారి ఉగ్రవాదుల పక్షాన కూడా వాదించేందుకు తయారవుతూ ఉంటారు. ఉగ్రవాదులు అన్ని మతాల్లో ఉన్నారనీ, వారికి మతం, ప్రాంతం లేదని ప్రవచించిన వారే ఈ విభజనలు చేయడాన్ని జనం అర్థం చేసుకోలేకపోతున్నారు. సమయానుకూలంగా సాక్ష్యాలు, చార్జిషీట్లు మార్చి నిందితులను కాపాడే ప్రయత్నాలు చేయడం వల్ల మొత్తం వ్యవస్థ మీదే నమ్మకం సడలిపోయే ప్రమాదం ఉంది. సిబీఐ ఇప్పటికే విమర్శల పాలైంది.ఇప్పటికీ అవుతోంది. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వారికి అనుకూలంగా చార్జిషీట్‌లు దాఖలు చేయడంలో సీబీఐ అధికారులు సిద్ధహస్తులయ్యారు. సీబీఐ మాజీ డైరక్టర్ రంజిత్ సిన్హాపై బొగ్గు కుంభకోణంలో కేసు నమోదు కావడమే ఇందుకు నిదర్శనం.. దర్యాప్తు సంస్థలు పాలకుల చేతుల్లో పాచికలుగా మారుతున్నాయని సిబీఐ ధోరణి రుజువు చేస్తున్నాయి. ఇప్పుడు మాలేగావ్ కేసులో నిందితులందరికీ బెయిల్ లభించడంతో కేసు నీరుగారిపోవడం ఖాయమన్న అభిప్రాయం జనంలో ఏర్పడింది.

విలీనం పరమార్థం అధికారం

తమిళనాట ముగియని మూడు ముక్కలాట





తమిళనాడులో వికె శశికళ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయి సభాపర్వంలో బలపరీక్షవరకు వెళ్లిన అన్నాడీఎంకె పార్టీలో ముఖ్యమంత్రి పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి పన్నీరుసెల్వం వర్గాలు విలీనమయ్యాయి. జయలలిత ఆస్పత్రిలో చేరినప్పటినుంచి అన్నాడిఎంకె పార్టీలో మొదలైన సంక్షోభం రకరకాల మలుపులు తిరుగుతూ గత రెండేళ్లుగా ప్రజల్ని ఆకర్షిస్తూ వస్తోంది. జయలలిత మరణం తరువాత ఆమె వారసురాలిగా ప్రకటించుకున్న శశికళకు పోటీపడి మోకరిల్లిన పన్నీరుసెల్వం హఠాత్తుగా ఎదురు తిరగడం వెనక కారణం, ఆ తరువాత పళనిస్వామి శశికళను పక్కకు నెట్టి స్వతంత్రంగా వ్యవహరించడంలో ఆంతర్యం, మళ్లీ పన్నీరుసెల్వంతో జత కట్టడానికి సిద్ధపడటం వెనక రహస్యం ఒకటే. అదే అధికారాన్నీ, పదవులను రక్షించుకోవడం. వాటి మూలంగా మరో నాలుగేళ్లవరకు జయలలిత అడుగుజాడల్లో వీలైనంత సంపాదించుకోవడం. పార్టీలో చీలిక డీఎంకేలాంటి ప్రతిపక్షాలకు ఆస్కారమిచ్చి ప్రభుత్వం కూలిపోయే పరిస్థితి కొనితెచ్చుకోవడం రాజకీయ విజ్ఞత కాదనీ, పార్టీ కార్యకర్తలెవరు హర్షించరనీ, వచ్చే ఎన్నికల్లో పుట్టగతులుండవనీ అటు పన్నీరుసెల్వం ఇటు పళని సామి గ్రహించారు. అధికారాన్ని నిలుపుకోవాలంటే అభిమానాన్నీ, ఆత్మ గౌరవాన్ని ఒకింత త్యాగం చేయాలనీ పన్నీరుసెల్వం గ్రహించి విలీనానికి సిద్ధపడ్డారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ స్వీకరించడానికి ఒప్పుకున్నారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడు ఉపముఖ్యమంత్రి పదవికి ఒప్పుకోవడం విశేషమే. కానీ తప్పదు. పన్నీరుసెల్వం కంటే సంఖ్యా బలం ఎక్కువ ఉన్న పళనిస్వామి విలీనానికి ఎందుకు ఒప్పుకున్నారు? సెల్వం వెనక ప్రజలున్నారనా, పార్టీ బలం ఉందనా లేక ఈ రెండింటికంటే కేంద్రంలోని బిజెపి మద్దతుందనా? ఇవి రాజకీయ పండితులకు కూడా అంతుపట్టని ప్రశ్నలు.

శశికళ పట్ల చివరివరకు స్వామిభక్తి ప్రకటించి ఆమె అండతో ఇంత స్థాయికి ఎదిగిన పళనిస్వామి అటు మన్నార్‌గుడి మాఫియానూ, శశికళ పట్ల తన విధేయతను త్యాగం చేశారు. ఇందుకు ఒక కారణం శశికళ పట్ల ప్రజలలో పెరుగుతున్న వ్యతిరేకత. దాన్నుపయోగించుకుని డీఎంకే లాంటి పార్టీలు మళ్లీ తలెత్తే అవకాశాన్ని నివారించాల్సిన అనివార్య పరిస్థితి. అంతకుమించి బిజెపిని ప్రసన్నం చేసుకుని... కేంద్రం దయతో నిధులు సంపాదించి... ప్రజలలో మంచిపేరు తెచ్చుకుని మళ్లీ ఎన్నికలలో అధికారంలోకి రావాలనే కాంక్ష. కేవలం పదవుల కోసం జయలలిత ఆశయాలను మంటగలిపి, పార్టీని సర్వ నాశనం చేశారనే అపవాదు భవిష్యత్తులో తమ మీద పడకుండా పన్నీరు సెల్వం, పళనిస్వామి ఈ సయోధ్యకు తప్పనిసరిగా ఒప్పుకోవలసివచ్చింది. అమ్మ ఆశయాల కోసం కలిసి మెలసి పనిచేస్తామని విలీన వేదికపై పన్నీరుసెల్వం, పళనిసామి ప్రతిజ్ఞ చేసినట్లు ప్రకటించుకున్నారు. రాష్ట్రంలో అధిక శాతం ప్రజల మద్దతున్న అన్నాడీఎంకే పార్టీతో పొత్తుకు జయలలిత బతికున్నంత వరకు విఫల యత్నం చేసిన బిజెపి జయలలిత మరణించిన తరువాత అన్నాడీఎంకేను బలహీనపరచి తరువాత తామే పటిష్ట పరిచి చక్రం తిప్పుతోంది. విలీనం ఎప్పుడు జరగాలో... ఎలాంటి షరతుల మీద జరగాలో... కూడా బీజేపీయే నిర్ణయించింది. ప్రణాళికను అమలు పరచినట్లు విలీన ప్రక్రియ ఘట్టాలను పరిశీలించినవారికి తెలుస్తుంది. గత నెల పన్నీరుసెల్వం స్వయంగా ఢిల్లీ వెళ్లి పళని సామితో విలీనం గురించి వివరించినట్లు పత్రికలూ ప్రసార మాధ్యమాలు ప్రకటించాయి. మోడీకి అన్నాడీఎంకే విలీనానికి సంబంధం ఏమిటి? అలాగే విలీనాన్ని హర్షిస్తూ, అన్నాడీఎంకే నూతన ప్రభుత్వానికి కేంద్రం పూర్తి మద్దతు ఇచ్చి సహాయం చేస్తుందని మోడీ ట్వీట్ చేశారు. దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఇదే సమయంలో ఆంధ్రాలో వైసిపికి కూడా మద్దతిచ్చి తన ఆటను అక్కడ కూడా బిజెపి కొనసాగించ వచ్చునని ఊహాగానాలకు తమిళనాడులో అది నిర్వహించిన పాత్ర ఊతమిస్తోంది. మూడు ముక్కలాట ముగిసినా శశికళ వర్గం ఆమెకున్న అర్థ బలం, ప్రభుత్వంలో ఇప్పటికీ ఆమెకున్న విధేయుల అండదండలు పన్నీరు, పళని లకు సవాలు విసరవనే హామీ ఏదీ లేదు. ఎందుకంటే, శశికళను పార్టీ నుంచి బహిష్కరించాలని నిర్ణయాన్ని 18 మంది శాసన సభ్యులు వ్యతిరేకిస్తూ విలీనం ఘడియలలోనే తిరుగుబాటు చేయడం ఇందుకు ఒక ఉదాహరణ. అన్నాడీఎంకే వర్గాల విలీనాన్ని తమ వ్యూహానికి గొడ్డలిపెట్టుగా భావించిన శశికళ వర్గం ద్వారా పావులు కదపవచ్చునని తెలుస్తోంది.

రెండురోజుల క్రితం స్టాలిన్ , టిటివి దినకరన్ లండన్లో సమావేశమైనట్లు వచ్చిన వార్తలు డీఎంకే వ్యూహాన్ని వెల్లడించాయి. అందువల్ల ఈ 18మంది శాసన సభ్యుల కార్యకలాపాలతో మరో మూడుముక్కలాట తప్పదు. జయలలిత మరణంపై దర్యాప్తు, ఆమె నివాస భవనాన్ని స్మారక భవనంగా మార్చు, పార్టీ నుంచి శశికళ బహిష్కరణ అంటూ విలీనానికి పన్నీరుసెల్వం పెట్టిన ప్రధాన షరతులు. వీటికి పళని స్వామి ఒప్పుకోకపోవడంతో ప్రక్రియ ఆగింది. కానీ హఠాత్తుగా వీటిని ఎందుకు ఒప్పుకున్నారో అప్పుడు ఎందుకు కాదన్నారో కూడా అంతుపట్టని మన్నార్ గుడి రహస్యమే. రెండువర్గాల కలిస్తే పార్టీలోని ప్రభుత్వంలోని అస్థిరత్వం తొలిగి ప్రజలకు మనశ్శాంతి ఉంటుందనుకుంటే ఆ ఆశా కనిపించడం లేదు.

మొదటినుంచి సినిమాలతో ప్రభావితమైన తమిళ రాజకీయాలలో వాటికీ మించిన ఉత్కంఠభరితమైన సన్నివేశాలను ఆవిష్కరిస్తూ ప్రజల దృష్టిని ఆకర్షిస్తూనే వున్నాయి. ఇపుడు రజనీకాంత్, కమల్ హాసన్ ప్రవేశంపై మళ్లీ వార్తలు గుప్పుమనడంతో అడుగడుగునా ఉత్కంఠ తప్పదు. అన్నాడీఎంకె వర్గాల విలీనాన్ని కమలహాసన్ హేళన చేస్తూ, వాళ్ళని జోకర్లగా పోలుస్తూ ట్వీట్ చేయడం, మరొకవైపు రజనీకాంత్ అభిమానులు ఆయన రాజకీయ ప్రవేశాన్ని ధ్రువీకరిస్తూ ప్రకటనలు చేయడంతో ఎవరు ఎటు వైపు.. ఎవరి వెనక ఎవరు..అనే ఊహాగానాలు కొనసాగుతూనే వున్నాయి. సమస్యల వలయంలో నోట్ల రద్దు, జీఎస్టీ విధానాలతో గందరగోళంలో పడ్డ ప్రజలకి రాజకీయాలు ఒకింత వినోదాన్ని కలిగిస్తున్నాయి. కొసమెరుపేంటంటే ఒకవైపు విలీనం ప్రకటన జరగుతున్న ఘడియలలోనే శశికళ బెంగుళూరులో ఒక విఐపిలాగా బయటకు వెళ్లి తిరిగి వస్తున్న వీడియో కథనం ప్రసారమైంది. ఇది ప్రజల్ని నివ్వెరపరచింది.మంగళవారం నాడు తమిళ రాజకీయాల్లో మరో ట్విస్టు. దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు 18మంది గవర్నర్‌ను కలుసుకుని, పళని సామి మంత్రివర్గానికి తాము మద్దతును ఉపసంహరించుకున్నట్లు లేఖ అందించారు. అవిశ్వాస తీర్మానం పెట్టాలని కూడా నిర్ణయించుకున్నారు. అవిశ్వాస తీర్మానమంటే మళ్ళీ బల నిరూపణలు, విడిది రాజకీయాలు, ఎమ్మెల్యేల కొనుగోళ్ళు.. తదితర పరిణామాలకు తావిచ్చినట్లే. అంటే మూడు నెలల క్రితం థ్రిల్లర్ సినిమాను తలపించిన దృశ్యాలు తమిళనాట మరోసారి కనిపిస్తాయన్న మాట. ఇక్కడ తేడా ఒక్కటే. వేదిక మారింది. గతంలో గోల్డెన్ బీచ్ రిసార్ట్సులోఎమ్మెల్యేలు సకలభోగాలనూ అనుభవిస్తే ఇప్పుడు అందుకు పుదుచ్చేరి రిసార్టులు వారిని అలరించనున్నాయి.

-ఎస్.వి. సూర్యప్రకాశరావు



వివిఎన్ ఆదిత్య.. వాడ్రేవు నాగేంద్ర ఆదిత్య.. అతి తక్కువ సమ యంలో తెలుగు చలన చిత్ర రంగంలో తనకంటూ ఓ సుస్థిర స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న దర్శకుడు. తీసినవి పది సినిమాలే అయినా చెరగని ముద్ర వేసుకున్నాడు. విఎన్ ఆదిత్య పేరు చెప్పగానే మొదట గుర్తొచ్చేది ఉదయ్ కిరణ్.. వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన మనసంతా నువ్వే సినిమా సృష్టించిన సంచలనం అంతాఇంతా కాదు. కష్టపడే తత్వమే ఆదిత్యను అనతికాలంలోనే మంచిపేరు తెచ్చిపెట్టింది. దర్శకుడంటే కచ్చితంగా మంచి రచయితే అయి ఉంటాడు కదా. ఆ కోణాన్ని వెలికితీసేదే ఆదిత్య హృదయం. వారం వారం ఆంధ్రప్రభ పాఠకులకు ప్రత్యేకం..

అందుకే! ప్రేక్షకుణ్ణి దేవుడంటాం!!

ఆంధ్రా వాడు, తెలంగాణా వాడు, అమెరికా వాడు, అరవవాడు, మళయాళం వాడు, సినిమావాడు అంటారు కానీ, లాయరు వాడు, డాక్టరు వాడు, ఇంజనీరు వాడు, సినిమా వాడు అనం. అంటే దీన్నిబట్టి ఏమర్థమౌతోంది? సినిమా అనేది వృత్తికన్నా అతీతమైంది. ప్రపంచంలోని అనేక ప్రాంతాల లాగే అది మరో ప్రాంతం. అంటే అది మరో ప్రపంచం. మన భౌతిక ప్రపంచంలోని రియాలిటీకి, మన ఊహా ప్రపంచంలోని సృజనని, భావుకతని, కల్పనని, ఊహని జోడించి కొంతమంది వెండితెర మీద సృష్టించే మరో ప్రపంచం సినిమా - సమాజం తన సౌలభ్యం కోసం ఈ మరో ప్రపంచాన్ని టూరిస్టు స్పాట్‌లాగా చేసి, ఆ టూర్‌కి ఒక టాకీసు కట్టి, టిక్కెట్టు పెట్టి, రెండున్నర గంటల చొప్పున రోజుకి నాలుగాటలుగా కుదించుకుంది. వినోద సాధనంగా, వాణిజ్యంగా దీన్ని పరిగణిస్తోంది. అయినా జన జీవితంపైన దీని ప్రభావాన్ని ఏమాత్రం ఆపలేకపోతోంది. అడవి రాముడై అలరించినా, శంకరాభరణమై సప్త స్వరాలు పల్లవించినా, శివమెత్తినా,



అల్లూరి సీతారామరాజై విప్లవాగ్నులు వెదజల్లినా, మన దేశం, వందేమాతరం అంటూ దేశభక్తి ప్రబోధించినా, దేవదాసై మత్తెక్కించినా, ఇదొక మాయాబజారు. పోతనని, వేమనని, శ్రీనాథుణ్ని, రాముణ్ని, కృష్ణుణ్ని, ఘరానా మొగుణ్ని, ఖైదీని, రౌడీని, మంచివాణ్ని, చెడ్డవాణ్ని, అపరిచితుణ్ని, జెంటిల్‌మేన్‌ని, పోకిరీలని, గబ్బర్‌సింగ్‌ని అందర్నీ మార్కెట్‌లో పెట్టి, ప్రేక్షకులు ఆడుకునే బొమ్మల్లా ఆప్షన్ ఇచ్చిన సూపర్ మార్కెట్ సినిమా. ఇందులో కాలానుగుణంగా, తరాలకనుగుణంగా, ప్రపంచీకరణలో మారుతున్న సాంకేతిక విజ్ఞానానికి అనుగుణంగా, ఈ సూపర్ మార్కెట్‌లో బొమ్మల రూపురేఖలు మారుతూనే ఉన్నాయి వందేళ్ళుగా. అలాంటి సినిమా వాడి మీద సమాజానికి ఉన్న హక్కు ఎప్పుడూ ఒక్కటే. వాడు సమాజాన్ని బాగు చేయక పోయినా పర్లేదు, వినోదాన్నిచ్చినా, విజ్ఞానాన్నిచ్చినా, కళలు, సంస్కృతుల సౌరభాలు వెదజల్లినా పర్లేదు. సమాజానికి అవాంఛనీయమైన పనులకి ప్రచారం కల్పించకుండా సమాజాన్ని పాడుచేయకుండా ఉంటే చాలన్న నియమం మాత్రమే. దానికి కట్టుబడి ఉన్నంతకాలం ఏ సోషల్ మీడియా అయినా, ఏ ప్రభుత్వమైనా, మనోభావాలున్న ఏ సంఘాలైనా, మహిళా సంఘాలైనా, మానవ హక్కుల కమిషన్లు అయినా, ప్రజలైనా, పత్రికలైనా సినిమా వాళ్లని ఏమీ చెయ్యవు, చెయ్యలేవు. మనం బాధ్యతగా ఉంటే ఎదుటివాడు హక్కుల్ని వాడలేడు. మనం బాధ్యతలు విస్మరిస్తే ఎదుటివాడు వాడి హక్కుల్ని గుర్తు తెచ్చుకుంటాడు. అరవవాడిని, మళయాళీని, బెంగాలీని, హిందీ హీరోయిన్లని, మరాఠీ విలన్లని నెత్తిన పెట్టుకున్న తెలుగు ప్రేక్షకుడు ప్రత్యేకించి తెలంగాణ కళాకారుల్ని, సాంకేతికనిపుణుల్ని మాత్రం ఉద్దేశపూర్వకంగా తొక్కేశారన్న వాదన ఈ మధ్య పరిశ్రమలో బలంగా వినిపిస్తోంది. అది సరికాదు. ప్రేక్షకుడు, థియేటరు ఎక్కడుంటే సినిమా ప్రపంచంలోని ఏమూలలకైనా వెళ్తుంది - వెళ్లూనుతుంది. అలా చూసుకుంటే, గత యాభై ఏళ్లుగా హైదరాబాద్ మినహాయించి, గ్రామీణ తెలంగాణా ప్రాంతాల్లో థియేటర్లు కట్టడం చాలా తక్కువ. ఇప్పుడు కొత్త రాష్ట్రం వచ్చాక అయినా, తెలంగాణ నిర్మాతలు, వ్యాపారులు, రాజకీయ నాయకులు ఊరికొక మంచి సినిమా హాలు నిర్మించే పని మొదలుపెడితే, తెలంగాణ సినిమా రెవెన్యూ పెరుగుతుంది. సహజంగానే ఆ డబ్బు ఆ ప్రాంతపు సినిమాని అభివృద్ధి చేస్తుంది. ఆంధ్రా సినిమా పెరిగింది కేవలం అందువల్లే. ఏళ్ల తరబడి ఏ ప్రభుత్వమైనా సినిమా వాళ్లని తమ విజిటింగ్ కార్డుగా వినియోగించుకున్నదే తప్ప సినిమా వాడికి ప్రభుత్వాలు చేయగలిగింది చాలా తక్కువ. వీలున్నప్పుడల్లా పన్నులు వడ్డించడం, రేట్లు పెంచి నడ్డి విరగ్గొట్టడం తప్ప. సినిమా వాడు వాడి ఆలోచనకాయకష్టంతోనే వాడు పెరుగుతుంటాడు. ప్రేక్షకుడి ఆరాధనా స్థాయిని బట్టే వాడు బలవంతుడో, బలహీనుడో అవుతుంటాడు. వాడికి రాజకీయాలు, ప్రాంతీయ భేదాలు, మతాల విద్వేషాలు, రాగద్వేషాలు ఇలా సమాజంలో ఉన్న మంచి, చెడులన్నీ ఆట వస్తువులతో సమానం. అవే వాడి కథా వస్తువులు, ముడిసరుకు కాబట్టి సినిమా వాణ్ని ప్రక్షాళన చెయ్యాలనుకోవడం వినోదాత్మకం. ఎందుకంటే సమాజాన్ని ప్రక్షాళన చేస్తే తప్ప వీడి ప్రక్షాళన సాధ్యం కాదు కాబట్టి. సమాజాన్ని ప్రక్షాళన చెయ్యాలంటే ఓటరుకి విజ్ఞతుండాలి, సినిమా వాళ్లని ప్రక్షాళన చెయ్యాలంటే ప్రేక్షకుడికి విచక్షణ ఉండాలి. అందుకే ఓటరుని మహాశయుడు, ప్రేక్షకుడ్ని దేవుడు అంటాం.

-వి.ఎన్.ఆదిత్య

ఆ వ్యూహం...చైనాకు గరళం



ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా అనుసరించనున్న కొత్త వ్యూహాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఎన్నికల సందర్భంగా ఆయన దేశ ప్రజలకు ఇచ్చిన వాగ్దానానికి ఇది విరుద్ధంగా ఉన్నా, ఆఫ్ఘన్‌లో అమెరికా పిల్లిమొగ్గ వేసినట్టు కనిపిస్తున్నా, ఆసియాలో మారిన పరిస్థితులకు అనుగుణంగానే ట్రంప్ తన ఆలోచనను మార్చుకున్నట్టు కనిపిస్తోంది. పాకిస్తాన్‌ని అదుపు చేయడంతో పాటు మహామార్గం, ఆర్థిక నడవ నిర్మాణాల పేరిట తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి చైనా సాగిస్తున్న యత్నాలకు చెక్ పెట్టడమే ఆయన లక్ష్యంగా కనిపిస్తోంది.

ఆఫ్ఘనిస్థాన్‌లో సంకీర్ణ సేనల సంఖ్యను పెంచాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించ డం వ్యూహాత్మకమే కావచ్చు. ఆఫ్ఘన్‌లో తాలిబన్లు ఈ మధ్య కాలంలో బాగా పుంజుకున్నారు. ఇరాక్‌లోని మోసుల్ నుంచి తరిమి వేయబడిన ఐఎస్ ఉగ్రవాదులు ఆఫ్ఘన్, పాక్ సరిహద్దు ప్రదేశాల్లో తలదాచుకున్నారు. వారి ప్రోద్బలంతోనే తాలిబన్లు ఈ మధ్య చెలరేగి పోతున్నారు. ఆఫ్ఘన్ నుంచి సంకీర్ణ దళాలను ఉపసంహరించుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. అందుకు అనుగుణంగానే గత నెలలో ఆఫ్ఘన్‌లో తాలిబన్‌ల దాడిలో పలువురు మరణించారు. ఇదంతా వరుసక్రమంగానే జరుగుతున్నట్టు స్పష్టం అవుతోంది. సేనల ఉపసంహరణకు బదులు మరిన్ని సేనలను ఆఫ్ఘన్‌కు పంపాలని ట్రంప్ నిర్ణయించడం ముమ్మాటికీ పిల్లిమొగ్గే. అయితే, ఆఫ్ఘన్‌లో సేవా కార్యక్రమాలను అందించడంలో సాయపడుతున్న భారత్‌కు మరింత ప్రమేయం కల్పించాలని ట్రంప్ నిర్ణయించడంతో పాక్ అగ్గిమీద గుగ్గిలం అయింది. ఆఫ్ఘన్ సరిహద్దున ఉన్న తమ దేశానికి ప్రాధాన్యం ఇవ్వడానికి బదులు భారత్ ప్రమేయాన్ని కోరడమేమిటన్నది పాక్ గుర్రు. అంతేకాక, ఉగ్రవాదాన్ని అణచివేయడం కోసం గడిచిన పదహారు సంవత్సరాలుగా అమెరికా నుంచి కోట్లాది డాలర్ల సహాయం అందుకుంటున్న పాక్ ఆ డబ్బంతా ఉగ్రవాదులకు ఊతం ఇవ్వడానికే వినియోగిస్తోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కటువుగా ఉన్నా , అవి అక్షర సత్యం.అవి పాక్‌కి మింగుడు పడటం లేదు. పాక్ మాత్రమే కాక, దానికి మద్దతు ఇస్తున్న చైనాకు కూడా అవి అప్రియంగానే కనిపిస్తున్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌లో సంకీర్ణ దళాల ఉనికి వల్ల పాక్ ఇబ్బందిగా భావించడం అర్థం చేసుకోదగినదే. ఈ విషయంలో చైనా నిరసన తెలపడం గుమ్మడికాయల దొంగ సామెత గుర్తుకు తెస్తున్నది. ఆక్రమిత కాశ్మీర్ ద్వారా ఆర్థిక నడవ నిర్మాణానికి వడివడిగా అడుగులేస్తున్న చైనాకు ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ సేనలు మరింతగా పెరగడం ఇబ్బందే. తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి చైనా వేస్తున్న ఎత్తుగడలకు ఇవి అవరోధమే. అమెరికా ఇంతవరకూ ఆఫ్ఘన్-పాక్ విధానాన్నిఅనుసరిస్తూ వస్తోంది. దాని వల్ల ప్రయోజనం లేకపోగా, సమస్య మరింత జటిలం అవుతోందని గ్రహించడం వల్లనే, భారత్‌ని కలుపుకుని పోవాలని ట్రంప్ నిర్ణయించారు. ఆఫ్ఘన్ పునర్నిర్మాణంలో భారత్ అందిస్తున్న పాత్ర గురించి ట్రంప్‌కి తెలుసు. అంతేకాదు, ఆఫ్ఘన్‌లో పునర్నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొంటున్న భారత్ స్వచ్ఛంద సంస్థల సభ్యులు తాలిబన్లు, హఖానీ గ్రూపు ఉగ్రవాదుల నుంచి తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కొంటున్న సంగతి కూడా ట్రంప్‌కి తెలుసు. ఆ విషయాన్ని ఆయన పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సమక్షంలో నేబహిరంగంగా ప్రకటించారు. రియాద్‌లో రెండు మాసాల క్రితం ఉగ్రవాదంపై జరిగిన సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థల నుంచి భారత్ తీవ్రంగా నష్టపోతోందని ప్రకటించడంతో అదే వేదిక మీద ఉన్న నవాజ్ షరీఫ్ ఇరుకున పడ్డారు. ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ తమ దేశంలో సంకీర్ణ సేనల సంఖ్యను పెంచాలన్న ట్రంప్ నిర్ణయాన్ని సమర్థించగా, తాలిబన్లు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆఫ్ఘనిస్థాన్‌కి సొంత సైన్యం ఉన్నా ప్రజలకు రక్షణ కల్పించే సత్తాని పదహారు సంవత్సరాలైనా సంపాదించుకోలేకపోయిందన్నది సుస్పష్టం. తాలిబన్లపాలన అంతమైన తర్వాత హమీద్ కర్జాయ్ నేతృత్వంలో అమెరికా నిలబెట్టిన కీలుబొమ్మ ప్రభుత్వం దాని వారసత్వంగా వచ్చిన అష్రఫ్ ఘనీ ప్రభుత్వం సంకీర్ణ సేనల అండతోనే రోజులు నెట్టుకొస్తున్నాయి. ఆఫ్ఘన్‌లో సంకీర్ణసేనలు శాశ్వతంగా కొనసాగడం వల్ల అమెరికాకు ఆర్థిక భారం తడిసిమోపెడు అవుతోంది. తాలిబన్ల దాడిలో సంకీర్ణ సేనలోని జవాన్లు అనేక మంది నేలకొరుగుతున్నారు. దీంతో దేశంలో తీవ్రమైన ప్రతిఘటన ఎదురవుతోంది. బుష్ అనాలోచితంగా జరిపిన దాడి కారణంగా అమెరికా తనకు సంబంధం లేకపోయినా, అనవసరపు భారాన్ని మోయాల్సి వస్తోందంటూ అప్పట్లో డెమోక్రాట్లు ఆరోపించారు. సంకీర్ణ సేనలను తగ్గిస్తామన్న వాగ్దానంతో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి బరాక్ ఒబామా అధికారంలోకి వచ్చి రెండు పర్యాయాలు ఆ పదవిలో ఉన్నా వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోయారు. ఒబామా తర్వాత అధికారంలోకి వచ్చిన ట్రంప్‌కి ఇది ఒక పెద్ద సవాల్‌గా పరిణమించింది. ఆయన కూడా ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆఫ్ఘన్‌లో సేనల సంఖ్యను తగ్గిస్తానని వాగ్దానం చేశారు కానీ, అది సాధ్యం కాదన్న విషయం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే తెలుసుకోగలిగారు. ఫలితంగానే ఆయన తాజా నిర్ణయాన్ని తీసుకున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో సంకీర్ణ దళాలకు తాలిబన్ల కన్నా, హఖానీ గ్రూపు ఉగ్రవాదుల నుంచి పెను సవాల్ ఎదురవుతోంది. హఖానీ గ్రూపు ఉగ్రవాదులంతా పాక్‌లో తలదాచుకున్నారన్నది బహిరంగ రహస్యం. అందుకే, ఇటీవల కాలంలో ట్రంప్ తరచూ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం గురించి బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇప్పుడు ట్రంప్ ప్రకటించిన నూతన విధానం గతంలో ఒబామా ప్రకటించిన విధానానికి పూర్తిగా భిన్నమైనది. అమెరికా విజేతగా నిలవాలి, అమెరికా సత్తా ఏమిటో లోకానికి తెలియాలి అని అధికారంలోకి రాకముందునుంచి అంటున్న ట్రంప్ అందుకు తగినట్టుగానే ఇప్పుడు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. అదే సందర్భంలో తన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోతున్నందుకు అమెరికన్లకు సారీ చెప్పిన రీతిలో ఆయన ప్రకటన చేయడం గమనార్హం. అమెరికన్ల నిరాశానిస్పృహలను నేను అర్థం చేసుకోగలను కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా గెలవాలంటే సంకీర్ణ సేనల సంఖ్యను పెంచక తప్పదంటూ ఆయన తన ప్రకటనను ముగించారు. భారత్‌కి ప్రమేయం కల్పించడం సమంజసమేనన్నది ఆయన అభిప్రాయం. ఎన్నో కష్టాలకోర్చి భారత్‌కి చెందిన సహాయక సంస్థలు అందిస్తున్న సాయాన్ని ఎలా మరవగలం అని ఆయన అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలకు స్వర్గధామంగా మారిందంటూ ట్రంప్ పదేపదే వ్యాఖ్యానించడం భారత్ వాదాన్ని సమర్థించినట్టయింది. అది కూడా పాక్, చైనాల ఆగ్రహానికి కారణం అయింది. అంతేకాక, చైనా నిర్మిస్తున్న మహామార్గాన్ని అడ్డుకుంటున్న భారత్‌కి అగ్రరాజ్యం అండ దొరికినట్టయిందని చైనా ఆందోళన చెందుతోంది. ఆఫ్ఘనిస్థాన్‌లో ఐఎస్ ఉగ్రవాదుల స్థావరాలు ఉన్నట్టు అమెరికా కూడా గుర్తించింది. సంకీర్ణ సేనల సంఖ్యను పెంచాలన్న ట్రంప్ నిర్ణయానికి ఇది కూడా ఒక ప్రేరణ కావచ్చు. ఆఫ్ఘన్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను అదుపులో ఉంచడంతో పాటు చైనాకు చెక్ పెట్టేందుకు సంకీర్ణ సేనల సంఖ్య పెంపు దోహదం చేయవచ్చు.దీంతో అమెరికా జోక్యం మరింత పెరగవచ్చు. చైనా అసలు బెంగ అదే.

-ఎ.పి. స్వామి

నిజాయితీకి స్థానముందా?

తొమ్మిదేళ్ళలో 27సార్లు బదిలీ అయిన అధికారి

నిజాయితీపరులకు ఈ దేశంలో స్థానం లేదా? అదేంటి అనుకుంటున్నారా! అయితే బెంగళూరుకు చెందిన ఈ అధికారి కథనాన్ని కచ్చితంగా చదవాల్సిందే. మత్తయ్య బృహత్ బెంగళూరు కార్పొరేషన్‌లో కర్ణాటక అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ సీనియర్ అధికారి. అవినీతంటే ఆయనకు ఒళ్ళు మంట. ఎక్కడ అది కనిపించినా శివాలెత్తుతారు. ఫలితం తొమ్మిదేళ్ళలో 27 ట్రాన్స్‌ఫర్లు. తాజాగా ఆయన బెంగళూరు కార్పొరేషన్‌లో ప్రకటనలకు సంబంధించిన 2వేల కోట్ల రూపాయల కుంభకోణాన్ని బయటపెట్టారు. అవినీతి అధికారులపై ఆయన లోకాయుక్త తలుపు తట్టారు. ఆ అధికారులు మత్తయ్యను వేధించారు.. బెదిరించారు. అయినా తన పట్టు వీడలేదు. 11 నెలలుగా ఆయనకు కారు సౌకర్యాన్ని తొలగించారు. సైకిలుపై వెళ్ళి తన విధులను నిర్వర్తిస్తున్నారాయన. రోజుకు 80కిలోమీటర్ల పైనే తిరగాల్సుంటుంది. అధికార వర్గాలలో ఆయనకు ముక్కుసూటి మనిషని పేరుంది. 57 సంవత్సరాల వయస్సున్న మత్తయ్య గతంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేశారు. అనంతరం కర్ణాటక అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లో చేరారు. ఫ్లాగ్‌షిప్ మిషన్, సకల మిషన్‌లకు అధికారిగా విధులు నిర్వర్తించారు. ఈ ఏడాది మే నెలలో మత్తయ్య చేసిన ఫిర్యాదు సంచలనాన్నే సృష్టించింది. సకల మిషన్ హెడ్ కల్పన నిధులను తన స్వీయ అవసరాల కోసం వినియోగించుకుంటున్నారని ఆయన లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో కల్పనను మిషన్ బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పించింది.మే నెలలో ఐఎఎస్ అధికారులు ఎమ్. లక్ష్మీనారాయణ, టికె అనిల్ కుమార్, ఇవి రమణా రెడ్డి అవినీతి చర్యలపై కూడా ఆయన లోకాయుక్తను ఆశ్రయించారు. 2014లో మాండ్యా డెవలప్మెంట్ అథారిటీలో పనిచేస్తున్న సమయంలో స్థలాల కేటాయింపులో అక్రమాలను బయటకు తెచ్చాడు. అప్పట్లో ఇది 300 కోట్ల రూపాయల అవినీతని తేలింది. ఈ కారణంగా ఆయనకు నాలుగు నెలల్లో ఆరుసార్లు బదిలీ అయ్యింది. నాలుగు నెలల పాటు జీతం కూడా చెల్లించలేదు. నిజాయితీకి ప్రతిఫలంగా ఇప్పుడు సైకిల్ ఆయన చేతికొచ్చింది. బెంగళూరులోని రాజనకుంటేలో ఉన్న కార్యాలయానికి ఆయన రెండున్నరగంటల పాటు 40 కిలోమీటర్లు సైకిల్ తొక్కి చేరుకుంటారు. ఉదయం 7గంటలకు ఇంట్లో బయలుదేరిన ఆయన కార్యాలయానికి చేరేసరికి 9.30 అవుతుంది. మత్తయ్య



తన నిరసనను సైకిల్ తొక్కడం ద్వారా నిశ్శబ్దంగా ప్రదర్శిస్తున్నారని మత్తయ్య మిత్రులు చెబుతుంటారు. ఇది నిరసనేనా అనడిగితే.. సైకిలంటే తనకిష్టమనీ, నిరసనలాంటిదేమీ కాదనీ ఆయన తోసిపుచ్చుతున్నారు. 11 నెలలుగా 30 వేల చొప్పున రవాణా బిల్లును చెల్లించకపోవడంతో సంబంధిత సంస్థ తనకు కారును తొలగించిందని అంగీకరించారు. నాకు వాహనాన్ని సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఆమేరకు ఉత్తర్వులు కూడా ఉన్నాయి. కానీ, ఇదిగో ఇలా సైకిల్‌పై వెళ్ళాల్సి వస్తోందంటూ అన్యాపదేశంగా చెప్పాల్సింది చెప్పేశారు మత్తయ్య. ఇలాంటి కోవలోకి మత్తయ్య ఒక్కరే కాదు.. మరికొందరు అధికారులు కూడా ఉన్నారు. మైసూర్ ల్యాంప్స్ ఎమ్‌డి ఎమ్.ఎన్. విజయకుమార్‌కు కూడా వాహనాన్ని సమకూర్చలేదు. కార్యాలయ ఆవరణలోకి కూడా ప్రవేశించనీయలేదు. ఫలితంగా కార్యాలయం బయటే సమావేశాన్ని నిర్వహించుకున్నారు. విజయ్‌కుమార్ పరిస్థితికి కారణం కూడా అవినీతిపరుల ఆటకట్టించాలనుకున్న ఆయన తత్వమే.1991 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అశోక్ ఖేంకా తన 26ఏళ్ళ సర్వీసులో 50సార్లు బదిలీ అయ్యారు. సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా ఆస్తుల అక్రమ లావాదేవీలకు అనుమతించకపోవడమే ఖేంకా చేసిన తప్పు. ఈ ఉదంతాలు చదివిన తరవాత.. ఈ దేశంలో నీతిమంతులకు స్థానముందా? అనే అనుమానం రావడం లేదా?

-కె.వి.ఎస్

సురేష్ ప్రభు
రాజీనామా చేయాలి

రైల్వే మంత్రిగా ఘోరంగా విఫలమయ్యారని ధ్వజమెత్తిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: వరుస రైలు ప్రమాదాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ప్రయాణికులకు భద్రతకల్పించడంలో, ప్రమాదాలనివారణలో రైల్వే మంత్రిగా సురేశ్ ప్రభు ఘోరంగా విఫలం అయ్యారని ధ్వజమెత్తింది. వెంటనే ఆయనను పదవి నుంచి తప్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని డిమాండ్ చేసింది. ఆయన స్థానంలో జవాబుదారీ వ్యక్తికి బాధ్యతలు అప్పగించాలని సూచించింది. దుర్ఘటనలకు రైల్వే మంత్రి నైతిక బాధ్యత వహించాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా అన్నారు. రైల్వేల భద్రతపై రోడ్‌మ్యాప్‌కు ప్రధాని చర్యలు చేపట్టేందుకు ముందుకు రావాలని హితవు పలికారు. రైల్వే బోర్డు సభ్యుడిని సస్పెండ్ చేయడమో, సెలవుపై పంపించడమో సమస్యకు పరిష్కారం కాదన్నారు. ప్రభు రాజీనామాకు సిద్ధపడిన విషయాన్ని ప్రస్తావించగా, అది ఆమోదింప బడలేదుకదా అని ఎదురు ప్రశ్నించారు. రైల్వే భద్రతపై ప్రధాని దృష్టిసారించాలని, ఇందుకోసం నిధులు విడుదల చేయాలి. ఖాళీగా ఉన్న 1.42 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి. మోడీ ప్రభుత్వంలో ఇప్పటి వరకు 28 భారీ ప్రమాదాలు జరిగాయి. 259 మంది మరణించారు. 973 మంది గాయపడ్డారు. ఈ దశాబ్దంలోకెల్లా 2016-17లోనే ఎక్కువ ప్రమాదాలు జరిగాయి. 1219 రైల్వే లైన్లలో 40శాతం లైన్లు 100 శాతం సామర్థ్యానికి లోపలే ఉన్నాయని సూర్జేవాలా చెప్పారు. కాగా, ప్రభు రాజీనామా చేయాల్సిందేనని మరో సీనియర్ కాంగ్రెస్ నేత మనీశ్ తివారి డిమాండ్ చేశారు. బుల్లెట్ రైలు కోసం లక్ష కోట్లు ఖర్చు చేస్తున్న మోడీ, రైల్వేల భద్రత కోసం 40 వేల కోట్లు కేటాయించకపోవడం దురదృష్టకరమని అన్నారు.

రైల్వేలో రెండు లక్షల ఉద్యోగాలు

న్యూఢిల్లీ: రైలు ప్రమాదాలు, రైల్వే భద్రతపై పెరుగుతున్న ఆందోళన నేపథ్యంలో రైల్వేలో భారీగా ఉద్యోగాల కల్పనపై రైల్వే మంత్రిత్వ శాఖ దృష్టిపెట్టింది. రానున్న సంవత్సరాల్లో సంవత్సరాల్లో భారీ ఎత్తున ఉద్యోగులను నియమించుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. భద్రతా సంబంధిత ఉద్యోగాలు16 శాతం ఖాళీగా ఉండటంతో రైల్వే ట్రాక్‌ల నియంత్రణ, పెట్రోలింగ్ కష్టంగా మారడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాబోయే రోజులలో భద్రత మరియు నిర్వహణ విభాగంలో భారీగా పోస్టులను భర్తీ చేయనుందని రైల్వే సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైల్వేశాఖ రూ.15వేల కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. 2016 డిసెంబర్ నాటికి రైల్వే ఉద్యోగుల సంఖ్య 1.3 మిలియన్లుగా ఉండగా, గ్రూప్ 'సి', గ్రూప్ 'డి' విభాగాల్లో 2,25,823 ఖాళీలున్నాయి. గత మూడేళ్లలో ప్రతి సంవత్సరం సగటున 115 రైలు ప్రమాదాలుచోటు చేసుకోగా సుమారు 650 మంది మరణించారు. ప్రమాదాల్లో ఎక్కువభాగం రైల్వే క్రాసింగ్‌ల వద్దే జరుగుతున్నాయి.

యూపీలో మరో
రైలు ప్రమాదం

●పట్టాలు తప్పిన కైఫియత్ ఎక్స్‌ప్రెస్ ●బుధవారం తెల్లవారు జామున ఘటన ●74 మందికి గాయాలు ●నలుగురి పరిస్థితి విషమం



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో మరో రైలు ప్రమాదం జరిగింది. గత శనివారం ముజఫర్‌నగర్ ఖతౌలి వద్ద ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ విషాదాన్ని మరవకముందే బుధవారం మరొక ప్రమాదం చోటుచేసుకుంది. తెల్లవారుజామున 2.50 గంటల ప్రాంతంలో కైఫియత్ ఎక్స్‌ప్రెస్ ఆరియా వద్ద పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 10 బోగీలు పట్టాల నుంచి పక్కకు వొరిగాయి. 74 మందికి పైగా గాయాలయినట్లు తెలుస్తోంది. ఆజంగఢ్ నుంచి ఢిల్లీ వెళ్తుండగా పాట్నా-అచ్చల్ద స్టేషన్ల మధ్య ప్రమాదం జరిగింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఉత్తర మధ్య రైల్వే అధికార ప్రతినిధి తెలిపారు.

డంపర్‌కు ట్రైన్ ఢీకొనడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే డీజీ పీఆర్వో అనిల్ స్పష్టంచేశారు. క్షతగాత్రులను దగ్గర్లోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై రైల్వే మంత్రి సురేశ్ ప్రభు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సహాయక చర్యలు చేపట్టింది. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

గుజరాత్, తమిళనాడులోనూ..

బుధవారం మొత్తంగా మూడు రైలు ప్రమాదాలు జరిగాయి. ఉత్తరప్రదేశ్‌లోని కైఫియత్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ఘటనతోపాటు గుజరాత్, తమిళనాడులలోనూ మరో రెండు ప్రమాదాలు జరిగాయి. అయితే ఇక్కడ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. గుజరాత్‌లోని దంగ్ ప్రాంతంలో బిలిమొరా-వాఘయ్ న్యారో గేజ్‌లైన్‌లో ప్రయాణిస్తున్న రైలు పట్టాలు తప్పింది. వేరొక ఘటన తమిళనాడులో జరిగింది. సేలం నుంచి విరుదాచలం వెళ్తున్న లోకల్ రైలు ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టింది.

ఉత్కళ్ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభం

గత శనివారం జరిగిన ఉత్కళ్ రైలు ప్రమాదంపై రైల్వే పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. 13 బోగీలు పట్టాలు తప్పిన ఈ ఘటనలో 22 మంది మరణిం చగా156 మంది గాయపడిన విషయం తెలిసిందే. దర్యాప్తు అధికారి జీఆర్‌పీ డిప్యూటీ సూపరింటెండెంట్ రణధీర్ సింగ్ మంగళవారం స్థానికులను విచారించారు. ప్రమాద సమయంలో పరిణామాలపై అడిగి తెలుసుకున్నారు. విధినిర్వహణలో ఉన్న ఖతులి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌తోపాటు 12 మంది గ్యాంగ్‌మెన్‌లకు భద్రత కమిషనర్ సమన్లు జారీచేశారు.


సురేష్ ప్రభు హయాంలో జరిగిన భారీ రైలు ప్రమాదాలు

* 2015 ఫిబ్రవరి 13: బెంగళూరు నగర శివార్లలో జరిగిన రైలు ప్రమాదంలో 10 మంది మరణించారు. మరో 150 మంది గాయపడ్డారు. బెంగళూరు-అనెకల్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. డీ9, డీ8 బోగీలు ప్రమాదానికి గురయ్యాయి.
* 2015 మార్చి 20: డెహ్రాడూన్-వారణాసి జనతా ఎక్స్‌ప్రెస్ రాయ్‌బరేలి వద్ద పట్టాలు తప్పింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదంలో 58 మంది మరణించగా, 150 మంది గాయపడ్డారు. బ్రేక్ ఫెయిల్ కావడమే ఈ ప్రమాదానికి కారణమని దర్యాప్తులో తేలింది.
* 2015 మే 25: రూర్కెలా జమ్ముతావి మూరి ఎక్స్‌ప్రెస్ రైలు ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో పట్టాలు తప్పింది. 8 బోగీలు పక్కకు జరిగిన ఈ ఘటనలో ఐదుగురు మరణించగా, 50 మంది గాయపడ్డారు.
* 2015 ఆగస్టు 4: మధ్యప్రదేశ్‌లో రెండు రైళ్లు ప్రమాదానికి గురయ్యాయి. కామయాని, జనతా ఎక్స్‌ప్రెస్‌లు పట్టాలు తప్పిన దుర్ఘటనలో 31 మంది మరణించగా, 100 మంది గాయపడ్డారు. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు మచక్ నదిలో కొట్టుకుపోయారు.
* 2015 సెప్టెంబర్: సికిందరాబాద్-ముంబై లోకమాన్య తిలక్ దురంతో ఎక్స్‌ప్రెస్ కర్నాటక సమీపంలోని కల్బుగివద్ద పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు మరణించగా, ఏడుగురు గాయపడ్డారు.
* 2015 సెప్టెంబర్ 12: కల్కా నుంచి సిమ్లా వెళ్తున్న శివాలిక్ క్వీన్ చార్టెడ్ రైలు పట్టాలు తప్పింది. 36 మంది బ్రిటీషు పర్యాటకులు ప్రయాణిస్తున్న ఈ రైలు ప్రమాదంలో ఇద్దరు మరణించగా, 15 మంది గాయపడ్డారు.
* 2016 నవంబర్ 20: ఇండోర్-పాట్నా ఎక్స్‌ప్రెస్ ప్రమాదం. కాన్పూర్‌కు సమీపంలోని పుఖ్రయాన్ వద్ద రైలు నుంచి బోగీలు పక్కకు వొరి గాయి. ఈ ఘటనలో 150 మంది మరణించగా, 150మంది గాయపడ్డారు.
* 2017 జనవరి 22: జగ్దల్‌పూర్-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలో జరిగిన ఈ ప్రమాదంలో 41 మంది ప్రయాణికులు మరణించారు.
* 2017 ఆగస్టు 19: ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్ వద్ద ప్రమాదానికి గురైంది. ఢిల్లీ నుంచి షహనాపూర్ వెళ్తుండగా పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో 34 మంది మరణించగా, 150 మంది గాయపడ్డారు.
* 2017 ఆగస్టు 23: తెల్లవారుజామున 2.50 గంటల ప్రాంతంలో కైఫియత్ ఎక్స్‌ప్రెస్ ఆరియా వద్ద పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 10 బోగీలు పట్టాల నుంచి పక్కకు వొరిగాయి. 74 మందికి పైగా గాయాలయ్యాయి. ఆజంగఢ్ నుంచి ఢిల్లీ వెళ్తుండగా పాట్నా-అచ్చల్ద స్టేషన్ల మధ్య ప్రమాదం జరిగింది.


రైల్వే బోర్డు చైర్మన్‌గా అశ్వని లోహాని

న్యూఢిల్లీ: రైల్వేబోర్డు నూతన చైర్మెన్‌గా అశ్వని లోహాని నియమితులయ్యారు. ఎయిర్ ఇండియా సీఎండీగా ఉన్న అశ్వని లోహని అదనంగా రైల్వే బోర్డు చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. నాలుగు రోజుల వ్యవధిలో రెండు రైల్వే ప్రమాదాలు జరగడంపై నైతిక బాధ్యత వహిస్తూ ఏకే మిట్టల్ తన పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో లోహనికి బాధ్యతలు అప్పగించారు. లోహని ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఐఆర్‌ఎస్ఎంఈ) కేడర్‌కు చెందిన అధికారి. ప్రస్తుతం ఆయన ఎయిరిండియకు చైర్మన్ అండ్ ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోనే అతిపురాతన స్టీమ్ లోకోమోటివ్ రైలు ఫెయిరీ క్వీన్ ఎక్స్‌ప్రెస్‌ను సక్సెస్‌ఫుల్‌గా నడపడం ద్వారా గిన్నిస్ రికార్డు కూడా అందుకున్నారు. ఒకే ఇన్‌స్టిట్యూట్ నుంచి నాలుగు ఇంజనీరింగ్ డిగ్రీలు పొందినందుకు గాను 2007లో ఆయన లిమ్కా రికార్డులకు ఎక్కారు. మెకానికల్ ఇంజనీరింగ్‌తోపాటు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటలార్జికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిగ్రీలు కలిగివున్నారు. రెండు పుస్తకాలను కూడా రాశారు. స్టీమ్ ఇంజిన్‌తోపాటు మేనేజ్‌మెంట్ అంశాలపై ఆయన పుస్తకాలు రాశారు. కాన్పూర్‌లో ప్రాథమిక విద్య పూర్తయిన తర్వాత, జమల్‌పూర్‌లోని ఐఆర్‌ఎస్‌ఎంఈ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. లోహని కెరీర్ విశిష్టమైనది. ఢిల్లీ డివిజన్‌లో ఆయన డీఆర్‌ఎంగా చేశారు. అదేవిధంగా జాతీయ రైల్వే మ్యూజియంకు డైరెక్టర్‌గాను, భారతీయ టూరిజం మంత్రిత్వశాఖ డైరెక్టర్‌గాను, మధ్యప్రదేశ్ టూరిజం మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఇండియా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీగా కీలక పదవులు నిర్వహించారు. ఇటీవల యూపీలో రైల్వే ప్రమాదాలు ఎక్కువయ్యాయి. దీంతో రైల్వే శాఖ ముగ్గురు ఉన్నత అధికారులను సెలవుపై పంపించింది. మరో నలుగురు లోకల్ లెవల్ అధికారులను సస్పెండ్ చేసింది. ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ఘటనలో రైల్వేశాఖ అధికారులపై చర్యలు తీసుకున్నది.

మిట్టల్ రాజీనామా: వరుస రైలు ప్రమాదాల నేపథ్యంలో రైల్వే బోర్డు చైర్మన్ ఏకే మిట్టల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు రైల్వే శాఖ మంత్రి సురేశ్ ప్రభుకు రాజీనామా లేఖ సమర్పించారు.



తంబిల కుర్చీలాట



●పళనిని దించేందుకు చిన్నమ్మ ఎత్తులు ●జైలు నుంచే చక్రం తిప్పుతున్న శశికళ ●బల పరీక్షకు ప్రతిపక్షాల డిమాండ్ ●గవర్నర్‌కు ఫిర్యాదులు ●దమ్ముంటే కూల్చడంటూ పన్నీర్ సవాల్

చెన్నై : తమిళనాట రాజకీయాలు రక్తికడుతున్నాయి. అన్నాడీఎంకేలోని రెండు వర్గాలు ఒక్కటైన తర్వాత మూడోవర్గం రేపిన కార్చిచ్చు.. దావానంలా విస్తరిస్తోంది. అమ్మకు వీరవిధేయులైన పన్నీర్, పళనిలు ఏకం కావడాన్ని జీర్ణించుకోలేని చిన్నమ్మ శశికళ జైలు నుంచి రాజకీయాలను నెరుపుతున్నారు. పన్నీర్,పళని కలయికను సహించలేకపోతున్న చిన్నమ్మ వర్గం నేత టీటీవీ దినకరన్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కంకణం కట్టుకున్నారు. ఇక అన్నాడీఎంకే పార్టీకి చెందిన 19 ఎమ్మెల్యేలను దినకరన్ గవ్నరర్ ముందు కూర్చోబెట్టి గంటలు గడవక మందే... ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలువ్యూహాలకు పదునుపెంచాయి. ప్రభుత్వం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకోవాలని కాంగ్రెస్, డీఎంకే రాజ్‌భవన్ వైపు అడుగులువేశాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే రామస్వామి22 మంది ఎమ్మెల్యేల మద్దతుతో గవర్నర్ విద్యాసాగర్ రావుకు లేఖ రాశారు. ముఖ్యమంత్రి పళనిస్వామిపై తమకు నమ్మకం లేదని...వెంటనే బలపరీక్షకు ఆదేశించాలని రామస్వామి లేఖలో పేర్కొన్నారు.

కర్నాటకలో యడ్యూరప్ప ప్రభుత్వాన్ని బలపరీక్ష నిరూపించుకోవాలని ఆ రాష్ట్ర గవర్నర్ ఎలా ఆదేశించారో అదేవిధంగా తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే బలపరీక్షకు దిగకుండా గవర్నర్ తో చర్చల పేరుతో కాలయాపన చేస్తే అది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను ఉల్లంఘించినట్లే అవుతుందని రామస్వామి ఆరోపించారు. కాలయాపన జరిగితే గతంలో మాదిరిగా అసెంబ్లీలో హార్స్ ట్రేడింగ్ జరిగినా ఆశ్చర్యం పోవాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్యానించారు. ఎస్ఆర్ బొమ్మై కేసులోసుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా గవర్నర్ వెంటనే తమిళనాడు ప్రభుత్వాన్ని బలపరీక్షకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

దమ్ముంటే కూల్చు... పన్నీర్ సవాల్

అన్నాడీఎంకేలోని రెండు వర్గాలు విలీనమైన వేళ కొంతమంది ఎమ్మెల్యేలతో తిరుగుబావుటా ఎగరవేసిన దినకరన్‌కు తమిళనాడు డిప్యూటీ సీఎం పన్నీర్ సెల్వం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రిసార్ట్ రాజకీయాలకు తెరలేపిన దినకరన్‌కు దమ్ముంటే తమ ప్రభుత్వాన్ని కూల్చాలని సవాల్ విసిరారు. తమ ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఎవరికీ లేదని పన్నీర్ వ్యాఖ్యానించారు. అరియలూర్‌లో జరిగిన ఎంజీఆర్ జయంత్యుత్సవానికి సీఎం పళని స్వామి కూడా హాజరైన సమయంలో పన్నీర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

శశికళకు ఎదురుదెబ్బ

అన్నాడీఎంకే నాయకురాలు శశి కళకు సుప్రీం కోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగి లింది. జైలు నుంచి బయటపడాలన్న ఆమె ఆశలపై సర్వోన్నత న్యాయ స్థానం నీళ్లు జల్లింది. అక్రమాస్తుల కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న శశికళ.. తన శిక్షను రద్దు చేయాలన్నఅభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితురాలైన జయలలిత మరణించినందున తన అభ్యర్థనను మన్నించి జైలు శిక్ష రద్దు చేయాలని కోరినా... న్యాయస్థానం పట్టించుకోలేదు.



జియో ఫోన్ బుకింగ్ నేటి నుంచే

ముంబై : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రిలయన్స్ జియో ఫీచర్‌ఫోన్ బుకింగ్ ఆగస్టు 24 సాయంత్రం ఐదు గంటల నుంచి మొదలవుతుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే ఫోన్ ఉచితంగా లభిస్తుంది. దీనికి కొనుగోలు చేయాలంటే రూ.1,500 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది తర్వాత ఈ మొత్తం రీఫండ్ లభిస్తుంది. అటు నుంచి నెలకు రూ.153 చెల్లించాల్సి ఉంటుంది. జియో ఎవరు ముందు బుక్ చేసుకుంటే వారికే ముందు అనే పద్దతిలో ఫోన్లు విడుదల చేస్తుంది. ఈ ఫోన్‌లను ఆన్‌లైన్ ద్వారా లేదా ఆఫ్ లైన్ చానల్స్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ చానెల్ అంటే జియోకు చెందిన రిటైలర్స్, మల్టీ బ్రాండ్ డివైజ్ రిటైలర్లు, రిలయన్స్ డిజిటల్ స్టోర్ నెట్‌వర్కులలో కూడా బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఆన్‌లైన్ చానల్ విషయానికి వస్తే మై జియో యాప్‌తో పాటు కంపెనీ వెబ్‌సైట్ జియోడాట్‌కామ్ ద్వారా ముందస్తు ఫోన్ బుక్ చేసుకోవచ్చు.

ముందుస్తు బుకింగ్ చేయాలనుకునే వారు రూ.500 చెల్లించి బుక్ చేసుకోవచ్చు. తర్వాత ఈ మొత్తాన్ని సర్దుబాటు చేస్తారు. మిగిలిన రూ.1,000 ఫోన్ డెలివరీ చేసినప్పుడు చెల్లించాల్సి ఉంటుంది. జియోఫోన్ యూజర్ ఈ జియోఫోన్‌ను 36నెలల పాటు వినియోగించాల్సి ఉంటుంది. అటు తర్వాత రూ.1,500 రీఫండ్ చేయబడుతుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది.





హెరిటేజ్ ఫుడ్స్ రజతోత్సవాల ముగింపు

- ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు
- చెన్నై, ఢిల్లీలో సంబరాలు

హైదరాబాద్ : హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో రజతోత్సవాలు జరుపుకుంది. ఈ సందర్భంగా కంపెనీ భాగస్వాములను ఆహ్వానించింది. కంపెనీ వ్యవస్థాపకులు నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన విలువ ప్రకారం రైతుల ప్రయోజనాలను కాపాడుకుంటూ గత పాతిక సంవత్సరాల నుంచి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. ఇదిలా ఉండగా కంపెనీ రజతోత్సవాలను ఈ ఏడాది ఏప్రిల్ నుంచి హైదరాబాద్‌లో మొదలుపెట్టి అటు తర్వాత చెన్నై, ముంబైలలో కూడా సంబరాలు నిర్వహించింది. ఇటీవల కాలంలో కంపెనీని రీబ్రాండ్‌గా మార్చడం జరిగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే కంపెనీ ప్రొడక్టుల ప్యాకేజీతో పాటు రజతోత్సవాలను ప్రారంభించింది. ఇదిలా ఉండగా కంపెనీ 2022 నాటికి 6000 కోట్ల రెవెన్యూ లక్ష్యంగా నిర్దేశించింది.రజతోత్సవంలో భాగంగా ఈ ఏడాది ప్రారంభంలో ఫ్లేవర్డ్ మిల్క్ పీపీ బాటిల్స్‌ను ఆవిష్కరించింది. ఢిల్లీలో జరిగిన రజతోత్సవ సంబరాల్లో రిలయన్స్ డైరీని టేకోవర్ చేసుకుంది. అదే సమయంలో ఉత్తరాది మార్కెట్లో ప్రవేశించింది. గత ఐదు నెలల నుంచి కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణితో పాటు కంపెనీ సీనియర్ మేనేజ్‌మెంట్ బృందం దేశంలో విస్తృతంగా పర్యటించారు. ప్లాంట్లను, చిల్లింగ్ సెంటర్లను, మార్కెట్లను సందర్శించారు. రిలయన్స్ డైరీటేకోవర్‌లో జాతీయ స్థాయిలో పాగా వేసినట్లవుతుందన్నారు.అలాగే పశ్చిమ మార్కెట్లో ఎంట్రీ ఇచ్చినట్లవుతుందని కంపెనీ ఒక ప్రకటనలో వివరించింది.

ఇన్ఫీ చైర్మన్‌గా నీలేకనీ?

- ప్రమోటర్లు, ఇన్వెస్టర్లదీ అదే మాట
- నీలేకనీ రాకతో కంపెనీ గాడినపడేనా!

న్యూఢిల్లీ : ఇన్ఫోసిస్‌లో చోటు చేసుకున్న సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి కంపెనీ కొత్త సీఈవో అన్వేషణలో పడింది. విశాల్‌సిక్కా సీఈవో నుంచి తప్పుకున్న తర్వాత ప్రస్తుతం ప్రవీణ్‌రావు సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

తాజాగా బుధవారం నాడు మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నందన్ నీలేకనిని కంపెనీ బోర్డులోకి తీసుకురావాలని మాజీ వ్యవస్థాపకుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. దీనికి పలువురు నిపుణులు, కంపెనీల సలహాదారులు కూడా ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో కంపెనీని గాడిలో పెట్టాలంటే నీలేకనే సరైన అభ్యర్థిని అని చెబుతున్నారు.

కంపెనీ వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణమూర్తికి, కంపెనీ సీఈవో విశాల్‌సిక్కాకు మధ్య తీవ్రస్థాయిలో ఏర్పడిన విభేదాల కారణంగా సిక్కా గత శుక్రవారంనాడు రాజీనామా చేశారు. అటు తర్వాత నుంచి దేశీయ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ ముక్తకంఠంలో నందన్ నీలేకనీకి సీఈవోగా బాధ్యతలు అప్పగించాలని ఒత్తిడి పెంచాయి. వీరంతా కలిసి బోర్డుకు లేఖ రాస్తూ నీలేకనీకి బాధ్యతలు అప్పగించాలని కోరారు. కంపెనీలో పెట్టుబడులు పెట్టిన వారంతా నీలేకనే సరైన అభ్యర్థిని అని చెబుతున్నారు.

గత వారం విశాల్‌సిక్కా రాజీనామాతో బోర్డుకు, వ్యవస్థాపకులుకు , వాటాదారులకు మధ్య మాటల యుద్దంతో కంపెనీ ఇమేజీ డ్యామేజీ జరిగింది. దీని ప్రభావం కంపెనీ భవిష్యత్తుపై ఉంటుంది. కాగా సిక్కా రాజీనామాకు వ్యవస్థాపకుడు ఎన్ ఆర్ నారాయణమూర్తి కారణమని బోర్డు ఆరోపిస్తోంది. మూర్తి తరచూ సిక్కాపై బహిరంగ విమర్శలు చేస్తుంటే భరించలేక రాజీనామా చేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో మంచి సీఈవోను అన్వేషించడం కాస్తా ఇబ్బందికరమే. అంతర్గత సమస్యలతో పాటు పలు వ్యాపార సవాళ్లను కొత్త సీఈవో ధైర్యంగా ఎదుర్కొనే గుండె ధైర్యం కలిగిన వ్యక్తి లభించడం కష్టమే. దీంతో పాటు వ్యవస్థాపకులు కొత్త సీఈవోను స్వేచ్ఛగా పనిచేసుకొనిస్తారా అనేది అనుమానమే. ఎందుకంటే వ్యవస్థాపకులు ప్రతిదానికి మీడియాకు ఎక్కుతుండటం యాజమాన్యానికి పెద్ద తలనొప్పిగా మారింది. ఈ ఇబ్బందులన్నీ కొత్త సీఈవో ఎలా తట్టుకుంటారో అనుమానమే.

అయితే దీనికి ఒక్కటే పరిష్కార మార్గం నందన్ నీలేకనీ బోర్డులో చేరితే.. పరిస్థితులు అన్నీ సర్దుకుంటాయని మార్కెట్ నిపుణులతో పాటు అతి పెద్ద ఇన్వెస్టర్లు చెబుతున్నారు. నీలేకని బోర్డులో చేరితే మూర్తి కూడా చల్లబడతారని అంటున్నారు. కొత్తగా ఎవరూ పగ్గాలు చేపట్టినా మూర్తి మాత్రం మీడియాకెక్కి వారిపై అసంతృప్తి వెళ్లగక్కుతారని, కేవలం నీలేకనీ ఒక్కరే మూర్తిని అదుపు చేయగలరని చెబుతున్నారు. అదీ కాకుండా నీలేకనీ మాటను మూర్తి వింటారని.. బోర్డులో నీలేకని చేరితే మూర్తి సంతోషిస్తారని లేకపోయినా.. బోర్డుకు వ్యతిరేకంగా మీడియాకు మాత్రం ఎక్కరని వారు ఘంటాపథంగా చెబుతున్నారు.

వివిధ రంగాల్లో అనుభవం : ఇక నందన్ నీలేకని విషయానికి వస్తే ఆయన వివిధ రంగాల్లో పనిచేసిన అనుభవం ఉంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పెద్దనోట్ల రద్దు తర్వాత నగదు రహిత లావాదేవీలకు ప్రభుత్వానికి సలహాదారునిగా పనిచేయాలని కోరారు. వాస్తవానికి నీలేకనీ కాంగ్రెస్ టిక్కెట్‌పై బెంగళూరులో లోకసభ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న విషయం తెలిసిందే. అలాంటిది నందన్ నీలేకని రెండు పార్టీలను మెప్పించారు. కాబట్టి బోర్డులో నీలేకని చేరితే ఇటు బోర్డును.. అటు వ్యవస్థాపకులకు మధ్య వారధిగా ఉంటారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


అలాగే నీలేకని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఆధార్)ను తీసుకొచ్చిన ఘనత ఆయనదే.. దీనిపై వచ్చిన రాజకీయ వివాదాలన్నిటి ఆయన తెలిగ్గా పరిష్కరించారు. ప్రస్తుతం ఇన్ఫోసిస్‌లో కొనసాగుతున్న సంక్షోభం దీని కంటే పెద్దదేమీ కాదని అంటున్నారు. దేశంలో అతి పెద్ద ప్రాజెక్టు ఆధార్ అమలు చేసిన నీలేకని సీఈవోగా బాధ్యతలు చేపట్టి కంపెనీ రూపు రేఖలు మారుస్తారని, వ్యవస్థాపకుల్లో ఆయన ఒకరు కాబట్టి వ్యవస్థాపకులకు సర్ది చెప్పగలరని భావిస్తున్నారు. వచ్చిన చిక్కల్లా ఇన్ఫీ వ్యవస్థాపకులు బయటి వ్యక్తిని తేలిగ్గా నమ్మరు. కొత్తసీఈవో సమూలమైన మార్పులు తేవాలనుకుంటే బోర్డు అనుమతిస్తే.. వ్యవస్థాపకులు మాత్రం వ్యతిరేకిస్తుంటారు. ఇలాంటి సమయంలో నీలేకని అయితే కంపెనీ వ్యవస్థాపకుల్లో ఒకరు, కంపెనీ వ్యాపారాలు, కంపెనీలో పనిచేసే ఉద్యోగుల మనస్తత్వం ఆయనకు బాగా తెలుసు. ఐటి రంగం ఎలా పనిచేస్తుంది.. తన పరిమితులు ఏంటో ఆయన అవగాహన ఉంటుంది.. ఇన్వెస్టర్లలో కూడా ఆయన అంటే విపరీతమైన నమ్మకం ఉంది కాబట్టి అందరూ నీలేకనే కావాలనుకుంటున్నారు.



నీలేకనీ రాకతో పరిస్థితులు కుదటపడతాయి: బాలకృష్ణన్

గత శుక్రవారం నాడు ఇన్ఫోసిస్ సీఈవో విశాల్‌సిక్కా ఆకస్మిక రాజీనామాతో తర్వాత బుధవారం వరకు ప్రింట్ మీడియాతో పాటు అటు ఎలక్ట్రానిక్ మీడియాలో ఇవే ప్రధాన శీర్షికగా నిలిచాయి. ఇన్ఫోసిస్‌లో బోర్డు ఒక వైపు... కంపెనీ వ్యవస్థాపకులు చెరో జట్టుగా చీలిపోయారు. బోర్డు సిక్కాకు అనుకూలంగా ఉంటే.. వ్యవస్థాపకులు మాత్రం నారాయణమూర్తికి వెన్నుదున్నగా నిలిచారు. మాజీ సీఎఫ్ఓ, వి బాలకృష్ణన్, మోహన్‌దాస్ పాయ్‌లు కూడా బోర్డుతో పాటు సిక్కాపై ధ్వజమెత్తినవారే. మీ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి వ్యవస్థాపకులపై లేనిపోని నిందలు మోపుతున్నారని బోర్డును విమర్శించారు. అయితే వ్యవస్థాపకులు మాత్రం నీలేకనీని స్వల్పకాలానికైనా తీసుకొచ్చి కంపెనీని సంక్షోభం నుంచి గట్టెక్కించాలని చూస్తున్నారు. మొత్తానికి బాలకృష్ణన్ చెప్పేదేమిటంటే నీలేకనీకి బాధ్యతలు అప్పగిస్తే సమస్యలన్నీ సమసిపోతాయంటున్నారు.

నారాయణమూర్తి ఇన్వెస్టర్ల సమావేశం రద్దు: ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణమూర్తి కంపెనీలో అతి పెద్ద ఇన్వెస్టర్లతో బుధవారం నాడు సమావేశం కావాల్సింది. అయితే ఈ సమావేశం వచ్చే వారానికి వాయిదా పడిందని విశ్వసనీయవర్గాల సమాచారం. వాస్తవానికి గ్లోబల్ ఇన్వెస్టర్లతో నారాయణమూర్తి సమావేశం బుధవారం నాడు ఖరారు చేశారు. చివరి నిమిషంలో రద్దైందని చెబుతున్నారు. మూర్తికి స్వల్ప అస్వస్థ కారణంగా సమావేశాన్ని ఈ నెల 29కి వాయిదా వేశారని చెబుతున్నారు. ఈ కాన్ఫరెన్స్ కాల్‌ను ఇన్వెస్టెక్ ఇండియా అనే బ్రోకరేజి సంస్థ నిర్వహించింది. అతి పెద్ద గ్లోబల్ ఇన్వెస్టర్లు ఈ కాన్ఫరెన్స్ కాల్స్‌కు హాజరవ్వాలనుకున్నారు. మూర్తి చెప్పే అంశాల కోసం వారు ఎదురు చూశారు. కాగా ఇన్ఫోసిస్ బోర్డు కార్పొరేట్ గవర్నెన్స్ అమలు చేయడంతో విఫలం అయ్యిందని విమర్శించారు. సిక్కా రాజీనామా తర్వాత మూర్తి మొట్టమొదటిసారి ఇన్వెస్టర్లతో సమావేశం కావాల్సి ఉంది. అదీ కాస్తా వాయిదా పడింది.



త్వరలో మార్కెట్లోకి రూ.200 నోటు

- రూ.200 నోటు ముద్రణకు ఆర్థికమంత్రిత్వ శాఖ ఓకే: ఆర్‌బీఐ

న్యూఢిల్లీ : తక్కువ డినామినేషన్ నోట్లపై ఒత్తిడి తగ్గించేందుకు ఎట్టకేలకు కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొత్తగా రూ.200 నోట్ల ముద్రణకు ఆర్థికమంత్రిత్వశాఖ రిజర్వుబ్యాంకుకు అనుమతి ఇచ్చింది. ఆర్థికమంత్రిత్వశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో రిజర్వుబ్యాంకు బోర్డు సిఫారసుల మేరకు కేంద్రప్రభుత్వం రూ.200 నోట్లు ముద్రించడానికి అనుమతించినట్లు తెలిపింది. కొత్త రూ.200నోట్లు త్వరలోనే చలామణిలోకి రానుంది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం కొత్త రూ.200 నోటు విడుదల వల్ల దేశంలోని కరెన్సీ చలామణి మరింత మెరుగుపడుతుందని తెలిపింది. ఇదిలా ఉండగా కేంద్రప్రభుత్వం నవంబర్ 9వ తేదీన కొత్తగా రూ.2,000 రూ.500 నోట్లకు అదనపు సెక్యూరిటీ ఫీచర్లతో విడుదల చేసింది. రూ.2,000 నోటుకు చిల్లర దొరక్క ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. త్వరలోనే రూ.200 నోటును విడుదల చేస్తే ప్రజలకు కొంత ఉపశమనం కలిగే అవకాశాలున్నాయి.

దీంతో పాటు ఆర్‌బీఐ కొత్త రూ.50 నోట్లను విడుదల చేసింది. గతేడాది నవంబర్ 8 అర్ధరాత్రి నుంచి ప్రధానమంత్రి నల్లధనం, నకిలీ కరెన్సీనోట్లను అడ్డుకట్ట వేసేందుకు రూ.500, రూ.1,000 కరెన్సీనోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో చలామణిలో ఉన్న 86 శాతం కరెన్సీని రద్దు చేయడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. రూ.2,000 నోటు రద్దు ఆలోచన లేదు: జైట్లీ : ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ బుధవారం నాడు మాట్లాడుతూ ప్రభుత్వానికి రూ.2,000 నోటు రద్దు చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు.

అయితే రూ.200 నోటును ఎప్పుడు విడుదల చేయాలో రిజర్వుబ్యాంకు నిర్ణయిస్తుందని తెలిపారు. నోట్ల ముద్రణ ఎప్పుడు చేపట్టాలి. ఎప్పుడు చలామణిలోకి తేవాలనే తేదీని ఆర్‌బీఐకి సంబంధించిన విషయమని జైట్లీ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

బ్యాంకుల విలీనాలు వేగవంతం

- కేబినెట్ ఆమోదం
- మంత్రుల ప్యానెల్ ఏర్పాటు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల విలీనాన్ని వేగవంతం చేయడానికి కేంద్రకేబినెట్ మంత్రుల ప్యానెల్ ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. వృద్ధి రేటు పెంచుకోవడంతో పాటు రుణాల డిమాండ్‌ను పునరుద్ధరించడానికి పీఎస్‌యు బ్యాంకులను విలీనానికి ప్రభుత్వం నాంది పలికింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్యానెల్ సభ్యుల పేర్లను వెల్లడిస్తారు. ఈ ప్యానెల్ బ్యాంకుల బోర్డు విలీనాల ప్రతిపాదలను పరిశీలిస్తుందని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ బుధవారం కేబినెట్ సమావేశం తర్వాత మీడియాతో చెప్పారు. కాగా ప్రభుత్వ రంగానికి చెందిన 21 బ్యాంకుల్లో మెజారిటి వాటా ప్రభుత్వానిదే. అయితే ఈ ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల్లో సుమారు 150 బిలియన్ డాలర్లు అంటే సుమారు లక్ష కోట్ల రూపాయల వరకు మొండిబకాయిలతో సతమతమవుతున్నాయి. గ్లోబల్ బ్యాంకింగ్ నిబంధనలు బాసిల్-3 మూలధనం నిబంధనలు అమలు చేయాలంటే వచ్చే రెండేళ్లలో బ్యాంకులకు కోట్లాది రూపాయల మూలధనం కావాల్సి ఉంటుంది. అందుకే ముందు చూపుతో



ప్రభుత్వం పీఎస్‌యు బ్యాంకుల విలీనానికి శ్రీకారం చుట్టింది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలకు పెద్దపీట వేస్తోంది. ముఖ్యంగా రుణాల డిమాండ్‌ను తిరిగి గాడిలో పెట్టాలని చూస్తోంది. కాగా ప్రస్తుతం బ్యాంకులు భారీ మొత్తంలో మొండిబకాయిలతో సతమతమవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఐదు అనుబంధ బ్యాంకులీ విలీనం చేసుకుంది. త్వరలోనే బ్యాంకుల్లో మరిన్ని సంస్కరణలకు శ్రీకారం చుడతామని, తమ ఉద్దేశం బలమైన బ్యాంకులను సృష్టించడమేనని వాణిజ్య ప్రాతిపదికనే విలీనాల నిర్ణయాలు తీసుకున్నామని జైట్లీ పేర్కొన్నారు. బ్యాంకుల విలీనాల ప్రతిపాదనలపై తదుపరి నిర్ణయం తీసుకోవాల్సింది ఆయా బ్యాంకు బోర్డులేనన్నారు. బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయాలంటే విలీనాలు తప్పనిసరి అని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ కూడా పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయాన్ని విశ్లేషకులు, ఇన్వెస్టర్లకు స్వాగతించారు. అయితే బ్యాంకు యూనియన్ మాత్రం విలీనాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమ ఉద్యోగాలు పోతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మంగళవారం నాడు దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు ఒక రోజు సమ్మె చేశారు. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మొత్తం 21 ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల్లో తొమ్మిది బ్యాంకులు నష్టాలను చవిచూశాయి. అంతక ముందు ఆర్థిక సంవత్సరం మొత్తం 13 బ్యాంకులు నష్టపోయాయి. మార్చి చివరి నాటికి పీఎస్‌యు బ్యాంకుల్లో మొండి బకాయిలు 12.5 శాతానికి పెరిగిపోయాయని రిజర్వుబ్యాంకు గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ఐఆర్ఐఎస్ ప్రారంభించిన ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్స్యూరెన్స్

హైదరాబాద్ : ఇండియా ఫస్ట్‌లైఫ్ ఇన్స్యూరెన్స్‌ను బ్యాంకు ఆఫ్ బరోడా, ఆంధ్రాబ్యాంకు, లీగల్ అండ్ జనరల్ బుధవారం నాడు ఐఆర్ఐఎస్ (ఇండియా ఫస్ట్ రెస్పాండ్స్)ను ఆవిష్కరించింది. ఐఆర్ఐఎస్ విషయానికి వస్తే పలు రకాల సేవలను అందిస్తుంది. ముఖ్యంగా ప్రాడక్టు వివరణ, ప్రీమియం స్టేట్‌మెంట్స్; నోటీసులు, ఫండ్ విలువ, ఎంక్వైరీలు, కస్టమర్ అప్లికేషన్ స్టాటస్ తదితరాలుంటాయి. దీంతో స్వయం సేవలు (సెల్ఫ్ సర్వీసెస్) బలోపేతం అవుతాయని, కంపెనీకి చెందిన ఫీల్డ్‌సేల్స్ మరియు కస్టమర్లకు సమాచారం కోసం కాంటాక్ట్‌సెంటర్లపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కస్టమర్లకు 24 గంటల పాటు వారికి కావాల్సిన సమాచారం అందుబాటులో ఉంటుందని ఆర్ ఎం విశాఖ ఎండీ, సీఈవో ఇండియా ఫస్ట్‌లైఫ్ ఇన్స్యూరెన్స్ చెప్పారు.

రఘురాం రాజన్ పుస్తకం సెప్టెంబర్ 4న విడుదల

- ఆర్‌బీఐ గవర్నర్‌గా ఎదర్కొన్న ఒడిదుడుకుల ప్రస్తావన

న్యూఢిల్లీ : మాజీ రిజర్వుబ్యాంకు గవర్నర్ డాక్టర్ రఘురాం రాజన్ ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేసిన కాలంలో ఎదుర్కొన్న పలు అనుభవాలను ఈ పుస్తకంలో ముద్రించబోతున్నారు. పుస్తకంలో ఆర్థిక వ్యవస్థ, సహనం, రాజకీయ స్వాతంత్ర్యం తదితర అంశాల గురించి ప్రస్తావించనున్నారు. ఆర్‌బీఐ చీఫ్‌గా ఉన్నప్పుడు ఆయన రాసిన వ్యాసాలు, ప్రసంగాలు పుస్తకంలో పొందుపర్చారు. ఇదిలా



ఉండగా రాజన్ సెప్టెంబర్ 2013లో డాలర్ మారకంతో రూపాయి పాతాళానికి, ద్రవ్యోల్బణం అత్యంత గరిష్ఠానికి చేరినప్పుడు బాధ్యతలు చేపట్టారు. రాజన్ బాధ్యతలు స్వీకరించినప్పుడు కరెంటు ఖాతాలోటు విపరీతంగా పెరిగిపోయింది. విదేశీ మారకద్రవ్యం నిల్వలు మంచులా కరిగిపోయాయి. మార్కెట్లను స్థిరపర్చాలనుకొని విఫలమయ్యారు. స్పెక్యూలేటర్లు బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని తేల్చేశాయి. అటు తర్వాత రాజన్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు భారత ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేశాయి. ఇన్వెస్టర్లలో విశ్వాసం పెరిగింది. దేశంలోకి పెద్దెత్తున విదేశీ పెట్టుబడులు వచ్చాయి. భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు పటిష్టంగా ఉన్నాయని ఆయన ప్రపంచానికి సందేశం ఇచ్చారని పుస్తకాన్ని ముద్రిస్తున్న హార్పర్ కాలిన్స్ ఇండియాపేర్కొంది. సెప్టెంబర్ 4వ తేదీన బుక్‌స్టోర్‌లలో లభ్యం కానున్న పుస్తకంలో రాజన్ తరచూ తన ప్రసంగాల్లో తాను రఘురాం రాజన్‌ను.. తాను ఏదనుకుంటానో అదే చేస్తాను అనే వారు.

అయితే రాజన్‌కు ఇదే మొదట పుస్తకం కాదు. గతంలో కూడా సహ రచయితగా 'సేవింగ్స్ క్యాపిటలిజం ఫ్రం ది క్యాపిటలిస్టు' అనే పుస్తకాన్ని లుయిగి జింగాల్సేతో కలిసి రచించారు. దీంతో పాటు ఫాల్ట్‌లైన్స్ :హౌ హిడన్ ఫ్రాక్చర్స్ స్టిల్ థ్రెటన్ ది వరల్డ్ ఎకనీమి' అనే పుస్తకాన్ని రాశారు. దీనికి ఫైనాన్షియల్ టైమ్స్ - గోల్డ్‌మన్ సాచెస్ అత్యుత్తమ బిజినెస్‌బుక్ అని అవార్డు కూడా అందజేసింది.

డీఎస్‌పీ బ్లాక్‌రాక్ టోటల్ రిటర్న్స్ ఇండెక్స్

హైదరాబాద్ : డిఎస్‌పీ బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్.. దేశంలోని అత్యుత్తమ అసెట్ మేనేజ్‌మెంట్‌కంపెనీ బుధవారం నాడు ఈక్విటీ, మ్యూచువల్ ఫండ్స్‌లో తమ పెట్టుబడులపై ఎంత రాబడి వచ్చింది టోటల్ రిటర్న్ ఇండెక్స్ (టీఆర్ఐ) బెంచ్‌మార్కును విడుదల చేసింది. కాల్పన్ పారిఖ్ ప్రెసిడెంట్ బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్ మాట్లాడుతూ .. టీఆర్ఐ బెంచ్‌మార్కును విడుదల చేయడం ద్వారా ఇన్వెస్టర్లకు కంపెనీ నిర్వహణపై పూర్తి అవగాహన కలుగుతుందని అన్నారు. ప్రస్తుతం పెద్దమొత్తంలో కంపెనీలోకి పెట్టుబడులు వస్తున్నాయని తమ ఇన్వెస్టర్లకు వాస్తవాలను వివరించేందుకు టీఆర్ఐ ఇండెక్స్‌ను విడుదల చేస్తామని కంపెనీ పూర్తిస్థాయిలో పారదర్శకత పాటిస్తుందని అన్నారు. అనుపమ మహేశ్వరి ఈవీపీ మాట్లాడుతూ.. ఇన్వెస్టర్‌కు వారి పెట్టుబడిపై ఎంత రాబడి వస్తుందో అధ్యయనం చేసుకోవడానికి వీలవుతుందన్నారు.

వీఎఫ్‌ఎస్ గ్లోబల్ చేతికి వీసా సర్వీస్ ప్రొవైడర్ టీటీ సర్వీసెస్

హైదరాబాద్ : అంతర్జాతీయంగా ఉనికిని చాటుతూ పూర్తి స్థాయిలో సేవలందిస్తున్న ఇంటిగ్రేటెడ్ వీసా ప్రాసెసింగ్ సొల్యూషన్స్ సంస్థ టీటీ సర్వీసెస్‌కు 35 దేశాలకు పైగా దేశాల్లో 216 మంది సిబ్బందితో 51 అప్లికేషన్ సెంటర్‌లను నిర్వహిస్తోంది. టీటీ సర్వీసెస్ ప్రధాన కార్యాలయం బ్రిటన్ ఉంది.



అత్యంత నాణ్యత కలిగిన పూర్తి స్థాయి వీసా సెంటరల్‌ను టీటీఎస్ నిర్వహిస్తోంది. జుబిన్ కర్కారియా సీఈవో, వీఎఫ్‌ఎస్ గ్లోబల్ గ్రూపు మాట్లాడూతూ.. వీఎఫ్‌ఎస్ గ్లోబల్ లాగాతనే తమ క్లయింట్లకు నమ్మకమైన సర్వీస్ డెలివరీ పార్టనర్‌గా గత 15 సంవత్సరాలకు పైగా అందిస్తున్న విస్తృతస్థాయి అనుభవం టీటీ సర్వీసెస్‌కు ఉందని,, వీఎఫ్‌ఎస్ గ్లోబల్‌తో టీటీఎస్ చేతులు కలుపడం వల్ల మరింతగా మా సేవలను విస్తరిస్తామని అన్నారు.

కొనుగోళ్లతో కళకళ

ముంబై : ఇటీవల స్టాక్ మార్కెట్లు వరుసగా తిరోగమనబాట పట్టడంతో షేర్ల ధరలు బాగా పడిపోయాయి. బ్లూచిప్ షేర్లు ఆకర్షణీయమైన ధరలకు అందుబాటులో రావడంతో మదుపరులు పెద్దెత్తున కొనుగోలు చేయడంతో స్టాక్ మార్కెట్లు జోరందుకున్నాయి. దీనికి తోడు గ్లోబల్ మార్కెట్లు కూడా స్థిరంగా ట్రేడ్ కావడంతో దేశీయ మార్కెట్లకు బాగా కలిసొచ్చింది. ఇటీవల కాలంలో వరకు ఇన్ఫోసిస్ షేరు భారీగా పతనం కావడంతో పాటు తిరిగి వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నీలేకనీ తిరిగి కంపెనీ పగ్గాలు చేపట్టనున్నారన్న వార్తలు రావడంతో ఇన్ఫోసిస్ షేరు తిరిగి పుంజుకుంది. దీంతో పాటు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగానికి చెందిన షేర్లు దూసుకుపోయాయి. బీఎస్ఈ 276.16 పాయింట్లు లాభపడి 31,568.01 వద్ద నిఫ్టీ 86.95 పాయింట్లు పెరిగి 9,852.5 వద్ద ముగిసాయి. వరుసగా బీఎస్ఈ, ఎన్ఎస్ఈ 2 రోజుల పాలు లాభాలను నమోదు చేశాయి. బీఎస్ఈలో కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంజీసీ రంగానికి చెందిన షేర్లు తప్పించి మిగిలిన షేర్లు లాభాలతో ముగిశాయి. అత్యధికంగా రియల్టీ సూచి 3.48 శాతం, మెటల్ 1.81 శాతం, బ్యాంకింగ్ 1.39 శాతం, పీఎస్‌యు 1.2 శాతం లాభపడ్డాయి. దీనికి వ్యతిరేకంగా కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.75 శాతం, ఎఫ్ఎంసీజీ సూచి 0.04 శాతం నష్టపోయాయి.

బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు పుంజుకోవడానికి ప్రధాన కారణం కేంద్రప్రభుత్వం ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల విలీనానికి ఆమోదం తెలపడం. అదే సమయంలో రియల్టీ రంగానికి చెందిన డీఎల్ఎఫ్ 8 శాతం పెరిగింది. ఆడిట్ కమిటీ కంపల్సరీ కన్వర్టబుల్ ప్రీపెరెన్షియల్ షేర్లను సింగపూర్ సావరిన్ వెల్త్ ఫండ్ జీఐసీకి విక్రయించే ప్రతిపాదనపై సమీక్ష జరపడమే కారణం.

బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేర్లు ఇలా ఉన్నాయి. అదానీ పోర్ట్స్ 2.79 శాతం, భారతి ఎయిర్‌టెల్ 2.41 శాతం, టాటాస్టీల్ 2.28 శాతం, డాక్టర్ రెడ్డీస్ 2.25 శాతం, ఇన్ఫోసిస్ 1.98 శాతం కాగా దీనికి వ్యతిరేకంగా నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. హెచ్‌యూఎల్ 1.05 శాతం, సన్‌ఫార్మా 0.45 శాతం, ఐటీసీ 0.28 శాతం, పవర్‌గ్రిడ్ 0.21 శాతం, ఎంఅండ్ఎం 0.13 శాతం వరకు ఉన్నాయి.

ఇన్ఫోసిస్‌లో నందన్ నీలేకని తిరిగి చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్నట్లు వార్తలు రావడంతో ఇన్ఫీ షేరు ఏకంగా 1.98 శాతం పెరిగి రూ.894.50 వద్ద ముగిసింది. మదుపరులు పెద్దెత్తున షేర్ల కొనుగోలు చేశారు. మంగళవారం నాడు రూ.60.59 కోట్ల షేర్లు బ్లాక్ డీల్‌లో కొనుగోలు చేయడం జరిగింది. దీంతో ఫోర్టిస్ హెల్త్‌కేర్ లిమిటెడ్ 7.3 శాతం లాభపడింది. దీంతో పాటు గోల్డ్‌మన్ సాచెస్ కొనుగోలు చేయవచ్చునని సిఫారసు చేసింది.

ఇమామ్‌లకు 'గౌరవం'

● రూ.24 కోట్లతో ప్రతినెల వేతనాలు
● రూ.5 కోట్లతో మసీదుల మరమ్మతులు ● 2,800 మందికి ఉచిత హజ్ యాత్ర
● మత విశ్వాసాలకు పెద్దపీట వేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో 7.32 శాతంగా ఉన్నటువంటి ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రాష్ట్రప్రభుత్వం అనేక అభివృద్ధి పథకాలను అమలు చేస్తోంది. నవ్యాంధ్ర తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తరువాత సమాజంలో వెనుకబడి ఉన్న ముస్లింల జీవితాల్లో నూతన వెలుగులు నింపేందుకు, వారిని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. మత విశ్వాసాలకు కట్టుబడి, జీవితాన్ని పూర్తిగా మసీదు సేవలకే అంకితం చేసే ఇమామ్, మౌజన్‌లు ముస్లిం సాంప్రదాయాలను పెంపొందించడంలో, మసీదుల నిర్వహణలో కీలకపాత్ర పోషించడం జరుగుతోంది. ఖురాన్ మీద పూర్తి పట్టును కలిగి అల్లా బోధనలను నిత్యం మసీదులకు వచ్చే ముస్లిం భక్తులకు వివరించే గురుతర బాధ్యత ఇమామ్‌దే. ప్రతి రోజు మసీదులో ఉదయం 5.00, మధ్యాహ్నం 1.30, సాయంత్రం 5.15, 6.30, రాత్రి 8.30 గంటలకు నమాజ్‌ను ఇమామ్ చదవడం జరుగుతుంది. అలాగే మసీదుకు వచ్చే భక్తుల చేత అజాన్‌ను భక్తి, శ్రద్ధలతో పఠనం చేయించే బాధ్యత కూడా ఇమామ్‌దే. అలాగే మౌజన్ విషయానికి వస్తే మసీదులోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, మసీదు ఆవరణలో ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా చూస్తారు. వీరికి మసీదుకు వచ్చే వారు ఇచ్చే కానుకల్లో నెలవారీ భత్యం, జీతం ఇవ్వడం ఆనవాయితీ. కానీ ఆదాయంలేని మసీదుల్లో వాటినే నమ్ముకొని పనిచేస్తున్న ఇమామ్, మౌజన్‌ల ఆర్థికలేమితో దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారనే విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ముస్లిం మతపెద్దలు, మైనారిటీ నేతలు తీసుకెళ్లడంతో వారికి ఆర్థిక చేయూతను అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన హామీ ఇవ్వడం జరిగింది. దీనితో 2016-17 ఆర్థికసంవత్సరంలో రూ.24 కోట్లను ప్రత్యేకంగా కేటాయించి, మసీదుల్లో పనిచేసే ఇమాంలకు నెలకు రూ.5 వేలు, మౌజన్‌లకు నెలకు రూ.3 వేలను గౌరవ వేతనంగా అందించడం జరుగుతోంది.

రూ.5 కోట్లతో మసీదుల మరమ్మత్తులు..

భారత దేశంలో ఎక్కడా లేని విధంగా ఆదాయంలేని మసీదులను ఆదుకోవడానికి శ్రీకారం చుట్టిన చంద్రబాబు ప్రభుత్వం తొలి విడతగా మసీదుల మరమ్మత్తుల 2017-18 ఏడాదికి గాను కోసం రూ.5 కోట్లను కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 13 జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన అనంతరం ఆదాయంలేని మసీదులను గుర్తించి, వాటిల్లో పనిచేస్తున్న ఇమామ్, మౌజమ్‌లకు ఆర్థిక సహాయాన్ని అందించడంతోపాటు మసీదుల నిర్వహణకు తోడ్పాటును అందించడం జరుగుతోంది. ఈ విధంగా అనంతపురంలో 723, కర్నూలులో 600, కడపలో 449, చిత్తూరులో 391, నెల్లూరులో 412, ప్రకాశంలో 219, గుంటూరులో 590, కృష్ణాలో 316, పశ్చిమ గోదావరిలో 148, తూర్పు గోదావరిలో 185, విశాఖపట్నంలో 160, విజయన గరంలో 54, శ్రీకాకుళంలో 47 కలిపి మొత్తంగా 4,294 మసీదుల్లో పనిచేసే ఇమామ్, మౌజమ్‌లకు ప్రతి నెల గౌరవ వేతనాలను అందించడం జరుగుతోంది. అలాగే హిందూ వులకు కాశీ, క్రైస్తవులకు జరూసలేం వలనే ముస్లింలకు అత్యం త పవిత్రమైన దైవస్థలం మక్కా. ప్రతి ముస్లిం జీవితంలో ఒక్కసారైనా పవిత్ర స్థలమైన మక్కా, మదీనాను సందర్శిం చాలని కోరుకుంటారు. లక్షల రూపాయల వ్యయంతో కూడిన ఈ యాత్ర నిరుపేద ముస్లింలకు కలలాంటిదే. ఈ నేపథ్యంలో ముస్లింల మత విశ్వాసాలకు పెద్దపీట వేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం నిరుపేద ముస్లిం మతపరమైన జీవితాశయాన్ని కూడా నెరవేర్చేందుకు నిధులను సంవృద్ధిగా కేటాయిస్తూ ఈ ఏడాది 2,800 మందిని ఉచిత రవాణా, సౌకర్యాలను కల్పిస్తూ పవిత్రమైన హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి పంపడం జరుగుతోంది. రూ.840.25 కోట్ల ప్రత్యేక బడ్జెట్‌తో ముస్లింల సమగ్రాభివృద్ధికి కృషి చేయడంతోపాటు వారి మత విశ్వాసాలను కూడా గౌరవిస్తూ వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతున్న చంద్రబాబు ప్రభుత్వ పనితీరుపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ కొలువులు సాధించిన ఎంటెక్ విద్యార్థులు



జేఎన్‌టియూఎ, కె ఎన్ ఎన్: పట్టుదల.. ఆత్మవిశ్వాసం.. అకుంఠిత దీక్ష..ఉంటే సాధించలేనిదేదీ లేదని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం ఎంటెక్ సివిల్ ఇంజనీరంగ్ విద్యార్థులు 14 మంది ప్రభుత్వ కొలువులు సాధించి నిరూపించారు. ఇరిగేషన్ విభాగంలో 8, మున్సిపల్ ఎఇ 2, డిప్యూటీ సర్వేయర్ 3, హైడ్రాలజిస్టు రాష్ట్రస్థాయిలో టాపర్‌గా ఒకరు నిలిచారు. జేఎన్‌టియూఎ క్రమశిక్షణ, బోదనా ప్రమాణాలు, పరిశోదన, అధ్యాపకులు ఇచ్చిన సలహాలు, మార్గదర్శకాలు, నిరంతరం కృషి వల్ల ఉద్యోగాలు సాధించామని విద్యార్థులు పేర్కొన్నారు.


రైతు బిడ్డ రాష్ట్ర స్థాయిలో టాపర్..

హైడ్రాలజిస్టు రాష్ట్రస్థాయిలో టాపర్‌గా జీ. మహేశ్వరరెడ్డి నిలిచాడంతో పాటు ఇరిగేషన్ ఎఇగా, ఎన్విరాన్ మెంట్ కొలువులు సాధించాడు. మాది కడప జిల్లా తిప్పనపల్లి గ్రామం. మా నాన్న చంద్రశేఖర్ రెడ్డి, అమ్మ శివమ్మలు వ్యవసాయం చేసుకునే వారు. అమ్మా నాన్న కలలను సాకారం చేసేందుకు నిరంతరం కష్టపడి రోజుకు పది గంటలు సమయాన్ని వెచ్చించి ఉద్యోగాన్ని సాధించాను. ప్రజలకు సేవ చేయాలన్న దృక్పథంతో సమాజాభివృద్ధిలో తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు.. దేశాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో భారీ అగ్ని ప్రమాదం

ఉక్కునగరం (విశాఖపట్నం), కెఎన్ఎన్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఎస్ఎంఎస్-2 భారీ అగ్ని ప్రమాదం బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. లాడీ హుక్కు విరగడంతో 150 టన్నుల ఉక్కు ద్రవం నేలపాలయింది. ఘటన సమయంలో కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. సుమారు కోట్లలో నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. హుటాహుటిన సంఘటన స్థలానికి రెస్క్యూ అధికారులు చేరుకొని మరింత నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

ఆర్ఎంపీలను పారామెడికల్ సిబ్బందిగా పరిగణించాలి



అమరావతి, ఆంధ్రప్రభ : ఆర్ఎంపీ, పీఎంపీలను పారామెడికల్ సిబ్బందిగానే పరిగణించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్ రావు స్పష్టం చేశారు. బుధవారం విజయవాడలోని ఐఎంఏ రాష్ట్రప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్య సేవలను బలోపేతం దిశగా ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రత్యేక శిక్షణలను ఇవ్వడం స్వాగతించే విషయమన్నారు. కానీ దీనికోసం తాజాగా జారీ చేసిన జీఓ నెంబర్ 465 చాలా లోపభూయిష్టంగా ఉందన్నారు. నాలుగు సంవత్సరాలు వైద్య విద్యను అభ్యసించి, ఒక సంవత్సరం హౌస్ సర్జన్ చేసిన వారు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించే క్వాలిఫైడ్ పరీక్షల్లో పాసైన తరువాతనే ప్రజా వైద్య సేవలను అందించాలని చట్టాలు చెబుతున్నాయని చెప్పారు. ప్రథమ చికిత్సలు మాత్రమే చేయగలిగే అర్హతలు గల ఆర్ఎంపీ, పీఎంపీలకు కేవలం 9 నెలలు శిక్షణను ఇచ్చి నేరుగా వారిని ప్రజావైద్య సేవలకు వినియోగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆర్ఎంపీల వైద్య సేవలపై సుప్రీం కోర్టు, హైకోర్టులు సైతం ఆందోళన చేసిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రత్యేకశిక్షణలు పొంది క్వాలిఫైడ్ అయిన ఎఎన్ఎం, ఆశా వర్కులకు ఇలాంటి తరహాశిక్షణలను ఇవ్వడం, వారికి గ్రామాల్లో వసతి సౌకర్యానికి ఏర్పాటు చేయడం వలన గ్రామీణ వైద్య సేవలకు సమర్థవంతంగా వినియోగించుకోవచ్చన్నారు.

పొగాకు పంట విస్తీర్ణంపై బోర్డు సమావేశం

● 136 మిలియన్ కేజీల పంట ఉత్పత్తికి అనుమతి ● గతేడాదితో పోలిస్తే అదనంగా ఆరు మిలియన్ కేజీల ఉత్పత్తి



అమరావతి, ఆంధ్రప్రభ : ఈ ఏడాది పొగాకు పంట విస్తీర్ణంపై బోర్డు సమావేశమై పంట ఉత్పత్తికి సంబంధించి నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన టుబాకో బోర్డు సమావేశంలో ఈ ఏడాది 136 మిలియన్ కేజీల ఉత్పత్తికి బోర్డు అమోదం తెలిపింది. గతేడాది 130 మిలియన్ కేజీలు ఉత్పత్తికి అనుమతులివ్వగా, ఈ ఏడాది అదనంగా మరో 6 మిలియన్ కేజీల ఉత్పత్తికి నిర్ణయించింది. పొగాకు పంటను ప్రధానంగా కర్నాటక, ఆంధ్రా రాష్ట్రాల్లో రైతులు పండిస్తారు. రాష్ట్రంలో ప్రకాశం జిల్లా పొగాకు విస్తీర్ణంలో ముందుండగా, నెల్లూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు తర్వాత స్థానాల్లో ఉన్నాయి. తెలంగాణాలో పంట విస్తీర్ణం అతితక్కువగా ఉంది. ఈ సంవత్సరం బోర్డు అమోదం తెలిపిన 136 మిలియన్ కిలోల్లో ఎన్ఎల్ఎస్ రకం 46 మిలియన్ కిలోలు, ఎన్ఎల్ఎస్ 32 నుంచి 36, ఎస్ఎల్ఎస్ 45 నుంచి 46, ఎస్‌బీఎస్ 39 నుంచి 40 మిలియన్ కిలోల పంటకు అనుమతులిచ్చింది. ఈ సంవత్సరం ఎస్ఎల్ఎస్ రకంలో 4 వేలమిలియన్ కిలోలు, ఎన్‌బీఎస్ 2 వేల మిలియన్ కిలోలు అదనంగా పెరిగింది. కాగా పెరిగిన పంట విస్తీర్ణంలో ప్రకాశం, నెల్లూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల రైతులకు సమానంగా ఇవ్వాలని టుబాకో బోర్డు మాజీ వైస్‌చైర్మన్ సీతయ్య కోరడం జరిగింది. ఇప్పటికే కర్నాటకలో పంట చేతికి వచ్చి, సెప్టెంబర్ నుంచి మార్కెట్లో ఆక్షన్‌కు రానుంది. కాగా రాష్ట్రంలో అక్టోబర్ నుంచి నార్లు మొదలు కానున్నాయి. ఇదిలా ఉంటే గత మార్చిలో జరిగిన సమావేశంలో బోర్డు పొగాకు రకాలకు కొనుగోలు ధరను ప్రకటించడం జరిగింది. మార్కెట్లో నాణ్యమైన బ్రైట్ రకం పొగాకు కిలో రూ.142 నుంచి 130, మీడియం రకాలు 120 నుంచి 110, లోగ్రేడ్ రకాలు 60 నుంచి 50 మధ్య కొనుగోలు చేసే విధంగా ధరను నిర్ణయించారు. హైదరాబాద్‌లో జరిగిన 144వ బోర్డు సమావేశానికి చైర్మన్ టి.వెంకటేష్ అధ్యక్షత వహించగా, ఈడీలు గోకరాజు గంగరాజు, గల్లా జయదేవ్, బోర్డు సభ్యులు లాల్‌సిన్హ్ వడోడియా, ఎన్.రమేష్ డాక్టర్ డి.దామోదర్‌రెడ్డి, రైతు ప్రతినిధులు బాలినేని సీతయ్య, జి.సత్యనారాయణ, కిరణ్‌కుమార్, పీవీ బసవరాజప్ప, వాణిజ్య ప్రతినిధులు కృష్ణకుమార్ మిశ్రా, ఆక్షన్స్ డైరెక్టర్ బీబీ చౌదరి, కార్యదర్శి సీసీఎస్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ ప్రతినిధులతో సీఆర్‌డీఏ అధికారుల సమావేశం

అమరావతి, ఆంధ్రప్రభ : ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం ప్రతినిధి బృందం బుధవారం విజయవాడ ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయాన్ని సందర్శించి, ప్రత్యేక కమిషనర్ వి.రామమనోహరరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీ సీఆర్‌డీఏ చేపట్టే కార్యక్రమాలు, నూతన రాజధాని అమరావతి నిర్మాణ విశేషాలు, అమరావతిలో ఇజ్రాయెల్ కంపెనీల పెట్టుబడులకు గల అవకాశాలపై సమగ్రంగా చర్చించారు. ఇజ్రాయెల్ ఉన్నత విద్య, నూతన అవిష్కరణల మంత్రి డిట్జా ఫ్రోయం మాట్లాడుతూ అమరావతిని ఆర్థిక శక్తిగా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను మార్కెట్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగితెలుసుకున్నారు. ఏపీసీఆర్‌డీఏ ప్రత్యేక కమిషనర్ వి.రామమనోహరరావు మాట్లాడుతూ రాబోయే 35 సంవత్సరాల కాలానికి అమరావతిని 35 మిలియన్ డాలర్ల ఆర్జక శక్తిగా మార్పుచేసేదిశలో ఒక బృహత్తర ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. అమరావతి నగరంలో ఉన్న 29 గ్రామాల ప్రజలతో మొదలైన ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తన అధికార యంత్రాంగాన్ని వెలగపూడికి తరలించడం ద్వారా సుమారు 7వేల మంది ప్రభుత్వోద్యోగులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులతో సహా రాజధానిలో నివాసం ఏర్పరచుకునేలా చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఆకృతి తమ దేశ పార్లమెంట్ తరహాలో ఉందని బృందం నాయకుడు అద్వావిల్ చింక్షి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఇజ్రాయెల్ ప్రతినిధుల బృందంను శాలువాతో కమిషనర్ సత్కరించారు.

'రాష్ట్రంలో పెరిగిన మాఫియా'

● అధికారులు భాగస్వాములే ● అధికార పార్టీ నేతల అండ : బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి ఆరోపణ



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో అన్ని రకాల మాఫియాలను నిలువరించి అవినీతిని అరికట్టాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి సురేష్ రెడ్డి డిమాండ్ చేశారు. మట్కా జూదం, క్రికెట్ బెట్టింగ్, డ్రగ్స్, బెల్టు షాపులు, ఆహార పదార్థాల కల్తీ, ఇసుక మాఫియా వంటి కారణాలతో అవినీతి తాండవివస్తోందని ఆయన ఆరోపించారు. అనేక ఆశలతో ఏర్పడిన నవ్యాంధ్రప్రదేశ్ వివిధ రంగాల్లో అభివృద్ధి చెందడం అటుంచి మాఫియా కోరల్లో చిక్కుకుందన్నారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సురేష్ రెడ్డి మాట్లాడుతూ అనేక మాఫియా కార్యకలాపాల్లో అధికార యంత్రాంగంలోని అధికారులు ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. హైదరాబాద్‌లో సంచలనం కలిగించిన డ్రగ్ మాఫియా మూలాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నట్లు పోలీసు విచారణలో వెలుగు చూసిందని ఆయన తెలిపారు. అమాయకులైన విద్యార్థుల జీవితాలు నాశనం అయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యా సంస్థలపై నిఘాను పెంచడంతో పాటు నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నెల్లూరు కేంద్రంగా సాగిన క్రికెట్ బెట్టింగ్ మాఫియా వెనుక అధికారుల పాత్ర పోలీసు విచారణలో వెలుగు చూసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మట్కా జూద నిర్వాహకులకు అధికార పార్టీ నేతల అండదండలున్నాయని ఆయన ఆరోపించారు. నెల్లూరు జిల్లా గూడూరు డివిజన్‌లో ఇసుక అక్రమ రవాణాకు డీఎస్పీ పాల్పడటం దారుణమన్నారు. ఆహార పదార్థాల కల్తీ యధేచ్ఛగా సాగుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా జోక్యం చేసుకొని ఆయా అంశాలపై విచారణ జరపడం ద్వారా నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి పోరాటం చేయాలని ఆయన కోరారు. తాము చేసిన అభ్యర్థనపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ స్పందించి పొగాకు అధికోత్పత్తిపై రూ.20వేల జరిమానా రద్దు చేయడంతో పాటు క్రూడ్ ఆయిల్‌పై జీఎస్టీ పన్నును 7.5శాతం నుంచి 15 శాతానికి, రిఫైండ్ అయిల్‌పై ఉన్న 15శాతం నుంచి 25శాతానికి దిగుమతి సుంకాలు పెంచడం ద్వారా ఇక్కడి రైతాంగానికి గిట్టుబాటు ధర లభించేందుకు చర్యలు చేపట్టినట్లు బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పూడి తిరుపతిరావు తెలిపారు. అర్హులైన వారికి కార్మిక రాజ్య బీమా సదుపాయంతో పేద కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య రక్షణ కలిపించినట్లు ఇఎస్ఐ జాతీయ బోర్డు సభ్యులు సిహెచ్.రామకోటయ్య తెలిపారు. విలేకరుల సమావేశంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్రప్రధాన కార్యదర్శి తుమ్మల అంజిబాబు, బీజేపీ నాయకులు అడపా నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

రాజధానికి ఆరు వరుసల రహదారులు

● టెండర్లు ఆహ్వానించిన ఏడీసీ
● సెప్టెంబర్ 11వరకు గడుపు
● సంవత్సరంలోపు పూర్తి చేయాలన్న నిబంధన



అమరావతి, ఆంధ్రప్రభ: అమరావతిరాజధానికి అన్ని ప్రాంతాల వారు సులభంగా చేరుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది దీనికి అనుగుణంగానే రాష్ట్ర రహదారుల విస్తరణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీనిలో బాగంగానే రాజధాని అమరావతిలో ప్రధాన రహదారులన్నింటినీ ఆరు వరుస రహదారులతో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి రాజధాని అభివృద్ధి సంస్థ(ఏడీసీ) తాజాగా టెండర్లు కూడా పిలిచింది. ప్రధాన అనుసంధాన రహదారి (సీడ్ యాక్సిస్ రోడ్డు) మినహా మరో పది రహదారుల నిర్మాణానికి ఏడీసీ గతంలో టెండర్లు పిలిచింది. వీటిలో ఎన్9, ఈ8 రహదారులను ఆరు వరసలుగా నిర్మిస్తుండగా, మిగితా రహదారుల్ని నాలుగు వరసలుగా నిర్మించేందుకు అప్పట్లో టెండర్లు పిలిచారు. వీటిలో ఏడు రహదారులు పనులు ప్రారంభమయ్యాయి. ఈ6, ఈ12, ఎన్11 రహదారుల పనులు త్వరలో ప్రారంభించనున్నారు. ఈదశలో మిగితా 8రహదారుల్ని ఆరు వరసలుగా నిర్మించటంతోపాటు పది రహదారుల వెంబడి ప్రధాన మౌలికవసతుల కల్పనకు ఏడీసీ గత మంగళవారం టెండర్లు పిలిచింది. 10 రహదారులను మూడు ప్యాకేజీలుగా విభజించి మొత్తం పనుల విలువ రూ.1520.28 కోట్లు కాగా వీటిని ఈపీసీ విధానంలో పనులు చేపట్టనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రహదారుల వెంబడి చెట్లు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని, రహదారుల వెంట డ్రైనేజీ, వర్షపు నీరుపారుదల తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిలో బాగంగానే రహదారుల నిర్మాణంతోపాటు వర్షం నీటి పారుదల కాలువలు, తాగునీటి సరఫరా నెట్ వర్క్, మురుగునీటి పారుదల వ్యవస్థ, విద్యుత్ కమ్యునికేషన్ కేబుళ్లు వెళ్లడానికి డక్ట్ లు, పునర్వనియోగ నీటి సరఫరా పైప్ లైన్లు, నడకదారులు, సైకిల్ ట్రాక్‌లు, రహదారులకు ఇరువైపుల పూల మొక్కలు నాటడం, స్ట్రీట్ ఫర్నిచర్ ఏర్పాటు వంటి పనులన్నీ చేపట్టాల్సి ఉంటుంది. ఏడీసీ ఆహ్వానించిన టెండర్లలో బిడ్ దాఖలు చేయడానికి సెప్టెంబర్ 11వరకు గడువు ఉన్నప్పటికీ పనులు అప్పగించిన సంవత్సరంలోగా పూర్తిచేయాల్సి ఉంటుంది. టెండర్లో పెర్కొన్న విధంగా ఈ10, ఈ14, ఎన్6 రహదారుల్ని రూ.435.20 కోట్లతో మొదటి ప్యాకేజీగా , ఎన్4, ఎన్, ఎన్14 రహదారుల్ని రూ.570 కోట్లతో రెండో ప్యాకేజీగా, ఈ6, ఈ12, ఎన్11 రహదారుల్ని రూ.514.28 కోట్లుగా ఉంది.

కర్నూలు-గుంటూరు నాలుగు వరసల రహదారిగా విస్తరణ

అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ మార్గం కార్యరూపం దాల్చేలోపు అందుబాటులో ఉన్న జాతీయ రహదారులను విస్తరించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీనిలో బాగంగానే కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిని నాలుగు వరసలకు విస్తరించట ద్వారా ప్రయాణ సమయాన్ని తగ్గించనున్నారు. ఈదిశగా జాతీయ ప్రాధికార సంస్థ సర్వే ప్రారంభించింది. కర్నూల్ నుంచి దోర్నాల వరకూ ఉన్న జాతీయ రహదారి 340సి తొలి దశలో నాలుగు వరసలుగా విస్తరించినున్నారు. కర్నూల్ నుండి నందికొట్కూరు, ఆత్మకూరు మీదుగా దోర్నాల వరకు 150 కి.మీ మేర ప్రస్తుతం రెండు వరసల మార్గమే ఉంది. కుంట దగ్గర నుంచి ఎన్‌హెచ్ 544డిలో కలస్తుంది. ఇది వినుకొండ-నరసరావుపేట మీదుగా గుంటూరు చేరుతుంది. కుంట నుంచి గుంటూరుకు వెళ్లే రహదారి కూడా ప్రస్తుతం రెండువరసలే వుంది. ఈమార్గానంతటిని నాలుగు వరసలగా విస్తరించాలని నిర్ణయించారు.

టోల్ ఫ్రీ ఫిర్యాదులకు పరిష్కారం

● వేలిముద్రలు పడని 35వేల రేషన్ కార్డులు ● ఎందుకు అందడంలేదన్న అంశంపై ఆరా ● ప్రతీ కార్డుకి రేషన్ అందేలా చర్యలు

ప్రజలే ముందు
PEOPLE FIRST
1100

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో అర్హులైన ప్రతీ వ్యక్తికి రేషన్ అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీకి దాదాపు 35 వేల మందికి రేషన్ అందడంలేదన్న ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆయా రేషన్‌కార్డులకు ఎందుకు రేషన్ అందడంలేదన్న అంశంపై రాష్ట్ర పౌరసరఫరాలశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇప్పటి వరకూ వేలిముద్రలు, ఐరిష్ విధానంతోపాటు ఇంటికే వెళ్లి రేషన్ ఇస్తున్నారు. ఇటువంటి మూడు అంచెల విధానం ఉన్నా ఇంకా అర్హులైన వారికి ఎందుకు రేషన్ అందడంలేదన్న దానిపై అధికారులు క్షేత్రస్థాయిలో సమాచారం సేకరిస్తున్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ 1100తో సదరు కార్డుదారుల డేటాను అనుసంధానం చేసి ఎక్కడలోపం ఉందో డేటాను సేకరించే పనిలో నిగమ్నమయ్యారు. సదరు కార్డుదారుల ఆధార్, ఐరిష్, ఫోన్ నెంబర్లు, కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. దీని వల్లసదరు కార్డుదారుడికి ఫోన్ చేసి వారికి ఎందుకు రేషన్ అందడంలేదన్న దానిపై సమాచారం కోరతారు. కార్డుదారుడికి ఫోన్ నెంబర్ లేకుంటే రేషన్ డిపోడీలర్, విఆర్‌వోలను వారి ఇంటికి పంపి పూర్తి డేటా సేకరించేందుకు చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం కోటి 42లక్షలపైచిలుకు రేషన్‌కార్డులున్నాయి. వీరందరికీ ప్రభుత్వం ప్రతీ నెల రేషన్‌ను విడుదల చేస్తుంది. అయితే చాలా గ్రామాల్లో ముసలివాళ్లకు వేలిముద్రలు పడటంలేదన్న ఆరోపణలతో వారికి బియ్యం, ఇతర సరుకులు ఇవ్వడంలేదు. దీని వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటువంటి కేసులు రాష్ట్రవ్యాప్తంగా 35 వేల వరకూ ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో వెంటనే సివిల్ సప్లయిస్ అధికారులను అప్రమత్తం చేసింది. సదరుకార్డుదారులకు ఎట్టిపరిస్థితుల్లో రేషన్ అందించాలని ఆదేశించింది. దీంతో అధికారులు రంగంలోకి దిగి కార్డుదారుల వివరాలు, వారికి రేషన్ అందకపోవడానికి ఉన్న కారణాలను అన్వేషిస్తున్నారు. ఈ కార్డుదారులకు సంబంధించి పూర్తిడేటాను ప్రస్తుతం 1100కు అనుసంధానం చేసి వారికి రేషన్ అందే వరకూ ప్రతీనిత్యం కాల్స్ చేయించాలని ప్రభుత్వం చూస్తున్నట్లు తెలుస్తోంది. సమస్య పరిష్కారం అయ్యేవరకూ తహసిల్దార్లకు ఎప్పటికప్పుడు వారికి సమాచారం చేరవేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో రేషన్ అందనివారికి రేషన్ అందేవరకూ ప్రభుత్వం ఆరా తీయనుంది. ప్రతీ రేషన్‌కార్డుదారికి తప్పకుండా రేషన్ అందిస్తామని ఈ మధ్యనే పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రకటించారు.

35వేల కార్డుదారుల ఐరిష్, వేలిముద్రలు పడటంలేదు: పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ జి. రవిబాబు

రాష్ట్రంలో కోటి 42 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయని వాటికి సక్రమంగా రేషన్ అందుతున్న దాదాపు 35 వేల కార్డులకు వివిధ కారణాలతో రేషన్ ఇవ్వడంలేదని పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ జి. రవిబాబు తెలిపారు. ఆయన ఆంధ్రప్రభతో బుధవారం మాట్లాడుతూ బియ్యం అందని రేషన్‌కార్డుదారులకు సంబంధించి బయోమెట్రిక్, ఐరిష్‌పై ఆరా తీస్తున్నామన్నారు. వారికి రేషన్ ఎందుకు అందడంలేదన్నదానిపై విచారణ చేపడుతున్నామన్నారు. తహసిల్దార్లు పట్టించుకోవడంలేదా లేక వీఆర్‌ఓలు వారికి రేషన్ అందించే బాధ్యతను తీసుకోవడంలేదా అనేది పరిశీలిస్తున్నామన్నారు. దీంతోపాటు ప్రభుత్వ కాల్‌సెంటర్ 1100 ద్వారా ఆయా రేషన్‌కార్డుదారులకు సంబంధించి డేటాను అనుసంధానం చేసి వారికి ఎందుకు అందడంలేదన్న దానిపై మాట్లాడనున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరలో వీరికి రేషన్ అందిస్తామన్నారు.

విశాఖలో అక్రమ కట్టడాలపై ఏసీబీ తనిఖీలు

ఆందోళనలో ఇతర కార్పోరేషన్ల అధికారులు



అమరావతి, ఆంధ్రప్రభ: విశాఖపట్టణంలోని అక్రమ నిర్మాణాలపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఏ విధమైన అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్న రెండు వాణిజ్య సముదాయాలను ఏసీబీ అధికారులు పరిశీలించారు. గ్రేటర్ విశాఖ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులే ఇందుకు అనధికారికంగా అనుమతులు ఇచ్చినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఏసీబీ డీజీ ఆర్.పి.ఠాకూర్ పత్రికలకు విడుదల చేశారు. గాజువాక జోన్-5లో గ్రౌండ్ ప్లస్ నాలుగంతస్తులు భవనాన్ని పరిశీలించారు. పాత గాజువాకలో జీ ప్లస్ మూడం తస్తుల భవనం కూడా ఏ విధమైన అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్నట్లు గుర్తించారు. గ్రేటర్ విశాఖ జోన్-5 పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఏ విధమైన అను మతులు లేకుండా ఈ వాణిజ్య సముదాయాల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఏసీబీ తనిఖీల్లో వెలుగు చూసింది. తద్వారా ప్రభుత్వాదాయానికి భారీ స్థాయిలో గండిపడినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై ప్రభుత్వానికి సమగ్రమైన నివేదికను పంపనున్నట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. గత కొంతకాలంగా గ్రేటర్ విశాఖపట్టణం నగరపాలక సంస్థలో అక్రమ కట్టడాల జోరు పెరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు లంచాలకు ఆశపడి అడ్డగోలుగా నిబంధనలకు పాతర వేస్తున్నట్లు పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు సైతం ఇక్కడ అక్రమ నిర్మాణాలపై ఆందోళన చేస్తున్నా అధికారుల్లో మాత్రం చలనం లేదు. పైగా నిబంధనలను ఏమాత్రం ఖాతరు చేయకుండా మామూళ్లకే పెద్దపీట వేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారులు అక్కడ దృష్టిసారించారు. గత కొంతకాలంగా సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి అక్రమాలను వెలికితీస్తున్న ఏసీబీ అధికారులు..తాజాగా నగరపాలక సంస్థల కట్టడాలపై కన్నేయడం కలకలం రేపుతోంది. ఈ తనిఖీలు విశాఖ పట్టణానికే పరిమితం అవుతాయా? లేక ఇతర నగరపాలక సంస్థల్లో కూడా జరుతాయా? అనే చర్చ సాగుతోంది. ఇతర పట్టణాల్లో కూడా ఈ తరహా తనిఖీలకు ఏసీబీ అధికారులు దిగితే కొన్ని వందల అక్రమ కట్టడాల వ్యవహారాలు వెలుగులోకి వస్తాయనేది పలువురిలో నెలకొన్న అభిప్రాయం.

విద్యతోపాటే ఉపాధి, ఉద్యోగ శిక్షణ

- డిగ్రీలో ప్రయోగాత్మకంగా ఫౌండేషన్ కోర్సులు
- నైపుణ్యతను పెంచేందుకు ప్రయత్నం • మూడు దశల్లో కోర్సులు అమలు
- తొలి విడతగా 100 కాలేజీల్లో 30 వేల మందికి శిక్షణ

అమరావతి, ఆంధ్రప్రభ : విద్యతోపాటే ఉపాధి, ఉద్యోగాల్లో నైపుణ్యతను సాధించేలా వారికి డిగ్రీస్థాయిలో ఫౌండేషన్ కోర్సులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీని వల్ల సాధారణ కోర్సులతోపాటు వారికి ప్రత్యేకించి ఫౌండేషన్ కోర్సులను అందిస్తారు. దీని కోసం మానవవనరులశాఖ టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సర్వీస్(టిస్)తో చేతులు కలుపనుంది. మూడు విడతల్లో ఈ కోర్సులను విద్యార్థులకు అందిస్తారు. తొలి విడతలో 100 డిగ్రీ కాలేజీల్లో 30 వేల మందికి శిక్షణ అందిస్తారు. దీనికి సంబంధించి ఈ మధ్యనే ప్రభుత్వంతో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సర్వీస్(టిస్) ప్రతినిధులు మానవవనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుతో భేటి అయ్యి చర్చించారు. మూస ధోరణి విద్య వల్ల తర్వాత ఉన్నత సంస్థల్లో మన విద్యార్థులకు చక్కని అవకాశాలు లభించడంలేదు. దీని వల్ల వేల కోట్లను ఖర్చుచేసి విద్యను అందిస్తున్నా దాని ఫలితం కనిపించడంలేదన్న భావనలో ప్రభుత్వం ఉంది. ఈ క్రమంలోనే ఇంకా నాణ్యమైన విద్యను అందించాలని నిర్ణయించారు. దీని కోసం ఇటువంటి సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ప్రధానంగా డిగ్రీ తరువాత విద్యార్థులు ఉద్యోగాల్లో స్థిరపడే అవకాశం ఉంటుంది. అటువంటి తరగతులతోపాటే ఇటువంటి ఫౌండేషన్ కోర్సులను ప్రవేశపెట్టడం వల్ల వారిలో కసి పెరిగి ఏదైనా మంచి ఉద్యోగాలను సాధించుకునే అవకాశం ఉంది. విద్యార్థుల్లో జాతీయ, అంతర్జాతీయ సంస్థలలో ఏ విధంగా ఉద్యోగాలు పొందాలనే అంశాలతోపాటు సొంతంగా ఎదిగేందుకు ఉన్న అవకాశాలను కూడా ఈ కోర్సుల ద్వారా ప్రత్యేకంగా నేర్పుతారు. అయితే ఈ కోర్సుల అనంతరం కచ్చితంగా ఉద్యోగాలు వస్తాయన్న భరోసా లేకపోయినా దానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్న విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించారు. ఇటువంటి ప్రత్యేక మైన కేరీర్ శిక్షణ వల్ల ప్రభుత్వం అందిస్తున్న విద్యకు సార్థకత లభిస్తుందన్న ఆలోచన ఉన్నతాధికారుల్లో ఉంది. అయితే కొంతకాలంగా ఇటువంటి కోర్సులను డిగ్రీ స్థాయిలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. దీనికి సంబంధించి నిపుణులతో చర్చలు జరిపి, కమిటీలను వేసి వారి నివేదికల అనంతరమే ప్రభుత్వం ఇటువంటి ఆలోచనకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ప్రతీ ఏటా బిఏ, బికాం, బిఎస్సీ కోర్సు ద్వారా దాదాపు 80 వేల మందిని డిగ్రీ పూర్తి చేయించి బయటకు పంపుతోంది. వీరిలో ఎంతమందికి ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయన్నది ప్రశ్నార్థకంగా ఉంది. దీని వల్ల డిగ్రీ చదివే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం ఈ మధ్యకాలంలో డిగ్రీలో ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. ఇంజనీరింగ్ వంటి చదువులను కూడా విద్యార్థులు వదులుకుని సాధారణ డిగ్రీలు చదువుతున్నారు. దీంతో ప్రస్తుతం డిగ్రీకి ఆధరణ పెరిగింది. ఇటువంటి పరిస్థితుల్లో మరలా పాత పరిస్థితులు రాకుండా డిగ్రీలు చేస్తే కచ్చితంగా జీవితంలో స్థిరపడవచ్చుననే భరోసా కల్పించే కోర్సులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది.

ప్రత్యేక శిక్షణ, పరీక్షలు

ఫౌండేషన్ కోర్సులు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా వారికి శిక్షణతోపాటు పరీక్షలను కూడా నిర్వహిస్తారు. ఈ కోర్సుల్లో ప్రధానంగా ఇంగ్లీష్ కమ్యూనికేషన్, డిజిటల్ లిటరసీ, యూత్ లీడర్‌షిప్, పీపుల్ స్కిల్స్, ఫైనాన్షియల్ లిటరసీ, లీగల్ లిటరసీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇలా అనేక కోర్సులను అందిస్తారు. డిగ్రీతోపాటే వీటిని విద్యార్థి అభ్యసించగలిగితే వారికి ఉద్యోగ అవకాశాల పరిధి పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇంగ్లీషులో ఏలా మాట్లాడాలి, ఏ విధంగా రాయాలి, సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవడం, లీడర్‌షిప్‌ను పెంచుకోవడం ఏలా ఇటువంటి అంశాలను ప్రత్యేకంగా బోధిస్తారు. తొలి సంవత్సరంలో సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్, సాఫ్ట్ స్కిల్స్, రెండో సంవత్సరంలో సర్టిఫికెట్ ఇన్ డోమైన్, మూడో ఏడాది డిప్లొమా ఆన్ కాంప్లేషన్ సర్టిఫికెట్లు ఇస్తారు. 2019కి తొలి పేజ్ పూర్తి అవు తుంది.

తొలి విడతగా 100కాలేజీలు, ప్రతీ జోన్‌లో 25 కాలేజీల నుంచి దాదాపు 30 వేల మందికి అవకాశం కల్పిస్తారు. అయితే విద్యార్థులకు కోర్సులను అందించి బోధించే వరకే ఈ టిస్ పరిశీలిస్తుంది. ఇతర అంశాలను ఆయా డిగ్రీ కాలేజీలే పట్టించుకోవాల్సి ఉంటుం ది. దీని కోసం ప్రత్యేక సిబ్బందిని టిస్ అధికారులు ఆయా కాలేజీల్లో ఏర్పాటు చేస్తారు. వారికి ప్రభుత్వమే జీతాలు, ఇతర అలివెన్స్‌లు చెల్లించే విధంగా కార్యాచరణ తీసుకురానున్నట్లు తెలుస్తోంది. అయితే విద్యార్థుల జీవితాల్లో వెలుగులు వస్తాయంటే ప్రభుత్వం దేనికైనా సిద్ధంగా ఉందన్న అభిప్రాయాన్ని మానవవనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వ్యక్తం చేశారు.

ప్రకాశం పంతులు మనకు ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

టంగుటూరి ప్రకాశం పంతులు ఒకరని ముఖ్యమంత్రి చంద్రబాబు శ్లాఘించారు. తెలుగు ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించడమే కాకుండా బ్రిటిష్ వారి గుండెల్లో నిద్రపోయిన మహా వ్యక్తి ప్రకాశం పంతులని కొనియాడారు. ఆనాటి ఆయన ధైర్య సహసాలకు ప్రజలు మెచ్చి ఆంధ్రకేసరి బిరుదును ప్రధానం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఆయన రాష్ట్రాభివృద్ధికి చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఆనాడు ఆయన చూపిన చొరవ వల్లే జమిందారి వ్యవస్థను రూపుమాపడం జరిగిందని అన్నారు. అంతేకాకుండా పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కూడా ప్రకాశం పంతులుకే దక్కిందన్నారు. 60సంవత్సరాల పాటు హైదరాబాద్ రాజధానిగా తెలుగు ప్రజలంతా కలిసి ఉన్నామని, అయితే తదంతర పరిణామాల వల్ల రూ. 16వేల కోట్ల లోటు బడ్జెట్‌తో అమరావతికి తరలివచ్చామన్నారు. అయినప్పటికీ అధైర్య పడకుండా విద్యార్థులు, ప్రజల జీవితాన్ని మార్చేందుకు ప్రకాశం పంతులును స్ఫూర్తిగా తీసుకుని తాను ముందుకు సాగుతున్నానని ముఖ్యమంత్రి



చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విభజన జరిగిన నాటికి పారిశ్రామికరణ, పట్టణీకరణ, విద్యాసంస్థలు గానీ సరిగా లేవని, తాము అధికారం చేపట్టిన ఈ మూడేళ్ళలో వీటన్నింటిలో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. గోదావరి జనాలను కృష్ణా డెల్టాకు తీసుకువచ్చేందుకు పట్టిసీమ ఎత్తుపోతల పథకాన్ని ప్రారంభించామని, ఇది జరగని పక్షంలో కృష్ణాడెల్టా ఎడారిగా మారేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. త్వరలో గోదావరి, పెన్నా నదులను అనుసంధానం చేసి కరువును అధిగమిస్తామని అన్నారు. రాజధాని నిర్మాణానికి రైతులు 33వేల ఎకరాల భూమిని ఇచ్చి గొప్ప త్యాగం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. అమరావతిలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన విద్యాసంస్థలు ఏర్పాటు చేసి నాలెడ్జ్ హబ్‌గా రూపొందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. 2022కి ఆంధ్రప్రదేశ్ 3అగ్రరాష్ట్రాల్లో ఒకటిగా, 2029కి నెంబర్‌వన్‌గా నిలుస్తుందని , అంతేకాకుండా 2050 ప్రపంచంలోనే 5మేటి నగరాల్లో చోటు దక్కించుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులందరికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగాలు పొందేలా చేయూతను అందిస్తున్నామని తెలిపారు. ఆర్థిక అసమానతను తొలిగిపోయేలా చర్యలు చేపట్టినట్లు సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక శక్తివంతమైన రాష్ట్రంగా తిరుగులేని శక్తిగా నిలిపేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, బచ్చుల అర్జునుడు, విజయవాడ మేయర్ కోనేరు శ్రీధర్, కృష్ణాజిల్లా కలెక్టర్ బి. లక్ష్మీకాంతం ఇతర ఉన్నతాధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొన్నారు.

కేంద్రం పచ్చజెండా

(మొదటిపేజీ తరువాయి)

రూ.8 లక్షలకు మంత్రివర్గం పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు అరుణ్‌జైట్లీ ప్రకటించారు. రాజ్యాంగంలోని 340వ అధికరణం కింద కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన కేంద్ర కేబినెట్, కమిషన్‌కు ఛైర్‌పర్సన్‌ను నియమించిన నాటి నుంచి 12 వారాల లోపు నివేదిక అందజేయాల్సి ఉంటుందని పేర్కొంది. కమిషన్ ప్రధానంగా ఓబీసీ రిజర్వేషన్ ఫలాలను అందుకోవడంలో లేదా, అందించడంలో చోటుచేసుకుంటున్న అసమానతలపై అధ్యయనం చేయాల్సి ఉంటుంది. అనంతరం శాస్త్రీయంగా ఓబీసీల వర్గీకరణ జరిపేందుకు రూపొందించాల్సిన నియమాలు, ప్రమాణాలు, మార్గదర్శకాలను ఈ కమిషన్ రూపొందించనుంది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ ఓబీసీ జాబితాలో ఉన్న కులాలు, సముదాయాలు, ఉప కులాలను సబంధిత సబ్-కేటగిరీలో చేర్చడానికి అవసరమైన కసరత్తును కూడా ఈ కమిషన్ చేస్తుంది.

ఇందిరా సాహ్ని మరియు ఇతరులు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా పేర్కొంటూ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంపై 1992 నవంబర్ 16న ఇచ్చిన తీర్పును అనుసరించి కేంద్ర ప్రభుత్వం ఈ వర్గీకరణకు పూనుకుంది. ఆ తీర్పు ప్రకారం వెనుకబడి తరగతులను, వెనుకబడిన లేదా బాగా వెనుకబడిన తరగతులుగా విభజించడంలో ఒక రాష్ట్రానికి ఎటువంటి రాజ్యాంగపరమైన లేదా న్యాయపరమైన అడ్డంకి లేదని సుప్రీం తీర్పులో తేల్చి చెప్పింది. అలాగే ఏ రాష్ట్రమైనా ఓబీసీ కులాలను వర్గీకరించాలనుకుంటే, అదేమీ చట్టం దృష్టిలో అనుమతించకూడని వ్యవహారమేమీ కాదని స్పష్టం చేసింది. పాతికేళ్ల క్రితం నాటి ఈ తీర్పును ఆధారంగా చేసుకుని జాతీయస్థాయిలో ఓబీసీ కులాలను వర్గీకరించే సాహసోపేతమైన నిర్ణయానికి కేంద్రం ప్రభుత్వం సిద్ధపడింది.

అందరికీ సమానంగా రిజర్వేషన్ ఫలాలు

సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి, వివక్షకు గురైన కులాలను ఇతర కులాలతో సమానంగా ఎదిగే అవకాశం కల్పించడం కోసమే రిజర్వేషన్లు కల్పిస్తున్న విషయం తెలిసిందే.



అయితే ఈ రిజర్వేషన్ ఫలాలు వెనుకబడిన కులాల్లో అన్ని కులాలకూ సమానంగా అందడం లేదన్న విమర్శలున్నాయి. రిజర్వేషన్ ప్రయోజనాలపై గణాంకాలను పరిశీలిస్తే వందల సంఖ్యలో ఉన్న వెనుకబడిన తరగతుల్లో కేవలం కొన్ని కులాలు మాత్రమే రిజర్వేషన్ ఫలాలను పూర్తిగా అనుభవిస్తున్నాయని అర్థమవుతోంది. దీంతో మిగతా కులాలు వీరితో పోటీ పడలేక, రిజర్వేషన్ ఫలాలను అందుకోలేకపోతున్నాయి. ఈ అసమానతలను తొలగించడం కోసమే 'కోటా పరిధిలో కోటా' అన్న నినాదం మొదలైంది. తద్వారా ఓబీసీలకు కేటాయించిన కోటాకు లోబడి, కులాలను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా వర్గీకరించి, అందరికీ సమ న్యాయం జరిగేట్టు చూడాలన్న డిమాండ్ మొదలైంది. ఓబీసీ వర్గీకరణ విధానాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి, కర్ణాటక, హర్యాణా, జార?ండ్, పశ్చిమ బెంగాల్, బిహార్, మహారాష్ట్ర మరియు తమిళనాడు రాష్ట్రాలు ఇప్పటికే అమలు చేస్తున్నాయి. అయితే జాతీయస్థాయిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కేంద్ర విద్యాసంస్థల్లో అడ్మిషన్ల సమయంలో ఈ అసమానతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే రిజర్వేషన్ ఫలాలను అందరికీ సమానంగా పంచాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తాజాగా ఈ నిర?యం తీసుకుంది.

రాజకీయ సమీకరణాలు

కేంద్ర కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయం వెనుక రాజకీయ కారణాలు, సమీకరణాలు లేకపోలేదు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఓబీసీల్లో ఆయనపై ఎన్నో ఆశలు నెలకొన్నాయి. తమ సామాజిక వర్గానికి చెందిన నేత ప్రధాని అయ్యారు కాబట్టి, తమ సమస్యలను ఆయన పరిష్కరిస్తారన్న నమ్మకం వారిలో ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (జాతీయ బీసీ కమిషన్)కు రాజ్యాంగ బద్ధత కల్పించడం కోసం కేంద్రం బిల్లును తీసుకొచ్చింది. రాజ్యసభలో ప్రతిపక్షాల సవరణల కారణంగా బిల్లు అర్థాంతరంగా నిలిచిపోయినా, తాము ఓబీసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్న సంకేతాలను పంపడంలో బీజేపీ విజయం సాధించింది. పైగా రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుంటే, తాజాగా ఉత్తరప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అనేక ఓబీసీ వర్గాలు వెన్నుదన్నుగా నిలిచిన విషయం గమనార్హం. ఓబీసీల పార్టీలుగా ముద్రపడ్డ సమాజ్‌వాదీ, ఆర్జేడీ, ఆర్ఎల్డీ వంటి అనేక రాజకీయ పార్టీలు ఓబీసీల్లో ఏదో ఒక వర్గానికే పరిమితమయ్యాయి తప్ప అందరినీ ఆదరించలేకపోయాయి. దీన్ని గ్రహించిన బీజేపీ ఓబీసీల్లో నిర్లక్ష్యానికి గురైన వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకెళ్తోంది. రాజకీయ పదవుల నుంచి మొదలుపెట్టి ప్రభుత్వ సంక్షేమ, రిజర్వేషన్ ఫలాల వరకు అన్ని విషయాల్లోనూ నిర్లక్ష్యానికి గురైన ఓబీసీ కులాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పుడు వర్గీకరణ ఉద్దేశం కూడా ఇదేనని అర్థమవుతోంది. ఇన్నాళ్లూ రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తున్న కొన్ని కులాల్లో వర్గీకరణ నిర్ణయం ఆగ్రహం కల్గించినా, మిగతా కులాల నుంచి బీజేపీకి విశేషాదరణ లభిస్తుంది.

క్రీమిలేయర్ రూ.8 లక్షలకు పెంపు

బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత, ఓబీసీ వర్గీకరణ వంటి నిర్ణయాలతో క్రీమీలేయర్ వ్యవహారం ముడిపడింది. రిజర్వేషన్ ఫలాలను పూర్తిగా అందుకోలేకుండా ఈ క్రీమీలేయర్ నిబంధన బంధనాలు వేస్తోందని పలువురు బీసీ నేతలు అనేక సందర్భాల్లో వెల్లడించారు. క్రీమీలేయర్‌గా రూ. 6 లక్షల పరిమితి విధించడం వల్ల సాధారణ 4వ తరగతి ఉద్యోగులు సైతం తమ పిల్లలకు రిజర్వేషన్ కల్పించలేకపోతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఈ పరిమితిని రూ. 10 లక్షల వరకు పెంచాలని కొందరు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల మాదిరిగా అసలు క్రీమీలేయర్ నిబంధనే ఉండరాదని కొందరు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ.8 లక్షలకు పెంచినట్టు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు.

చమటతో విద్యుత్ ఇచ్చే బ్యాటరీలు

లాస్‌ఏంజెలెస్: భవిష్యత్‌లో మీ చమటను కూడా అమ్ముకోవచ్చేమో. ఎందుకంటే.. చమట నుంచి కూడా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి చార్జయ్యే బ్యటరీలు వస్తున్నాయి. భారత సంతతికి చెందిన శాస్త్రవేత్త కూడా భాగమైన అమెరికాలోని శాస్త్రజ్ఞుల బృందం చమట నుంచి శక్తిని ఉత్పత్తి చేసే బ్యాటరీలను రూపొందించింది. వీటితో ఎల్‌ఈడీలు, బ్లూటూత్ రేడియోల వంటి వాటిలో ఉపయోగించొచ్చు. వీటిని వేరబుల్ బయో ఫ్యూయల్ సెల్సని పిలుస్తున్నారు. అంటే ధరించదగిన బ్యాటరీలని అర్థం. మన శరీరంలోని దుస్తుల్లో ఈ బ్యాటరీలు ఉంచాలి. అప్పుడు అవి చెమట ద్వారా చార్జి అవుతాయి. ఇంకా పరిశోధనాత్మక దశలోనే ఉన్న ఈ బ్యాటరీలు ఈ రంగంలో ఒక పెద్ద సంచలనమని చెబుతున్నారు. వీటి ఆకారం సాగేందుకు అనుకూలగా ఉంటుంది. వీటిని మనం వేసుకునే బనియన్ల వంటి వాటిలో ఉంచొచ్చన్న మాట. దీంతో భవిష్యత్‌లో ఇలాంటి బనియన్లు తయారయ్యే అవకాశమూ ఉంది. అమెరికాలోని సాన్ డీగోలోని యూనవర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు ఈ బ్యాటరీలను అభివృద్ధి చేసారు. ఇంతకు మునుపు కూడా ఇలాంటి వాటిని కొందరు తయారు చేసినా, వీరు తయారు చేసిన బ్యాటరీలు వాడేందుకు అవసరమైన చార్జిని నిల్వ చేస్తున్నాయి. గతంలో ఇంత శక్తిమంతంగా బ్యాటరీలు చార్జి కాలేదు. వీటిలో 3డీ కార్బన్ నానోట్యూబ్ ఆధారిత కాథోడ్, ఆనోడ్ (బ్యాటరీలో ఉండే రెండు ధృవాలు) ఉంటాయి. వీటిని బయో ఫ్యూయల్ సెల్స్ అంటారు. ఎందుకంటే లాక్టిక్ యాసిడ్ (పాలలోనూ, మన చమట లోనూ ఉండేది) ను ఆక్సిజన్‌తో మండించి విద్యుత్‌ను పుట్టించే ఎంజైమ్, ఈ బ్యాటరీల్లో ఉంటుంది. అయితే.. ఇందులో వాడే పదార్థాల అనుపాతం ఎంతలో ఉండాలో పరిశోధిస్తున్నామని బృందంలో సభ్యుడైన అమయ్ బందోకర్ అన్నారు. ఈ బ్యాటరీ లోదుస్తుల్లో లేక దుస్తుల్లో పెట్టుకోవడానికి అనువుగా ఉండాలి దీంతో ఇది సాగేలా, తయారు చేస్తున్నారు. దీనిని బ్రిడ్జి అండ్ ఐలాండ్ అని రూపకర్తలు సరదాగా పిలుచుకుంటున్నారు. ఈ బ్యాటరీలు సన్నటి స్ప్రింగుల్లాగా ఉండి ఎంచక్కా వంగుతాయి కూడా. అయితే.. వీటి తయారీలో కొద్ది పాటి బంగారం కూడా ఉపయోగిస్తారు కాబట్టి వీటి ధర బాగానే ఉండొచ్చు. సాధారణ బ్యాటరీలకంటే ఇవే బాగా పని చేస్తాయని వీటిని రూపొందించిన బృందం అంటోంది.

జీఎస్టీ సెగ

(మొదటిపేజీ తరువాయి)

చూపుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు సూక్ష్మ సేద్యం దోహద పడుతుంది. ఈ సంవత్సరం కేంద్రప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రానికి ఇవ్వని విధంగా రూ.425 కోట్లను మంజూరు చేసింది. ఈసంవత్సరం ఉద్యానవన శాఖకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఏడాది ఉద్యానవన శాఖకు రూ.1468 కోట్లు కేటాయించగా, అందులో మైక్రో ఇరిగేషన్‌కు అత్యధికంగా 1170 కోట్లు కేటాయించడం జరిగింది. దీనిబట్టి చూస్తే ప్రభుత్వం సూక్ష్మ సేద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఇదిలా ఉంటే ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం జూన్‌లో జీఎస్టీని అమల్లోకి తీసుకొచ్చింది. తొలుత జీఎస్టీలో మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించిన పన్నుల ప్రస్తావన తీసుకురాలేదు. ఐతే అనంతరం జరిగిన కౌన్సిల్ సమావేశంలో మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించి వినియోగించే పరికరాలపై 18 శాతం పన్నును విధించడం జరిగింది. దీంతో అప్పటి వరకు వేగంగా జరుగుతున్న పనులు జీఎస్టీ సెగతో మందగించాయి. గతంలో మైక్రో ఇరిగేషన్ పరికరాలపై కొన్ని రాష్ట్రాల్లో వ్యాట్ టాక్స్ మినహాయింపు ఉండగా, మరికొన్ని రాష్ట్రాల్లో 2 శాతం పన్ను వసూలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 5 శాతం వ్యాట్ టాక్స్ కింద వసూలు చేసినా ప్రభుత్వం దాన్ని తిరిగి ఇచ్చేస్తోంది. అదేవిధంగా సెంట్రల్ ఎక్సైజ్ ఎక్సైజ్ డ్యూటీ 12.5 శాతం ఉంది. ఈ సుంకం కూడా 50 పరికరాలపైనే వసూలు చేశారు. ప్రస్తుతం వ్యాట్ టాక్స్, ఎక్సైజ్ డ్యూటీ కలిపి 18 శాతంగా నిర్ణయించడంతో ప్రభుత్వం, ఉద్యానవన రైతులకు అదనపు భారమైంది. దీంతో గత రెండు నెలల నుంచి రాష్ట్రంలో సూక్ష్మ సేద్యం మందగించడంతో ఆ ప్రభావం ఉద్యానవన పంటల విస్తీర్ణంపై పడింది. కేంద్రం విధించిన 18 శాతం పన్నును తగ్గించాలని ఉద్యానవన శాఖాధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. సూక్ష్మ సేద్యపు పరికరాలపై పన్నును తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం జరిగింది. కాగా రాష్ట్రంలో 2014-15 సంవత్సరం లో 35 వేల హెక్టార్లలలో ఉద్యానవన పంట సాగు ఉండగా, 2015-16లో 95 వేలకు, 2016-17లో లక్షా 40 వేలకు విస్తరించింది. ఈ ఏడాది సుమారు 2 లక్షల హెక్టార్ల వరకు విస్తరించాలని ఉద్యానవన శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఐతే ఆదిలోనే జీఎస్టీ ప్రభావంతో సాగు కొంత మందగించింది. దీంతో ఏడాది లక్ష్యాన్ని చేరాలంటే కష్టపడాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. సూక్ష్మ సేద్యానికి ప్రధాన వనరైన ఇరిగేషన్ పరికరాలపై జీఎస్టీ తగ్గించాలని రైతులు కోరుతున్నారు.

అనుమతివ్వండి!

(మొదటిపేజీ తరువాయి)

తప్పింది. ఈ ప్రమాదంలో 7 బోగీలు నుజ్జునుజ్జయి 23 మంది ప్రాణాలు కోల్పోగా, 200 మందికి పైగా గాయాల పాలయ్యారు. ఈ ఘటన ఇంకా మర్చిపోక ముందే బుధవారం ఉదయం ఉత్తరప్రదేశ్‌లోనే మరో రైలు ప్రమాదం జరిగింది. ఆగ్రా - కాన్పూర్ మార్గంలో ఔరయ్యా వద్ద కైఫియత్ ఎక్స్‌ప్రెస్ లెవెల్ క్రాసింగ్ వద్ద ఓ డంపర్‌ను ఢీకొట్టి పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 70 మంది వరకు ప్రయాణికులు గాయపడ్డారు. గత పదేళ్లలోనే ఎప్పుడూ లేని రీతిలో రైళ్లు పట్టాలు తప్పుతున్నాయి. కొన్ని ప్రమాదాల వెనుక ఉగ్రవాదుల విద్రోహ చర్యలున్నాయని కూడా తేలాయి. గత ఏడాది జరిగిన ప్రమాదాల్లో గత పదేళ్లలో ఎప్పుడూ లేనంతగా 186 మంది చనిపోయారు. ఈ ఏడాది జరిగిన ప్రమాదాల్లో ఇప్పటి వరకు 62 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదాలపై సామాజిక మాధ్యమాల్లో రైల్వే మంత్రి సురేశ్ ప్రభు మీద వ్యగ్యంగా అనేక కార్టూన్లు, విమర్శనాత్మక కథనాలు విస్తృతమవుతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న సురేశ్ ప్రభు, తన పదవికి రాజీనామా చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. అయితే ఎలాగూ మరి కొద్ది రోజుల్లోనే కేంద్ర కేబినెట్‌లో ప్రక్షాళన జరగనున్న నేపథ్యంలో ప్రధాన మంత్రి మోడీ అప్పటి వరకు వేచి ఉండాల్సిందిగా సూచించారు.

అయితే ఈలోపు రైల్వే బోర్డు ఛైర్మన్ ఏకే మిట్టల్‌పై కేంద్రం వేటు వేసింది. వరుసగా ప్రమాదాలు జరగడానికి ఆయన్ను బాధ్యుణ్ణి చేస్తూ పదవి నుంచి తప్పించింది. ఆగమేఘాల మీద ఎయిరిండియా సీఎండీగా ఉన్న అశ్వీని లోహానీని తీసుకొచ్చి రైల్వే బోర్డు ఛైర్మన్‌గా నియమించింది. అయితే ఇది కేవలం కంటి తుడుపు చర్య అని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మనీష్ తివారీ వ్యాఖ్యానించారు.

మారనున్న కీలక శాఖాధిపతులు

రైల్వే మంత్రి రాజీనామా యత్నంతో మరోసారి కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ చర్చకొచ్చింది. ఇప్పటికే ఖాళీగా ఉన్న కీలక శాఖలతో పాటు రైల్వే శాఖలోనూ మార్పులు జరగవచ్చని తెలుస్తోంది. గోవా ముఖ్యమంత్రిగా మనోహర్ పారికర్ తిరిగి వెళ్లిపోవడంతో ఏర్పడ్డ రక్షణ శాఖలో ఖాళీ ఏర్పడింది. దీన్ని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అదనంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అలాగే అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రిగా పనిచేస్తున్న అనిల్ మాధవ్ దవే హఠాన్మరణంతో ఆ శాఖ ఖాళీ అయింది. దీన్ని సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి హర్షవర్ధన్‌కు అదనంగా అప్పగించారు. అలాగే ఉప రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు క్రియాశీల రాజకీయాల నుంచి దూరం కావడంతో ఆయన నిర్వహించిన పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖలను, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు, సమాచార ప్రసారాల శాఖను కేంద్ర జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీకి అప్పగించారు. త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో ఈ శాఖల భర్తీతో పాటు కీలక శాఖల్లో మార్పులు చేర్పులు చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

వరుస ప్రమాదాలతో ప్రభుత్వానికి సైతం అపఖ్యాతి వస్తున్నందున రైల్వే శాఖ మంత్రిని మార్చే అవకాశముంది. నిజానికి సురేశ్ ప్రభును ఏరికోరి తీసుకొచ్చి మరీ ఈ శాఖను అప్పగించారు. తొలుత సదానంద గౌడ నిర్వహించిన ఈ శాఖను సురేశ్ ప్రభుకు అప్పగించిన తర్వాత చెప్పుకోదగ్గ మార్పులను తీసుకురాగలిగారు. ప్రాధాన్యతాక్రమంలో రైల్వే ప్రాజెక్టుల్ని గుర్తించి వాటిని త్వరగా పూర్తి చేసేలా బడ్జెట్ కేటాయింపులు చేశారు. కొత్త ప్రాజెక్టుల జోలికి వెళ్లకుండా ఉన్న ప్రాజెక్టులనే త్వరగా పూర్తిచేయడంపై దృష్టి సారించారు. అలాగే భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు అనేక సంస్కరణలకు నడుం బిగించారు. ప్రత్యేక బడ్జెట్‌ను కాస్తా నేరుగా సాధారణ బడ్జెట్‌లో భాగం చేశారు. ఇలా ఎన్నో విప్లవాత్మక మార్పులకు ప్రభు హయాంలోనే శ్రీకారం చుట్టినప్పటికీ, వరుస ప్రమాదాలు ఆయన్ను వెంటాడాయి.

కీలకమైన రక్షణశాఖకు సురేశ్ ప్రభును బదిలీ చేసి, రైల్వే శాఖను మరొకరికి అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే స్మృతి ఇరానీకి సమాచార ప్రసారాల శాఖను పూర్తి స్థాయిలో అప్పగించి జౌళి శాఖను మరొకరికి ఇవ్వనున్నారని తెలుస్తోంది. 2019 ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్న ఈ కొత్త కేబినెట్‌లో యువశక్తికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని మోడీ భావిస్తున్నారు.

ప్రమాదకర స్థాయిలో భూగర్భజలలం

- వర్షాభావంతో అడుగంటిన జలం • రాయలసీమలో మరీ దారుణం

అమరావతి - ఆంధ్రప్రభ : ఒక వైపు రాష్ట్రంలో అడపదడపా వర్షాలు కురుస్తున్నా మరో వైపు మాత్రం భూగర్భ జలమట్టం మాత్రం ఆశించిన స్థాయిలో ఉండకపోవడంతో ఆందోళన కలిగిస్తుంది.ఈ ఏడాదైనా సక్రమంగా వర్షాలు కురుస్తాయని భావించిన జనానానికి కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందనే చెప్పాలి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కూడా భూగర్బ జల మట్టం పెరుగుదలకు ప్రభుత్వం చెట్టు నీరు, ఇంకుడు గుంతల తవ్వకం, వాటర్‌షెడ్ల పథకాలు, తదితర రకాలుగా వర్షపు నీటిని ఒడిసిపట్టి,భూగర్బ జలంగా మారుస్తున్నా, ఇంకా పరిస్థితి మారాల్సి ఉంది. కోస్టల్ ఆంధ్రా రీజియన్‌లో పరిస్థితిని గమనిస్తే ఇప్పటివరకు 9.91 మీటర్ల లోతులో భూగర్బ జలం ఉండటం మరింత ఆందోళన కలిగిస్తుంది.జూలై నెలలో 10.61 మిటర్లలోనే భూగర్బ జలం ఉంది.ఇదే సమయానికి పోయిన సంవత్సరంలో 9.24 మీటర్ల లోతులో భూగర్బ జలం ఉంది. జిల్లాల వారీగా చూస్తే శ్రీకాకుళం జిల్లాలో 4.70 మీటర్లకు భూగర్బ జలం మట్టం పడిపోయింది. అదే విధంగా విజయనగరం 5.28 మీటర్లు, విశాఖపట్నం 7.14, తూర్పు గోదావరి 8.23, పశ్చిమ గోదావరి 17.80, కృష్ణా 9.07,గుంటూరు 6.71, ప్రకాశం 20.06, నెల్లూరు 10.18 మీటర్ల లోతులో భూగర్బ జలం ఉంది. అదే విధంగా చిత్తూరు జిల్లాలో 24.23, కడప 23.64, అనంతపురం 26.61 మీటర్ల లోతుకు భూగర్బ జల మట్టం పడిపోయింది. కర్నూలులో 12.08 మీటర్లకు పడిపోయింది.అయితే గత సంవత్సరం కంటే ఈసారి పరిస్థితిలో కొంతమార్పు ఉన్నప్పటికీ ఇంకా భూగర్బ జల మట్టాన్ని పెంచుకోవాల్సిన అవసరం చాలా ఉంది. రాయలసీమ రీజియన్‌వ్యాప్తంగా కూడా అన్ని జిల్లాల్లో భూగర్బ జలమట్టం దారుణంగా పడిపోయింది. దీనికి ప్రధాన కారణం సరైన సమయంలో సరైన రీతిలో వర్షపాతం నమోదుకానికారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందంటున్నారు. అనంతరపురం జిల్లాలో ఇప్పటివరకు 190.20 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా ఈ జిల్లాలో కేవలం మైనస్ 18.20 మిల్లీ మీటర్ల వర్షపాతం పడడం గమనార్హం. అదే విధంగా కడపలో 242.10 మిల్లీ మీటర్లకు మైనస్ 11.60 , చిత్తూరు 270.30 మిల్లీ మీటర్లకు మైనస్ 2.40 మాత్రమే వర్షం పడింది. కర్నూలులో 286.10 మిల్లీ మీటర్లకు మైనస్ 22.10 మిల్లీ మీటర్లు మాత్రం నమోదు కావడం పరిస్థితిని సూసిస్తోంది. కోస్తాకంటే రాయలసీమ వ్యాప్తంగా భూగర్బ జలమట్టం ప్రమాదకరస్థాయిలోకి పడిపోవడంతో ఆందోళన కలిగిస్తుంది.రానున్న రోజుల్లో ఈ పరిస్థితుల్లో మార్పురాకపోతే మరింత కరవు తాండమించడం ఖాయమంటున్నారు. రోజురోజుకు పడిపోతున్న భూగర్బ జలమట్టంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రమాద ఘంటికలు మోగుతున్నాయంటున్నారు.ఇంకో వైపు ఎగువున పెద్ద ఎత్తున కురుస్తున్న వర్షాలకు జూరాల,అల్మట్టి, తుంగభద్ర,నారాయపూర్ ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నా,కింద ఉన్న శ్రీశైలం,నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లోకి చుక్క నీరురాకుండా కర్ణాటక ప్రభుత్వం వాడేసుకుంటుంది. కనీసం మంచినీళ్ళకైనా నీటిని విడుదల చేయాలని రెండు తెలుగు రాష్ట్రాలు మొత్తుకుంటున్నా పెడచెవినపెడుతూ ముందుకుపోతున్నది.

ఇష్టానుసారం ఎత్తిపోతల పథకాలు పెట్టి,వచ్చిన నీటిని వచ్చినట్లు తోడేస్తూ నిబంధనలకు పాతరేస్తుంది.దీని వల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సాగు,తాగునీటి కొరతతో పాటు కరవు విలయతాండవం చేసే దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్నారు.ఈపరిస్థితి నుంచి అధిగమించేందుకు ప్రభుత్వం శతవిధాలా యత్నిస్తూనే ఉంది. పరిస్థితిని కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది.

ఓటెత్తిన చైతన్యం

(మొదటిపేజీ తరువాయి)

నమోదైంది. నంద్యాల రూరల్ మండలంలో 81.10 శాతం, అర్బన్‌లో 67.60 శాతం, గోస్పాడు మండలంలో 81.14 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల సంఘం అధికారులు తెలియజేశారు. ఎంతో ఉత్కంఠభరితంగా సాగిన నంద్యాల ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, అభ్యర్థులు, నంద్యాల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. అత్యంత సమస్యాత్మక నియోజకవర్గం కావడంతో అడుగడుగునా అధికారయంత్రాంగం పలు జాగ్రత్తలు తీసుకుంది. ఫలితంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ప్రత్యేకించి అర్బన్‌తో పోల్చితే గ్రామీణ ప్రాంత ఓటర్లు భారీగా ఓటింగ్ తరలివచ్చారు. పురుషులతో పోల్చితే మహిళలు అధికంగా ఓటింగ్‌లో అధికంగా పాల్గొన్నారు.

మొరాయించిన ఈవీఎంలు

కాగా పోలింగ్ సందర్భంగా కొన్ని కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. నంద్యాలలోని ఎన్జీవో కాలనీలోని 94వ బూత్‌లో ఈవీఎంలు పనిచేయలేదు. దీంతో పోలింగ్ నిలిచిపోయింది. పాలిటెక్నిక్ కళాశాలలోని పోలింగ్ బూత్‌లోనూ ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాలలో అధికారులు వెబ్ క్యాస్టింగ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. మూడు డ్రోన్ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. కాగా దేశంలోనే మొట్టమొదటిసారిగా బాడీ ఓర్న్ కెమెరాలతో నిఘా వుంచారు. వివి పాట్ యంత్రాలను కూడా ఉపయోగించారు. ఒకవైపు పోలింగ్ జరుగుతున్నప్పటికీ మరోవైపు ఇరు పార్టీలకు చెందిన వారు ఎన్నికల సంఘానికి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు.

కాగా 2014లో జరిగిన సాధారణ ఎన్నికలలో పోలింగ్ శాతం 65.36 గా నమోదైంది. అప్పట్లో విజేతగానిలిచిన వైఎస్సార్‌సిపి అభ్యర్థి భూమా నాగిరెడ్డికి 46.97 శాతం ఓట్లు పోల్ కాగా, టిడిపి అభ్యర్థిగాబరిలోకి దిగిన శిల్పా మోహన్ రెడ్డి కి 44.91 శాతం ఓట్లు లభించాయి. మొత్తం ఓట్లు 2,07,646 ఓట్లు కాగా పోలైన ఓట్లు 1,74,999 ఓట్లు మాత్రమే. దీంతో 2.06 శాతం ఓట్ల మెజారిటీతో భూమా నాగిరెడ్డి విజయంసాధించారు.

బారులు తీరిన ఓటర్లు

ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు జోరుగా సాగింది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మహిళలు, పురుషులు, వృద్దులు, తదితరులు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఎంపీ ఎస్పివై రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే వైఎస్ఆర్‌సిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, ఆయన సోదరుడు శిల్పా చ్రకపాణి రెడ్డి, ఆయను కువూరుడు, కూతురులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొంతమంది వృద్దులు కూడా ఉదయం నుంచి క్యూలైన్లల్లో ఉండడం గమనార్హం, మరీ ముసలి వారిని సైకిల్ మోటార్లుపై ఎక్కించుకొని వచ్చి ఓటు వేయించారు.ఈ సారి ఎన్నికల పోలింగ్‌కు ముందు ఎన్నికల సంఘం అధికారులు ఓటర్లకు ముందస్తుగానే స్లిప్‌లను ఇవ్వడంతో సమయం కలిసొచ్చింది. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై ఓటు వేశారు. చిన్న పిల్లలను సైతం వెంటబెట్టుకొచ్చి ఓటు వేసి వెళ్లారు. జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సత్యనారాయణ,రాయలసీమ ఐజి ఇక్బాల్, ఎస్పీ గోపినాథ్‌జెట్టిలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రశాంతంగా జరిగేలా కృషి చేశారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. నిత్యం పోలీస్ బలగాలతో తిరుగుతూ గుంపులను చెదరగొట్టేలా చేశారు.ఎన్నికల నిబంధనల ప్రకారం ఇతర ప్రాంతాల వారు నంద్యాలలో ఉండకుండా తనఖీలు చేపట్టి వెనక్కి పంపించారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్నీ తనిఖీ చేశారు. కమాండ్ కంట్రోల్ ద్వార సీసీ కెమెరాలను అనుసంధానం చేశారు. ఎన్నికల పరిశీలకులతో పాటు రాయలసీమ ఐజి ఇక్బాల్ పర్యవేక్షించారు. నంద్యాల, గోస్పాడు, నంద్యాల రూరల్ బాధ్యతలకు ముగ్గురు ఎస్పిలకు అప్పగించి పర్యవేక్షించారు. ఉదయమే పోలింగ్ ప్రారంభం కావడంతో అక్కడక్కడ ఇవిఎంలు మొరాయించగా వాటిని వెంటనే మార్చి సరి చేశారు. వైఎస్ఆర్‌సిపి అభ్యర్థి శిల్పమోహన్‌రెడ్డి, టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలోకి వెళ్లి పోలింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.భూమానాగిరెడ్డి చిన్న కూతరు భూమా మౌనిక హల్ చల్ చేసింది. చైతన్య నగర్‌లో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటర్లను ఓటు అడగడంతో వైఎస్ఆర్‌సిపి ఏజెంట్లు అభ్యంతరం చెప్పారు.కొందరు వైఎస్ఆర్‌సిపి నేతలు కూడా వచ్చి ఓట్లు అడగడంతో ఇరువురిని పోలీసులు దూరంగా పంపించారు. భూమా మౌనిక వృద్దులను దగ్గరుండి తీసుకొచ్చి ఓటు వేసేందుకు సహకరించారు.నందమూరి నగర్‌లో టిడిపి వారు దొంగ ఓట్లు వేయిస్తున్నారని వైకాపా నేతలు పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో వారిలో కొందరిని అదుపులోకి తీసుకున్నారు. మరి కొందరు పారిపోయారు.వైఎస్ఆర్‌నగర్‌లో కూడా ఇరువర్గాల మధ్య చిన్న చిన్న ఘర్షణలు చోటు చేసుకున్నాయి.అలాగే బొమ్మల సత్రం వద్ద కూడా చిన్నచిన్న ఘర్షణలు చోటు చేసుకున్నాయి. టిడిపి, వైకాపా వర్గాలు ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నారు.కొన్ని ప్రాంతాలలో చిన్న చిన్న దాడులు చేసుకున్నారు.ఇదిలా ఉండగా సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత నంద్యాలలోని ఆత్మకూర్ బస్టాండ్ వద్ద భూమా జగత్,మౌనిక, వైకాపా నేత శిల్పా చక్రపాణి రెడ్డి, రవికిశోర్‌రెడ్డిల మధ్య వాగ్వివాదం జరిగింది.వెంటనే పోలీసు బలగాలు చేరుకొని ఆ ఘర్షణలు సద్దుమణిగేలా చేశారు. కొందరు టిడిపి ఎమ్మెల్యేలు నిబంధనలకు విరుద్ధంగా నంద్యాలలో ఉంటూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారని వైకాపా నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఫాక్షన్ గ్రామాలలోనూ, సమస్యాత్మక గ్రామాలలో సైతం భారీగా పోలింగ్ నమోదైంది. గోస్పాడు, నంద్యాల రూరల్ మండలాలలో పెద్ద ఎత్తున పోలింగ్ నమోదైంది.మొత్తానికి ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో పోలీస్ శాఖ ఊపిరి పీల్చుకుంది.

రాష్ట్రంలో వరిసాగు మెరుగు

- నెలరోజుల్లో పెరిగిన 20 శాతం విస్తీర్ణం
- ఆశాజనకంగా రైతాంగం



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా పడటంతో వరిసాగు మెరుగైంది. నెల రోజుల కాలంలోనే సుమారు 20 శాతం విస్తీర్ణం పెరగడం గమనార్హం. గత నెల 16 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 39 శాతం నాట్లు పడగా, ఈనెల 13 జిల్లాల్లో వరిసాగు విస్తీర్ణం 58 శాతానికి పెరగడం గమనార్హం. ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, కర్నూలు, శ్రీకాకుళం జిల్లాల్లో సాధారణ సాగుకంటే అధికంగా ఉంది. అలాగే విశాఖపట్నం, కడప, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో కూడా సాగు మెరుగుపడింది. అనంతపురం, నెల్లూరు, విజయనగరం జిల్లాల్లో వరినాట్లు మందకొడిగా సాగుతున్నాయి. గత వారం రోజులుగా కురిసిన వర్షాలతో నెలాఖరుకు వరిసాగుకు మరింత మెరుగయ్యే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రం మొత్తంమీద 13 జిల్లాల్లో 4206686 హెక్టార్ల విస్తీర్ణం ఉండగా, 4046583 హెక్టార్ల విస్తీర్ణంలో వరిసాగు జరుగుతోంది. కాగా గతేడాది ఇదే సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 26511070 హెక్టార్లలో వరిసాగు చేయగా, ఈ ఏడాది 2353231 హెక్టార్లలో వరినాట్లు వేయడం జరిగింది. గతేడాది ఈ సీజన్‌లో 2651070 హెక్టార్లలో వరిసాగు జరిగింది. క్రితం సంవత్సరంతో పోలిస్తే రాష్ట్రం మొత్తంమీద 89 శాతం వరినాట్లు పడ్డాయి. జిల్లాల వారీగా వరిసాగు వివరాలు క్రింది విధంగా ఉన్నాయి..

జిల్లా	లక్ష్యం	ప్రస్తుత సాగు	సాగు శాతం	నాట్ల శాతం
శ్రీకాకుళం	257663	167741	70	98
విజయనగరం	204150	77973	41	66
విశాఖపట్నం	201100	95664	50	85
తూ.గో	260614	193767	70	97
ప.గో	261047	229728	85	103
కృష్ణా	335800	265093	80	129
గుంటూరు	543421	270844	55	112
ప్రకాశం	265609	90371	40	86
నెల్లూరు	97519	33757	44	49
చిత్తూరు	200038	151115	77	87
కడప	151120	60335	44	96
అనంతపురం	837503	318621	40	53
కర్నూలు	591102	398192	65	109
మొత్తం	**4206686**	**2353231**	**58**	**89**

ఎన్‌డీఆర్‌ఎఫ్‌కు దీటుగా ఎస్‌డీఆర్‌ఎఫ్

- విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం
- ఎప్పటికప్పుడు శిక్షణతో మెరుగులు

-కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని పోలవరం కాలువలో నీటి ఉధృతికి ఆరు గేదెలు కొట్టుకుపోతున్నాయి. రక్షించేందుకు వీలులేని స్థితిలో స్థానికులు విషయాన్ని అగ్నిమాపక అధికారులకు తెలిపారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన విపత్తు నిర్వహణ సిబ్బంది ఎనిమిది గంటల పాటు శ్రమించి గేదెలను రక్షించారు.

-జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి విజయవాడ సమీపంలోని కనకదుర్గమ్మ వారధి పైనుంచి కృష్ణానదిలో దూకాడు. సమాచారం అందిన వెంటనే రాష్ట్ర విపత్తు నిర్వహణ సిబ్బంది రంగంలోకి దిగి ఆ వ్యక్తిని రక్షించి పోలీసులకు అప్పగించారు.



విజయవాడలోని బందరు కాల్వలో పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్న అధికారులు

అమరావతి, ఆంధ్రప్రభ : అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే స్పందించే అగ్నిమాపక శాఖ స్వరూప స్వభావాలు మారిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవల కాలంలో భారీ విపత్తులు చోటు చేసుకుంటున్న సందర్భాల్లో కనిపించేది మాత్రం అగ్నిమాపక, విపత్తు నిర్వహణ సిబ్బంది మాత్రమే. జాతీయ స్థాయిలో జాతీయ విపత్తు రక్షణ ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్)కు ధీటుగా రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ(ఎస్‌డీఆర్‌ఎఫ్) ఆధునికత సంతరించుకుంటోంది. ఆధునిక సౌకర్యాలు సమకూర్చుకుంటూ విపత్తు సమయాల్లో స్పందించేందుకు సమాయత్తంగా ఉంది. ఇటీవల కాలంలో ఎదురయ్యే విపత్తులు మొదలు చిన్నపాటి ప్రమాదాల్లో సైతం విపత్తు నిర్వహణ సిబ్బంది సేవలు కీలకంగా మారాయి.గతంలో విశాఖపట్టణాన్ని అతలాకుతలం చేసిన హుదుద్ తుఫాను సమయంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ సిబ్బంది సేవలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం మెచ్చుకున్నారు. రోడ్లపై విరిగిపడిన చెట్ల తొలగింపు, రహదారులకు అడ్డంకిగా ఉన్న వాటి తొలగింపులో వీరు నిర్వహించిన సేవలు అనేకం. ఒక్క హుదుద్ తుఫాను సమయంలోనే కాకుండా నెల్లూరు జిల్లాలో వచ్చిన వరదల సందర్భంగా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చూడటంలో వీరు నిర్వహించిన పాత్ర చిన్నదేమీ కాదు. రానున్న రోజుల్లో విపత్తు నిర్వహణ సిబ్బంది ఆవశ్యతను దృష్టిలో ఉంచుకొని పలు అంశాల్లో వీరికి శిక్షణ ఇప్పిస్తున్నారు. తరుచూ ఆయా శిక్షణాంశాలపై అధికారులు పునశ్చరణ జరుపుతూ మెరుగులు దిద్దుతున్నారు.

రాష్ట్రంలో 58 ఓవీఎంలు..

రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 172 అగ్నిమాపక కేంద్రాల్లో అవసరాన్ని బట్టి 58 ఓవీఎం(అవుట్ బోట్ మోటార్లు)లు అందుబాటులో ఉంచారు. ఒక్కొక్క బోటులో 20 నుంచి 50 హార్స్ పవర్ ఉన్న మోటార్లను అమర్చారు. ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ వద్ద ఉన్న వాటిలో ఎక్కువగా 40హార్స్ పవర్ మోటార్లు ఉన్న బోట్లు ఎక్కువగా ఉన్నాయి. ప్రతి జిల్లాకు అవసరాన్ని బట్టి మూడుకు తగ్గకుండా చూస్తున్నారు. విపత్తులు అధికంగా ఉండొచ్చని భావించే జిల్లాల్లో మాత్రం ఎక్కువ ఓవీఎంలు అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యంగా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కర్నూలు, గుంటూరు, కృష్ణా జిల్లాలతో పాటు విశాఖపట్టణం జిల్లాల్లో అధిక ఓవీఎంలు ఉంచినట్లు అధికారులు చెపుతున్నారు. ఓవీఎంల నిర్వహణలో సుశిక్షితులైన అగ్నిమాపక సిబ్బందిని ఉంచుతున్నారు. నీళ్ల సంబంధమైన విపత్తులు జరిగిన వెంటనే అక్కడికి చేరుకొని అప్పటికప్పుడు బోట్ల తయారీ, గాలి నింపడం, ఇంజను అమరిక వంటి వాటిని వెనువెంటనే చేయడంతో పాటు సకాలంలో స్పందించి చర్యలు తీసుకునే విధంగా ఓవీఎంల విధులు నిర్వహించే సిబ్బందికి తర్ఫీదు ఇచ్చారు. సిబ్బంది లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఒక్కొక్క ఓవీఎంలో డ్రైవర్ సహా ఐదుగురు సభ్యులు ఉండే విధంగా చర్యలు తీసుకున్నప్పటికీ..ఎనిమిది మంది విధులు నిర్వహించే విధంగా బోట్లను రూపొందించినట్లు అధికారులు చెపుతున్నారు. భవిష్యత్‌లో విపత్తు నిర్వహణ సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని చర్యలను అధికారులు తీసుకుంటున్నారు.

ఆధునిక శిక్షణ..

రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 400మంది అగ్నిమాపకసిబ్బందిని ఎంపిక చేసి విపత్తు రక్షణ దళంలో నియమించారు. వీరికి తొలుత నదుల్లో శిక్షణ ఇచ్చారు. నదీ పరివాహక ప్రాంతాల్లో చోటు చేసుకునే విపత్తుల నుంచి ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించే విధంగా ముందస్తు శిక్షణ ఇచ్చారు. ఇటీవల వీరికి మరింత ఆధునీకమైన పద్ధతుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలకు పంపి ఎన్‌డీఆర్‌ఎఫ్ తరహా శిక్షణ ఇప్పిస్తున్నారు. ఒడిశాలోని రామచండీ సముద్ర తీరంలో కొద్ది రోజుల కిందట 50మందికి అత్యాధునిక శిక్షణ ఇప్పించారు. సముద్ర వాతావరణం సైతం తట్టుకొని విపత్తు సమయాల్లో సేవలు అందించే విధంగా తీర్చిదిద్దుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెరికల్లాంటి సిబ్బందిని ఏర్పాటు చేసి అన్ని విధాలుగా ఆధునిక తరహా శిక్షణ ఇప్పిస్తున్నట్లు అగ్నిమాపక, విపత్తు నిర్వహణ అధికారులు చెపుతున్నారు.

గంజాయి మత్తులో హైదరాబాదీ యువత

- గుట్టు చప్పుడు కాకుండా అక్రమ రవాణా
- కళాశాల విద్యార్థులే టార్గెట్..
- చైన్ సిస్టమ్‌లా కొనసాగుతున్న వైనం
- ఉక్కుపాదం మోపాల్సిందే..
- కింగ్‌పిన్‌లను పట్టుకుంటేనే సాధ్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గంజాయి మత్తులో హైదరాబాదీ యువత జోగుతోంది. కళాశాల విద్యార్థులనే టార్గెట్ చేస్తూ పెద్ద మొత్తంలో విశాఖ నుంచి భాగ్యనగరానికి చేరుతోంది. రోడ్డు, రైలు రవాణా ద్వారా గంజాయి తరలింపు కొనసాగు తోంది. గంజాయి మత్తుకు అలవాటు పడ్డ నగర శివారులోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులలో కొందరు గంజాయి విక్రేతలుగా మారుతున్నారు. గతంలో హైదరాబాద్‌లోని టోలీచౌక్‌లో ఓ ఇంట్లో గంజాయి మొక్కలను పెంచుతూ ఒకరు పోలీసులకు చిక్కాడు. విద్యార్థులు రహస్యంగా గంజాయి సేవనానికి బానిసలవుతున్నారు. ఓ చైన్ సిస్టమ్ మాదిరిగా ఈ గంజాయి నగరానికి సరఫరా అవుతోంది. విశాఖ కేంద్రంగా గంజాయి అక్రమ రవాణా కొనసాగుతోంది. అక్కడ్నించీ రైలు, రోడ్డు మార్గాల ద్వారా హైదరాబాద్‌కు చేరుతున్న గంజాయిని ఇక్కడి వారి ఏజెంట్లు దిగుమతి చేసుకుంటారు. కొంత గంజాయిని నగరంలో అమ్మేందుకు.. మిగతా గంజాయిని ఇతర రాష్ట్రాలకు రైళ్లలోనే తరలించడం జరుగుతుంది. ఎవరికీ అనుమానం కలగని రీతిలో గంజా యి అక్రమ రవాణా కొనసాగుతుండటం గమనార్హం. నగరంలో పలుమార్లు పోలీ సులు నిర్వహించిన దాడుల్లో పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడుతున్నా హైద రాబాదీ యువతకు గంజాయి లభ్యమవుతుండటం విశేషం. పోలీసుల కళ్లు గప్పి గంజాయి నగర ప్రవేశం చేస్తోందని అంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో సైతం గంజాయి సాగు జరుగుతోందని చెబుతున్నారు. ప్రధానంగా ఏపీలోని విశాఖ గంజాయికి స్థావరంగా మారిందన్నది సద్విితమే. కాగా, ఇందుకు ప్రధానమైన సూత్రధారులు ఇప్పటివరకూ పోలీసులకు చిక్కకపోవడం విశేషం. గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని భాగ్యనగరానికి చేర్చడమే కాదు.. ఇతర రాష్ట్రాలకు రైలు మార్గాల ద్వారా ఇక్కడ్నించే తరలివెళుతోంది. గంజాయి అమ్మ కాలను కొన సాగించేది లేదని నియంత్రిస్తామని చెబుతున్నా అది ఆచరణ సాధ్యం కావడం లేదు.

చింత మరింత ప్రియం

- కిలో ధర రూ.250 దాటిన వైనం
- వినాయక చవితి నేపథ్యంలో కొండెక్కిన ధరలు



హైదరాబాద్, ఆంధ్ర ప్రభ: పండగ లొస్తే చాలు.. కూరగాయల ధరలకు రెక్కలొస్తున్నాయి.. కొన్ని రకాలైతే దాదాపు రెండింతలు పెరుగుతున్నాయి. ఈ వినాయక చవితికి ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా చింతకాయ ధర కిలో రూ.250కి చేరుకుంది. మొన్నటి వరకు పచ్చిమిర్చి, టమోటో ధరలు మాత్రమే పేద వర్గాలకు అందకుండా పోతే, రెండు, మూడు రోజులుగా అన్ని రకాల కూరగాయల ధరలు మంట మండుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.20 ఉన్న ఉల్లి ధర ప్రస్తుతం రూ.40 నుంచి రూ.50కి పెరిగిపోయింది. వినాయక చవితికి ప్రతి కుటుంబంలో చింతకాయ, తుమ్మికూర, ఉండ్రాళ్ళు తప్పనిసరిగా చేస్తారు కాబట్టి అందుకు అవసరమయ్యే వస్తువులన్నీ అమాంతంగా పెంచేశారు వ్యాపారులు. ఆ క్రమంలోనే నిన్నటి వరకు మార్కెట్‌లో కిలో రూ.50 పలికిన చింతకాయ నేడు ఐదింతలు పెరిగింది. పచ్చిమిర్చి కిలో రూ.60కి తగ్గడంలేదు. తీవ్రమైన కొరత ఉన్న టమోటోలు కిలో రూ.60 వెచ్చించి కొందామన్న దొరకని పరిస్థితి నెలకొంది. మిగతా అన్ని రకాల కూరగాయలు కూడా పేద వర్గాలు కొని తినలేని స్థాయిలో ధరలు పెరిగిపోయాయి.

సైనా సునాయాసంగా

- ప్రణీత్ పోరాడి.. శ్రీకాంత్ అలవోకగా ప్రి క్వార్టర్స్‌కు



గ్లాస్గో: భారత బ్యాడ్మింటన్ సూపర్‌స్టార్ సైనా నెహ్వాల్.. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో సునాయాస విజయం సాధించింది. సాయి ప్రణీత్ రెండో రౌండ్లో చెమటోడ్చి గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. తొలి రోజు స్ఫూర్తిదాయక విజయం సాధించిన కిదాంబి శ్రీకాంత్ రెండోరౌండ్లో కూడా తిరుగులేని విధంగా ఆడి గెలిచాడు. సాయి ప్రణీత్ ఓటమి నుంచి తృటిలో తప్పించుకున్నాడు. బుధవారం మహిళల సింగిల్స్ రెండో రౌండ్ పోరులో సైనా 21-11, 21-12 తేడాతో స్విస్ షట్లర్ సబ్రినా జాక్వెట్‌పై అలవోకగా గెలిచి ప్రి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకుపోయింది. ఈ పోరు 33 నిమిషాల పాటు సాగింది. ప్రి క్వార్టర్స్‌లో రెండో సీడ్ కొరియా క్రీడాకారిణి సంగ్ జి హ్యూన్‌తో సైనా తలపడవచ్చు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ పోరులో శ్రీకాంత్ 21-9, 21-17తో ఫ్రాన్స్‌కు చెందిన లుకాస్ కోర్వీని ఓడించాడు. ఇండొనేషియా షట్లర్ ఆంథోనీతో జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ పోరులో సాయి ప్రణీత్ తొలి గేమ్‌లో ఓడినా చివరకు 14-21, 21-18, 21-19తో కష్టపడి గెలిచాడు.

సైనాకు నల్లేరుపై నడకే: సైనా ఆట ఆరంభం నుంచి ఆధిపత్యం చెలాయించింది. ఆదిలోనే 4-0తో ఆధిక్యంలో నిలిచిన సైనా అనతికాలంలోనే 11-6కు పెంచుకుంది. సబ్రినా కోలుకొని సైనా ఆధిక్యాన్ని 9-13కు తగ్గించినా హైదరాబాదీ 14 నిమిషాల్లో తొలి గేమ్‌ను వశం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ సైనా జోరు కొనసాగింది. స్మాష్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసి ఆరంభంలోనే 5-2 ఆధిక్యంలోకి వెళ్లింది. విరామానికి సైనా 11-7తో నిలిచింది. తర్వాత అదే ఊపును కొనసాగించి మ్యాచ్‌ను గెలుచుకుంది.


ప్రణీత్ కష్టపడి: ప్రణీత్.. ఆట ఆరంభంలో ఆంథోనీ దూకుడును రుచి చూశాడు. ఆంథోనీ ఆరంభంలోనే 8-0 ఆధిక్యంలోకి దూసుకుపోయాడు. తర్వాత ఆ ఆధిక్యాన్ని 16-6కు పెంచుకున్నాడు. పాయింట్ల తేడాతో అంతరం ప్రణీత్‌కు తొలి గేమ్‌ను దూరం చేసింది. రెండో గేమ్‌లో ప్రణీత్ పుంజుకున్నాడు. విరామానికి 11-9 ఆధిక్యం సాధించాడు. 14-12 ఆధిక్యంలో ఉండగా సాయికి వైద్య సహాయం అవసరమైంది. ఇదే అదనుగా ఆంథోనీ 16-15 ఆధిక్యంలోకి దూసుకుపోయాడు. ఐతే సాయి అవకాశాన్ని విడిచిపెట్టకుండా హోరాహోరీగా పోరాడి రెండో గేమ్‌ను 21-18తో సొంతం చేసుకున్నాడు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ప్రణీత్ ఆదిలోనే 6-2 ఆధిక్యం సాధించాడు. అదే ఊపులో ఆధిక్యాన్ని 11-9కు పెంచుకున్నాడు. విరామానికి ఆంథోనీ 18-12 ఆధిక్యం సాధించాడు. కానీ ప్రణీత్ ఆరు పాయింట్ల ఆధిక్యాన్ని అధిగమించి చివరకు రెండు పాయింట్ల ఆధిక్యంలోకి దూసుకుపోయాడు. ఆంథోనీకి మరో అవకాశం ఇవ్వకుండా గేమ్‌ను, మ్యాచ్‌ను ప్రణీత్ దక్కించుకున్నాడు. మహిళల సింగిల్స్ రెండోరౌండ్లో తన్వి లాడ్ 9-21, 19-21 తేడాతో కొరియా షట్లర్ సంగ్ జి హ్యూన్ చేతిలో ఓడింది. మహిళల డబుల్స్ రెండో రౌండ్ పోరులో అశ్విని, సిక్కి రెడ్డి జోడీ 22-24, 21-17, 15-21తో పోరాడి కమిల్లా, క్రిస్టియానా (డెన్మార్క్) చేతిలో ఓడింది. సంజనా సంతోష్, ఆర్తి సారా సునీల్ 14-21, 15-21తో బావో యింగ్జి, యు జియోహాన్ (చైనా) చేతిలో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో మేఘన జక్కంపూడి, పూర్విష ఎస్ రామ్ జోడీ 21-13, 16-21, 8-21 తేడాతో నెదర్లాండ్స్ జంట మస్కీన్స్, సెలెనా చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో అర్జున్, రామచంద్రన్ 14-21, 21-19, 14-21తో చైనీస్ తైపీ జోడీ లియో మిన్ చున్, చెంగ్ హెంగ్ సు చేతిలో ఓటమి పాలయ్యారు.

అఫ్రిది 43 బంతుల్లో.. 101



లండన్: దూకుడు బ్యాటింగ్‌కు మారుపేరైన పాకిస్థాన్ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది మరోసారి రికార్డు స్కోరు సాధించాడు. ఈ సారి వేదిక.. ఇంగ్లాండ్ కౌంటీ పోరు. హాంప్‌షైర్ తరపున ఓ టీ20 మ్యాచ్‌లో మెరుపు వేగంతో 43 బంతుల్లోనే 101 పరుగులు బాదేసి జట్టును గెలిపించాడు. మంగళవారం జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో హాంప్‌షైర్ 101 పరుగుల భారీ తేడాతో డెర్బీషైర్‌పై గెలిచింది. అఫ్రిది స్కోరులో ఏడు సిక్స్‌లు, 10 ఫోర్లు ఉన్నాయి. అఫ్రిది చెలరేగడంతో ముందుగా హాంప్‌షైర్ 8 వికెట్లకు 249 పరుగులు సాధించింది. ఇది ఆ జట్టుకు అత్యధిక టీ20 స్కోరు కూడా. తర్వాత డెర్బీషైర్ 148 పరుగులకే కుప్పకూలింది.

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వేన్ రూనీ గుడ్‌బై



లండన్: ఇంగ్లాండ్‌ఫుట్‌బాల్ స్టార్ వేన్ రూనీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. బుధవారం అతనీ ప్రకటన చేశాడు. తన నిర్ణయాన్ని వెంటనే అమలులో పెడుతున్నట్లు ఇంగ్లాండ్ జట్టు మేనేజర్ గరెత్ సౌత్‌గేట్‌కు రూనీ తెలియజేశాడు. జట్టులోకి తిరిగి రావాలని సౌత్‌గేట్ కోరినపుడు రూనీ ఆ విషయాన్ని స్పష్టంచేశాడు. 31 ఏళ్ల రూనీ ఇంగ్లాండ్ తరపున 119 మ్యాచ్‌లాడి రికార్డు స్థాయిలో 53 గోల్స్ చేశాడు. రూనీ ఇటీవలే కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయాడు. ''సౌత్‌గేట్ నాకు ఫోన్ చేయడం గొప్ప విషయం. అతను నన్ను తిరిగి జట్టులోకి రమ్మన్నాడు'' అని రూనీ చెప్పాడు.

ఎదురుందా?

- జోరుమీదున్న కోహ్లిసేన
- విశ్వాసం సన్నగిల్లిన లంక
- రెండో వన్డే నేడే

పల్లెకెలె: తొలి వన్డేలో 9 వికెట్ల గెలుపుతో జోరుమీదున్న భారత్.. మరోసారి తిరుగులేని విజయాన్ని సాధించడానికి సమాయత్తమవుతోంది. ప్రపంచకప్‌కు యువకుల్ని పరీక్షించాలనుకున్నా.. తొలి వన్డేలో టీమ్‌ఇండియాకు కొంత మేరే ఆ అవకాశం కలిగింది. టెస్టుల్లో ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్‌ను వన్డేలలో నాలుగో స్థానంలో ఆడించి పరీక్షించాలనుకున్నా ధావన్, కోహ్లిలే తొలి వన్డేలో చక్కబెట్టేశారు. ఈ నేపథ్యంలో కోహ్లి రెండో వన్డేకు జట్టులో పెద్దగా మార్పులు తలపెట్టకపోవచ్చు.

కుల్‌దీప్ బెంచ్‌కే: తొలి మ్యాచ్‌లో ఇద్దరు లెగ్‌స్పిన్నర్లు కాని, ఇద్దరు ఎడమచేతి వాటం స్పిన్నర్లను కాని ఒకేసారి ఆడించడానికి ఇష్టపడని కెప్టెన్ విరాట్.. చచల్-అక్షర్ పటేల్‌లను తీసుకున్నాడు.

లంక వికెట్లపై ముగ్గురు స్పిన్నర్లను ఆడించాల్సిన అవసరం లేదని కోహ్లి భావిస్తున్నాడు. ఇక్కడి పిచ్ పొడిగా ఉంటే తప్ప కుల్‌దీప్ యాదవ్‌ను బెంచ్‌కు పరిమితం కావడానికే అవకాశాలెక్కువ. మనీష్ పాండే, అజింక్య రహానే, శార్దూల్ ఠాకూర్ కూడా బెంచ్‌కే పరిమితం కాక తప్పదు. జట్టులో మార్పులు చేయకపోయినా... రాహుల్, కేదార్ జాదవ్‌లకు అవకాశమిచ్చేందుకు బ్యాటింగ్ ఆర్డర్‌లో విరాట్ మార్పులు తలపెడతాడా అన్నదే ఆసక్తికర అంశం. టీమ్‌ఇండియా బ్యాట్స్‌మెన్‌ను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపో యిన లంక బౌలింగ్‌లో వీరికి కాస్త బ్యాటింగ్ ప్రాక్టీసు ఉంటుందని అతను భావిస్తే మాత్రం ఆర్డర్‌లో మార్పులు జరుగుతాయి.

తుది జట్లు:


భారత్ (అంచనా): రోహిత్, ధావన్, కోహ్లి (కెప్టెన్), రాహుల్, ధోని (కీపర్), కేదార్ జాదవ్, పాండ్య, అక్షర్, భువనేశ్వర్, బుమ్రా, చచల్.

శ్రీలంక (అంచనా): డిక్వెల (కీపర్), గుణతిలక, మెండిస్, తరంగ (కెప్టెన్), మాథ్యూస్, కపుగెదెర, సిరివర్ధన, పుష్పకుమార, చమీర, మలింగ, ఫెర్నాండో.

పోరాడి ఓడిన దబాంగ్

లక్నో: ప్రొ కబడ్డీ లీగ్ పోరులో హర్యానా స్టీలర్స్ బుధవారం దబాంగ్ ఢిల్లీపై చెమటోడ్చి గెలిచింది. ఈ పోరులో హర్యానా 27-25 తేడాతో విజయం సాధించింది. రెండో అర్ధంలో ఓ దశలో దబాంగ్‌దే విజయం వరిస్తుందనిపించింది. తొలి అర్ధంలో నిరాశాజనకంగా ఆడడం వల్లే దబాంగ్ ఓటమి చవిచూసింది. దీపక్ కుమార్ దహియా ఏడు రైడ్ పాయింట్లు సాధించి స్టీలర్స్‌ను విజయపథంలో నడిపించాడు. ఆట ఆరంభంలోనే దబాంగ్ 2-0 ఆధిక్యం సంపాదించింది. హర్యానా మాత్రం నిదానంగా పాయింట్ల సాధన ఆరంభించింది. దీపక్ నాలుగో నిమిషంలో రెండు పాయింట్లు సంపాదించడంతో హర్యానా 5-3 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. తొలి అర్ధం ముగిసేసరికి హర్యానా ఆలౌట్ చేసి దబాంగ్‌పై ఒత్తిడి పెంచింది. హర్యానా డిఫెన్స్ దుర్భేధ్యంగా ఉండడంతో దబాంగ్‌కు పాయింట్లు సంపాదించడం తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: M Satish Chandar, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.



- జాతి చిరకాల స్వప్నమైన నదుల అనుసంధానం పట్టిసీమ ద్వారా కృష్ణా-గోదావరి పవిత్రసంగమంతో సాకారంచేసిన ఘనత అపర భగీరథుడైన మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబునాయుడు గారిదే. ఈ పట్టిసీమ ద్వారా 2015 ఖరీఫ్ నుండి నేటివరకు తరలించిన గోదావరి జలాలు 100 టీఎంసీలు.
- 162 ఏళ్ల చరిత్ర కలిగిన కృష్ణా డెల్టాకు సాగునీటి భద్రత, రాయలసీమకు త్రాగు మరియు సాగునీరు అందించాలని ప్రభుత్వ సంకల్పం. ఏటా సుమారు 3 వేల టీఎంసీల గోదావరి జలాలు వృధాగా సముద్రంపాలవుతున్నాయి. ఆ వరద జలాలను వినియోగించుకోటానికి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును చేపట్టింది. ఆ ప్రాజెక్టు ఫలాలను ముందుగానే రైతాంగానికి అందించాలనే మహాసంకల్పంతో మన ముఖ్యమంత్రి గారి పట్టుదల... ప్రణాళిక... పరిశ్రమతో రూపుదిద్దుకున్నదే పట్టిసీమ ఎత్తిపోతల పథకం.
- పథకం రూపుదిద్దుకున్నప్పటినుంచి నేటివరకు ప్రకాశంబ్యారేజికి ఎగువనుండి కృష్ణానదీ జలాలు తగినన్ని రాలేదు. అయినప్పటికీ 2015 ఖరీఫ్ నుండి నేటివరకు కృష్ణాడెల్టా పంటలకు ప్రాణాధారంగా నిలిచింది పట్టిసీమ నుండి వచ్చిన 100 టీఎంసీల గోదావరి జలాలే. అందుకు ముఖ్యమంత్రి గారి దూరదృష్టే కారణం.

100 టీఎంసీలు.. పట్టిసీమ ద్వారా తొలి ఏడాది 4.20 , మలి ఏడాది 55.60, ఈ ఏడాది 40.20 టీఎంసీలు.... కలిపి మొత్తం నేటివరకు 100 టీఎంసీలు గోదావరి జలాలను కృష్ణాడెల్టాకు మళ్ళింపు.

డెల్టాకు నీటి భద్రత.... 13 లక్షల కృష్ణాడెల్టా ఆయకట్టుకు కల్పించబడిన నీటిభద్రత. వరి సాగుతోపాటు ఆక్వా రంగానికి మరియు త్రాగునీటికి కూడా ఒనగూడిన నీటిభద్రత.

పెరిగిన దిగుబడి.. సారవంతమైన గోదావరి జలాలతో తగ్గిన ఎరువుల వినియోగం మరియు పెట్టుబడి వ్యయం...... తద్వారా పెరిగిన పంట దిగుబడులు.

8 వేల కోట్ల ఆదాయం... 2015 ఖరీఫ్‌లో 2,500 కోట్లు.... 2016 ఖరీఫ్‌లో 5,500 కోట్లు..... మొత్తం రెండేళ్లలో 8 వేల కోట్ల విలువ గల పంట దిగుబడి.

జూన్‌లోనే సాగునీరు ... పట్టిసీమ ఎత్తిపోతల పథకం వల్లనే 2017లో జూన్ మాసంలోనే కృష్ణాడెల్టాకు తరలివచ్చిన గోదావరి జలాలు. తద్వారా అక్టోబరు మాసంలోనే పంట చేతికొచ్చి, నవంబరులో వచ్చే తుఫానుల బారిన పడకుండా రక్షణ.

జలవనరుల శాఖ

జారీచేసినవారు : కమిషనర్, సమాచార పౌరసంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము.